# ది క్రైమ్ న్యూస్

Crime News

తెలుగు దినపత్రిక

బుధవారం, జూన్ 24, 2026 | సంపుటి - 20 | సంచిక 270 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


ఇందిరమ్మ రాజ్యమంటూ

## పేదల ఇళ్ల కూల్చివేత

- పేదల ఇళ్లను లాక్కుంటున్న రెవెన్యూ మంత్రి
- ఖమ్మం జర్నలిస్టులు ఏం పాపం చేశారు...వారికి ఇళ్లేవి
- ఖమ్మం పర్యటనలో మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు



ఖమ్మం : సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ ఇందిరమ్మ రాజ్య మంటూనే పేదల ఇళ్లుకూలగొడు తోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వ మైనా పేదలకు అండగా నిలిచి వాళ్లకు గూడు కట్టిస్తుందని తెలిపారు. రెవెన్యూ మంత్రి హయాంలో పేదల ఇళ్లు 2లో

కేంద్రమంత్రి రామ్మోహన్‌తో

## రాష్ట్ర మంత్రుల భేటీ

### గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై తుమ్మల విజ్ఞప్తి



న్యూఢిల్లీ : కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేపట్టాలని కేంద్రమంత్రికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ స్థాపనపై చొరవ తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పాదన చేసిన వెంటనే స్పందించి.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరఫున ఫీజిబులిటీ సర్వే చేసినందుకు రామ్మోహన్ నాయుడికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఫీజిబులిటీ సర్వేలో ప్రతిపాదిత స్థలం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం అనువుగా లేనందున మరో స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతిపాదన చేసినట్లు చెప్పారు. అక్కడ త్వరగా ఫీజిబులిటీ సర్వే చేసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రికి తుమ్మల విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తరువాయి 2లో



హైదరాబాద్ మెట్రో రైల్

## ఫేజ్-2కు గ్రీన్ సిగ్నల్

### కేంద్రమంత్రులతో సిఎం రేవంత్ చర్చలు ఫలప్రదం

- ఖట్టర్ నివాసంలో కిషన్‌రెడ్డితో కలసి భేటీ
- మెట్రో రైలుపై చర్చల్లో కీలక పురోగతి



న్యూఢిల్లీ : మంగళవారం ఉదయం కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు ఉన్నతస్థాయి సంయుక్త సమావేశం జరిగింది. ఈ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్, జి. కిషన్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. మెట్రో విస్తరణ, నిధుల సమీకరణ, కేంద్ర-రాష్ట్ర ఉమ్మడి భాగస్వామ్యంపై ఈ సమావేశంలో అందరూ ఒక ఏకాభిప్రాయానికి వచ్చారు. మెట్రో ప్రాజెక్టును ఆర్థికంగా, సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతిష్ఠాత్మక ఆర్థిక సలహా సంస్థను కన్‌స్టలెంట్‌గా ఎంపిక చేశారు. ఈ సంస్థ ప్రధాన అంశాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇవ్వనుంది. తరువాయి 2లో

**హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు భవిష్యత్తుకు సంబంధించి అత్యంత కీలకమైన అడుగు పడింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రులతో జరిపిన వరుస సమావేశాలు విజయవంత మయ్యాయి. మెట్రో ఫేజ్-1ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం, అలాగే ఫేజ్-2 విస్తరణ పనుల్లో ఉన్న అన్ని ప్రధాన ఆటంకాలు ఈ చర్చలతో తొలగిపోయాయి.**

## నీట్‌తో విద్యార్థుల్లో గందరగోళం

- హిందీ మనకు అసవరం లేదు
- తమిళం, ఇంగ్లీస్ సరిపోతుంది
- కుటుంబ పార్టీలకు తాము వ్యతిరేకం
- ప్రజలంతా తమ కుటుంబమనే భావనతో పాలన
- ఎన్నో అవమానాలు ఎదుర్కొని ఇక్కడికి వచ్చా
- ప్రజల సంపూర్ణ మద్దతుతో అధికారం చేపట్టాం
- కరూర్ తొక్కిసలాట ఘటన మరచిపోలేని విషాదం
- అసెంబ్లీలో సిఎం విజయ్ కీలక ప్రసంగం



చెన్నై : తమిళనాడు విద్యార్థుల్లో నీట్ అసమానతల్ని సృష్టిస్తోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ అన్నారు. అసమానతలకు కారణమైన నీట్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమిళనాడు అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్ మంగళవారం కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా హిందీ వివాదం, నీట్, కరూర్ తొక్కిసలాట ఘటన వంటి పలు అంశాలను ప్రస్తావించిన విజయ్ విమర్శకులకు బదులిచ్చారు. 2లో

ఆయిల్‌పామ్ రైతులకు

## రక్షణ కల్పించాలి

### దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలి

- తెలంగాణకు తక్షణమే డీఏపీ, యూరియా సరఫరా చేయాలి
- పప్పుధాన్యాలు, నూనెగింజల కొనుగోలుపై 25 శాతం పరిమితి ఎత్తివేయాలి
- మొక్కజొన్న, జొన్నలను కేంద్రం ఎంఎస్‌పిపై కొనుగోలు చేయాలి
- కేంద్ర మంత్రులను కలిసిన తుమ్మల, ఉత్తమ్

## ఘనంగా పద్మపురస్కారాల ప్రదానం

- పద్మభూషణ్ అందుకున్న నటుడు మమ్ముట్టి
- పద్మశ్రీలు అందుకున్న మురళీమోహన్, రాజేంద్రప్రసాద్
- కార్యక్రమంలో ప్రధాని మోడీ తదితరుల హాజరు





## మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం

### ప్రభుత్వం జీవో విడుదల..చేతల ప్రభుత్వం అన్న లోకేశ్

అమరావతి : వడ్డెరలకు క్వారీల్లో 33శాతం వాటా ఇస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. తమది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. 'యువగళం పాదయాత్రలో ప్రజలు పడుతున్న కష్టాలు ప్రత్యక్షంగా చూశా.నాటి పాదయాత్ర సమయంలో తమ కులవృత్తిని కొనసాగించేందుకు క్వారీలు కేటాయించాలని వడ్డెర సోదరులు నన్ను కలిశారు. ఆనాడు నేను ఇచ్చిన హామీ మేరకు క్వారీల్లో 33 శాతం వాటాను వడ్డెరలకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నం. 126 జారీ చేసింది. తరువాయి 2లో



జగన్ కబంధ హస్తాల్లో

## వైకాపా కాపు నేతలు

- పవన్, బాబుల మధ్య చిచ్చు పెట్టే రాజకీయం
- జగన్ కుల రాజకీయాలపై మండిపడ్డ నిమ్మల

అమరావతి : జగన్ కబంధ హస్తాల్లో వైకాపా కాపు నేతలు ఇరుక్కున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. వైకాపా నేరస్థులను తయారు చేసే కర్మాగారం అని ఆరోపించారు. కూటమిలో చీలికల కోసం గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోందన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ రామలక్ష్మణుల్లా కలిసే ఉంటారని, వారి బంధం విడదీయటం ఎవరితరం కాదని మంత్రి నిమ్మల స్పష్టం చేశారు. అమరావతిలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024 ఓటమి నిరాశ, నిస్పృహలతో, ప్రాంతాలు, మతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టి చలికాచుకోవాలని గొడ్డలి పార్టీ చూస్తోందని ధ్వజమెత్తారు. 2లో



ఎపి కేబినేట్ కీలక

## నిర్ణయాలకు ఆమోదం

### 80కి పైగా అంశాలకు గ్రీన్ సిగ్నల్

- వివిధ ప్రాంతాల్లో పెట్టుబడులకు పెద్దపీట
- పరిశ్రమలు, ఐటీ,పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లకు ప్రాధాన్యం రూ.34వేల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా 35వేల ఉద్యోగాల కల్పన
- ఉండవల్లిలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన
- జ్యుడిషియల్ అకాడమీ నిర్మాణానికి రూ.139 కోట్ల వ్యయం
- అమరావతిలో ఫైవ్‌స్టార్ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లకు ప్రోత్సాహకాలు

అమరావతి : ఏపీ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్ష తన జరిగిన భేటీలో 80కి పైగా అజెండా అంశాలకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వివిధ ప్రాంతాల్లో పెట్టుబడుల స్థాపనకు పెద్దపీట వేస్తూ మంత్రి వర్గం నిర్ణయం తీసుకుంది. పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో తీసుకున్న దాదాపు రూ. 34వేల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా 35వేల ఉద్యోగాల కల్పన సంబంధించిన నిర్ణయాలకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తరువాయి 2లో

# ఇందిరమ్మ రాజ్యమంటూ పేదల ఇళ్ల కూల్చివేత

లాక్కోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లాలో హరీశ్‌రావు పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఖమ్మం కలెక్టర్‌తో మాట్లాడి పేదల గూడు లాక్కుంటే ఊరుకోబోమని చెప్పామని అన్నారు. ఎవరి స్థలాలు అయితే లాక్కున్నారో.. వారికి వెంటనే స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టివ్వాలని డిమాండ్ చేశారు. ఖమ్మంలో జర్నలిస్టులకు తక్షణమే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఖమ్మంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే తానే పోరాడుతానని స్పష్టం చేశారు. తాను దగ్గరుండి ఖమ్మం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానని భరోసా కల్పించారు. హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారని అన్నారు. మరి ఖమ్మం జర్నలిస్టులు ఏం పాపం చేశారని ప్రశ్నించారు. ఖమ్మం జర్నలిస్టులకు ఎందుకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం లేదని నిలదీశారు. ఖమ్మంలో పేదల ఇళ్లు లాక్కుంటే చూస్తూ ఊరుకోమని.. ఎంతటి పోరాటానికైనా వెనుకాడేది లేదని హరీశ్‌రావు స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి తనకు హిట్లర్ ఆదర్శమని పెట్టి హైడ్రా పెట్టారని ఎద్దేవా చేశారు. ఆయనకు కళ్లు నెత్తికెక్కాయని.. అహంకారాన్ని ప్రదర్శించే వాళ్లే హిట్లర్‌ని ఆదర్శంగా తీసుకుంటారని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి పాలనంతా బ్లాక్‌మెయిల్ పాలన అయిపోయిందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి పాలనలో కనీసం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వని దుస్థితి ఉందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

# ఏపి కేబినేట్ కీలక నిర్ణయాలకు ఆమోదం

ఉండవల్లిలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన, ఏపీ జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణానికి రూ.139 కోట్ల వ్యయంతో పనులు చేపట్టడం తదితర నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. అమరావతిలో ఫైవ్‌స్టార్ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖ, తిరుపతి, కర్నూలు, అన్నవరం ప్రాంతాల్లోనూ పర్యాటక ప్రాజెక్టులకు క్యాబినెట్ అంగీకారం తెలిపింది. ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి మంత్రివర్గం అంగీకారం తెలిపింది. అనంతపురం, కడప జిల్లాల్లో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులకు భూముల కేటాయింపులు, బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. అమరావతి ల్యాండ్ పూలింగ్ స్కీమ్ మొదటి, రెండో దశ కోసం సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లకు సంబంధించి 95 తాత్కాలిక పోస్టుల మంజూరుకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 30 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర కేబినెట్ శుభవార్త చెప్పింది. ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వరంగ సంస్థలు, గురుకుల విద్యాసంస్థలు, సొసైటీ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్ల పెంపునకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే, మెమో-57 ప్రకారం 2004 సంవత్సరానికి ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన సుమారు 11 వేల మంది ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ నుంచి పాత పెన్షన్ విధానం అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపడంతో ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# కేతన్ అగర్వాల్ మర్డర్ కేసులో షాకింగ్ విషయాలు

**ప్రియుడితో కలసి కాబోయే భార్య సియా మర్డర్ ప్లాన్**

**లోయలోకి తోసి హత్య చేసినట్లు పోలీసుల నిర్ధారణ**

**సియాను, ప్రియుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

ముంబై,జూన్23 : మహారాష్ట్రకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త విశాల్ అగర్వాల్ కుమారుడు కేతన్ అగర్వాల్ మర్డర్ కేసులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. కాబోయే భార్య సియా, ఆమె ప్రియుడు చేతన్ చౌదరీలు కలిసే కేతన్‌ను లోయలోకి తోసేసినట్లు పోలీసులు తేల్చారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నాతాధికారులు సైతం విచారం వ్యక్తం చేస్తున్నారు. కేతన్ అగర్వాల్‌కు సియా గోయల్ అనే అమ్మాయితో కొన్ని రోజుల క్రితం పెళ్లి నిశ్చయం అయింది. నవంబర్‌లో పెళ్లి జరగాల్సి ఉంది. గురువారం సియా పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా సియ, కేతన్ లోనావాలాకు ట్రెక్కింగ్‌కు వెళ్లారు. లోహగడ్ కోటకు వెళు తుండగా కేతన్ లోయలో పడిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫొటోలు దిగుతుండగా ప్రమాదవశాత్తు కేతన్ లోయలో పడిపోయాడని సియా పోలీసులకు చెప్పింది. 3 గంటల రెస్క్యూ ఆపరేషన్ తర్వాత లోయలో కేతన్ శవాన్ని కనుగొన్నారు. పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. లోనావాలా రూరల్ పోలీసులు సియాను విచారించగా.. ఆమె పొంతన లేని సమాధానాలు చెప్పటం మొదలెట్టింది. దీంతో పోలీసులకు ఆమెపై అనుమానం వచ్చింది. మొబైల్ డేటా, కాల్ రికార్డ్స్ సేకరించటంతో పాటు సంఘటనా స్థలంలో ఉన్న జనాలను విచారించారు. దీంతో ఆమెపై అనుమానం మరింత పెరిగింది. ఈ నేపథ్యంలోనే సియాను, ఆమెను ప్రియుడిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా అసలు విషయం బయటపడింది. సియా, ఆమె ప్రియుడు చేతన్ చౌదరీలు పక్కా ప్లాన్‌తో కేతన్‌ను మర్డర్ చేసినట్లు తేలింది. ఇద్దరూ కలిసి కేతన్‌ను లోయలో తోసేశారని వెల్లడైంది. ఈ మర్డర్ ఇద్దరే చేశారా? లేక వారికి ఎవరైనా సహకరించారా? అన్న కోణంలో కూడా పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు చెబుతున్న దాని ప్రకారం.. కేతన్‌ను పెళ్లి చేసుకోవటం సియాకు ఏమాత్రం ఇష్టం లేదు. ఆమె చేతన్ చౌదరీని ప్రేమిస్తోంది. ఇద్దరూ ఒకే ఆఫీస్‌లో కలిసి పని చేస్తున్నారు. ప్రియుడి సాయంతో కేతన్ అడ్డు తొలగించుకోవాలని ఆమె భావించింది. ఈ నేపథ్యంలోనే ఇద్దరూ పక్కా ప్లాన్ వేసుకున్నారు. సియా తన పుట్టిన రోజున కేతన్‌ను లోహగడ్‌కు ట్రెక్కింగ్‌కు తీసుకెళ్లింది. సరైన సమయం దొరకగానే తన ప్రియుడు చేతన్ సాయంతో కేతన్‌ను లోయలోకి తోసేసింది. కేతన్ ప్రమాదవశాత్తు లోయలో పడిపోయాడని పోలీసులను నమ్మించే ప్రయత్నం చేసింది. దర్యాప్తులో ఆమె చేసిన నేరం బయటపడింది. కొడుకు పెళ్లి కోసం విశాల్ అగర్వాల్ ఇప్పటికే 20 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. పెళ్లి నవంబర్ నెలలో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జరగాల్సి ఉంది. విశాల్ 17 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి పెళ్లి కోసం ఇప్పటికే ప్యాలెస్ బుక్ చేశాడు. అంతేకాదు.. బంధుమిత్రులను, అతిథులను తరలించడానికి విమానాలను కూడా బుక్ చేశాడు. పెళ్లికి ఇంకా ఐదు నెలలు ఉన్నా కూడా ఇప్పటినుంచే రెండు కుటుంబాల వారు పెళ్లి పనులు మొదలెట్టారు. సియా చేసిన దారుణం కారణంగా రెండు కుటుంబాల వారు షాక్‌లో ఉన్నారు.

# అమెరికా పౌరసత్వం మరింత ఖరీదు

**ఫైలింగ్ ఫీజులను 75శాతం పెంచే యోచన**

వాషింగ్టన్,జూన్23 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇమిగ్రేషన్ రూల్స్‌ను కఠినతరం చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆయన కార్యవర్గం చేసిన ప్రతిపాదనలతో అమెరికా పౌరసత్వం మరింత ఖరీదుగా మారనుంది. పౌరసత్వ దరఖాస్తుల ఫైలింగ్ ఫీజులను 75 శాతం మేర పెంచాలని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ ప్రతిపాదించింది. సక్రమ మార్గంలో వచ్చిన వలసదారులు పౌరసత్వానికి దరఖాస్తు చేసుకుంటే.. ప్రాసెసింగ్, వెట్టింగ్ ఖర్చులు భరించాల్సిరావడంతో పాటు ఇప్పటివరకు ఉన్న పలు మినహాయింపులను కూడా కోల్పోనున్నారు.

# హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2కు గ్రీన్ సిగ్నల్

ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రో ఫేజ్-1ను ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకుంటున్న నేపథ్యంలో.. దానికి సంబంధించిన అప్పులు, ఈక్విటీ విలువ రుణ సేకరణపై రోడ్ మ్యాప్ తయారు చేస్తుంది. ఫేజ్-2 కింద ప్రతిపాదించిన కారిడార్ల నిర్మాణ వ్యయం ఎంత అవుతుంది? నిధుల కోసం ఏయే అంతర్జాతీయ రుణ సంస్థలను ఎంచుకోవాలి? అనే అంశాలపై నివేదిక అందిస్తుంది. ఈ కన్సల్టెంట్ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా తదుపరి అడుగులు వేస్తాయి. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో ఒక ప్రత్యేక సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో కేంద్రప్రభుత్వ ప్రతినిధితో పాటు తెలంగాణ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి సమన్వయ సభ్యులుగా వ్యవహరిస్తారు. కేంద్ర నిబంధనల ప్రకారం డీపీఆర్ లలో మార్పులు చేస్తూ, పనుల అనుమతుల ప్రక్రియను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఈ పరిణామంతో హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణకు కేంద్ర ఆమోదం లభించడం సులభతరం కానుంది. ఇది హైదరాబాద్ నగర ట్రాఫిక్ కష్టాలను తీర్చడమే కాక, భవిష్యత్తు ప్రజా రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిలవనుంది. కేంద్రమంత్రి ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో.. హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. మెట్రో ప్రాజెక్టుకు అప్పులు, రెండో ఫేజ్‌కు అనుమతులు, నిధులు కావాలని సీఎం రేవంత్ కోరినట్లు సమాచారం. సమావేశంలో సీఎస్ రామకృష్ణ రావు, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు. రెండు రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోనే ఉన్నారు. కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలతో బిజీబిజీగా గడుపు తున్నారు. ఇప్పటికే ఢిల్లీలో ఉన్న మంత్రి శ్రీధర్ బాబు.. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కలిశారు. అలాగే, తెలంగాణ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు ఉదయం ఢిల్లీకి చేరుకున్నారు. మధ్యాహ్నం 1 గంటకు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద జోషిని ఇరువురు మంత్రులు కలవనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని కోరనున్నారు. అనంతరం కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో సమావేశమై.. యూరియా సరఫరా పెంచాలని మంత్రులు ఉత్తమ్ కుమార్, తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేయనున్నారు.

# నీట్‌తో విద్యార్థుల్లో గందరగోళం

ఈ మేరకు అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందీ భాషనూ వ్యతిరేకించారు. తమిళం, ఇంగ్లీష్‌లతో కూడిన ద్విభాషా విధానానికే తాము కట్టుబడి ఉంటామన్నారు. నీట్ వల్ల సామాజిక అసమానతలు పెరుగు తున్నాయని సీఎం విజయ్ చెప్పుకొచ్చారు. విద్యార్థులపై తీవ్ర మానసిక ఒత్తిడి తెస్తున్న ఈ పరీక్షను రద్దుచేసి, ఇంటర్ మార్కుల ఆధారంగా వైద్య సీట్లను కేటాయించాలని తమిళనాడు చాలా కాలంగా కోరుతోందని ఆయన గుర్తుచేశారు. హిందీ భాషపైనా స్పందిస్తూ.. తమిళం రాష్ట్ర భాషగా, ఇంగ్లీష్ అంతర్జాతీయ భాషగా సరిపోతాయని తన వైఖరిని స్పష్టం చేశారు. మూడో భాషను బలవంతంగా రుద్దాల్సిన అవసరంలేదని, రెండు భాషల విధానమే కొనసాగుతుందని తేల్చి చెప్పారు. తమ పార్టీని విమర్శించే వారికి ఈ సందర్భంగా గట్టిగా సమాధాన మిచ్చారు సీఎం విజయ్. ప్రజల మద్దతుతోనే తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధికారంలోకి వచ్చిందన్న ఆయన.. దీని వెనుక ఎన్నో కుట్రలు, సవాళ్లను ఎదుర్కొ న్నామన్నారు. 'జనం గుండెల్లో స్థానం సంపాదించడం అంత సులువు కాదు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే ఇక్కడకు వచ్చాం. అయినప్పటికీ కొందరు 'నటుడి పార్టీ' అనే విమర్శలు గుప్పిస్తున్నారు. వాటన్నింటినీ మేం పట్టించుకోం. మా రాజకీయాలు పారదర్శకంగా ఉంటాయని విజయ్ చెప్పుకొచ్చారు. అలాగే కుటుంబ రాజకీయాలపై ఆయన మాట్లాడుతూ.. 'మా రాజకీయాలు ఒక్క కుటుంబం కోసమే కాదు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం మాదే. అదే మా పాలన.. అదే మా లక్ష్యం' అని స్పష్టం చేశారు. ఎన్నో సవాళ్లను దాటి తాము అధికారంలోకి వచ్చామని, నటుడి పార్టీ అని తమను ఎంతోమంది ఎగతాళి చేశారని గుర్తుచేసుకున్నారు. మాకు ఈ అధికారం అంత సులువుగా వచ్చింది కాదు. తమిళనాడు ప్రజల హృదయాలను గెలుచుకునేందుకు నేను, నా పార్టీ ఎన్నో కుట్రలు, సవాళ్లను అధిగమించాల్సి వచ్చింది. మాది యాక్టర్ పార్టీ అని, నేను సినిమా షూటింగ్ నుంచి నేరుగా సీఎం కుర్చీలో కూర్చున్నానని చాలా మంది గేలి చేశారు. అలాంటి విమర్శలు నేను పట్టించుకోను. సాధారణంగా చాలా మంది రాజకీయ పార్టీ పెట్టి ప్రజల్లోకి వెళ్తారు. కానీ, నేను ప్రజల్లోకి వెళ్లిన తర్వాత పార్టీ పెట్టి ఎన్నికల్లో పోటీ చేశా. నాపై నమ్మకం ఉంచి ప్రజలు గెలిపించారని విజయ్ అన్నారు. తమిళనాడులో ద్విభాషా విధానానికే తాము కట్టుబడి ఉన్నట్లు సీఎం పునరుద్ఘాటించారు. హిందీ భాషను రుద్దేందుకు కేంద్రం చేస్తోన్న ప్రయత్నాలను తాము ఎప్పటికీ అంగీకరించబోమన్నారు. ప్రసంగంలో భాగంగా ఎన్నికల ప్రచార సమయంలో చోటుచేసుకున్న కరూర్ తొక్కిసలాట ఘటనను విజయ్ ప్రస్తావించారు. 41 మంది ప్రాణాలు కోల్పోయిన ఆ విషాద ఘటన నన్ను ఎంత వేదనకు గురిచేసిందో మాటల్లో చెప్పలేను. ఆ బాధ నన్ను ఎన్నటికీ వదలదు. ఆ ఘటన విషయం లోనూ మాపైనే నిందలేశారు. ఇది అత్యంత దారుణం. రాజకీయాలు ఇంత క్రూరంగా ఉంటాయా అని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారసత్వ రాజకీయాల గురించి స్పందిస్తూ డీఎంకేపై విజయ్ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. డీఎంకేను ఉద్దేశిస్తూ కేవలం ఒక కుటుంబానికే ప్రాధాన్యమివ్వడం మా రాజకీయ విధానం కాదు. తమిళనాడులోని ప్రతి కుటుంబానికి మా సేవలందిస్తాం. అదే మా రాజకీయం. అదే మా పాలనా విధానమని విజయ్ పేర్కొన్నారు.

# ఘనంగా పద్మపురస్కారాల ప్రదానం

న్యూఢిల్లీ : రాష్ట్రపతి భవన్‌లో రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 65 మంది ప్రముఖులకు పద్మ అవార్డులు అందజేశారు. ఈ విడతలో మొత్తం 2 పద్మ విభూషణ్, 7 పద్మభూషణ్, 56 పద్మశ్రీ పురస్కారాలు ప్రదానం చేశారు. సినీ, సాహిత్య, వైద్య, క్రీడా తదితర రంగాల్లో విశేష కృషి చేసిన పలువురు ప్రముఖులు ఈ గౌరవాలను అందుకున్నారు. మలయాళ సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ నటుడు మమ్ముట్టికి పద్మభూషణ్ పురస్కారం లభించింది. అలాగే ప్రముఖ వైద్య నిపుణులు నోరి దత్తాత్రేయుడుకు కూడా పద్మభూషణ్ అవార్డు ప్రదానం చేశారు. తెలుగు సినీ రంగానికి చెందిన ప్రముఖ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌తో పాటు నటుడు ఆర్. మాధవన్‌కు పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. క్రికెటర్ రోహిత్ శర్మకు కూడా పద్మశ్రీ అవార్డును రాష్ట్రపతి అందజేశారు. ప్రఖ్యాత మలయాళ పాత్రికేయుడు పి.నారాయణన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేటీ థామస్ పద్మవిభూషణ్ అందుకోగా.. సినీ రంగ ప్రముఖులు మమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌తో పాటు ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్ పురస్కారాలను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి నేడు పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నవారిలో సినీ నటులు మాగంటి మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్ ఉన్నారు. అలాగే, వీరితో పాటు సినీనటుడు మాధవన్, క్రికెటర్ రోహిత్ శర్మ, పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ పురస్కారాలను అందుకున్నారు. దేశంలోని పలు రంగాల్లో విశేష సేవలందించిన వారికి భారత గణతంత్ర దినోత్సవం వేళ కేంద్రం మొత్తం 131 మందికి పద్మ పురస్కారాలకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. తొలి విడతలో 66 మందికి అందజేయగా.. మిగతా వారికి మంగళవారం ప్రదానం చేశారు. దేశ అభివృద్ధికి, తమ తమ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులను గౌరవించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది పద్మ పురస్కారాలను ప్రదానం చేస్తోంది. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ రైతులకు రక్షణ కల్పించాలి

న్యూఢిల్లీ : తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని బృందం మంగళవారం న్యూఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, రైతాంగ ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ, రైతుల ప్రయోజనాల పరిరక్షణ, దేశీయ వంటనూనెల ఉత్పత్తి పెంపుపై విస్తృతంగా చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్-ఆయిల్ పామ్ లక్ష్యాలను అత్యంత సమర్థవంతంగా అమలు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి తుమ్మల వివరించారు. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు 3 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరించగా, 70 వేల మందికిపైగా రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారని తెలిపారు. రాబోయే మూడేళ్లలో ఈ విస్తీర్ణాన్ని 10 లక్షల ఎకరాలకు పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. భారత్ ప్రస్తుతం వంటనూనెల అవసరాల్లో దాదాపు 60 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోందని, ఈ పరిస్థితిని మార్చేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన ఔఓఇక్ష-క్షఖ కార్యక్రమం దేశ ఆర్థిక వ్యవస్థకు, రైతాంగానికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. అయితే ఇటీవల క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 44 శాతం నుంచి 16 శాతానికి తగ్గించడం వల్ల దేశీయ ఆయిల్ పామ్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దిగుమతి సుంకం తగ్గింపుతో విదేశాల నుంచి చౌక ధరలకు పామాయిల్ దిగుమతులు పెరిగి దేశీయ మార్కెట్లో ధరలు పడిపోతున్నాయని, దీనివల్ల ఆయిల్ పామ్ రైతులు ఉత్పత్తి చేస్తున్న ఫ్రెష్ ఫ్రూట్ బంచ్‌లకు గిట్టుబాటు ధర లభించడం లేదని వివరించారు. దీర్ఘకాలిక పంట అయిన ఆయిల్ పామ్ సాగుకు రైతులు భారీగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో ధరల అనిశ్చితి రైతుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. దిగుమతి సుంకాన్ని తిరిగి 44 శాతానికి పెంచడం ద్వారా దేశీయ ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిన ఆత్మనిర్భర్ భారత్, ఎడిబుల్ ఆయిల్ స్వయం సమృద్ధి లక్ష్యాలు కూడా సాధ్యమవుతాయని మంత్రులు పేర్కొన్నారు. అలాగే ఆయిల్ పామ్ రైతులకు కనీస గ్యారంటీ ధర విధానాన్ని అమలు చేసే అంశాన్ని కూడా కేంద్రం పరిశీలించాలని కోరారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఆయిల్ పామ్ రైతుల భవిష్యత్తు దృష్ట్యా దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించి రైతులకు భరోసా కల్పించాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని మంత్రులు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణ రైతాంగానికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు. రాష్ట్రంలో ఈ ఏడాది వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో డి.ఎ.పి, యూరియా ఎరువుల అవసరం గణనీయంగా పెరిగిందని, కేంద్రం కేటాయించిన కోటాకు మరియు వాస్తవ సరఫరాకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వెంటనే పూడ్చి, రాష్ట్రానికి పూర్తి స్థాయిలో ఎరువులు అందించాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఎరువుల సరఫరాను నిరంతరాయంగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పప్పుధాన్యాలు, నూనెగింజల కొనుగోళ్లపై ప్రస్తుతం అమలులో ఉన్న 25 శాతం పరిమితి రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నదని పేర్కొన్నారు. రైతులు ఉత్పత్తి చేసిన మొత్తం పంటను కనీస మద్దతు ధర (ఓ÷ూఖ) కింద కొనుగోలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుని ఆ పరిమితిని పూర్తిగా తొలగించాలని కోరారు. దీంతో పప్పుధాన్యాలు, నూనెగింజల సాగుకు మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు దేశ ఆహార భద్రత, దిగుమతుల తగ్గింపుకు కూడా దోహదపడుతుందని వివరించారు. ఏడాది తెలంగాణలో రికార్డు స్థాయిలో సుమారు 15 లక్షల టన్నుల మొక్కజొన్న, 3 లక్షల టన్నుల జొన్నల ఉత్పత్తి నమోదైందని, మార్కెట్ ధరలు కనీస మద్దతు ధర కంటే దిగువకు పడిపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే భారీ ఆర్థిక భారం భరించి మొక్కజొన్న, జొన్నలను కొనుగోలు చేసిందని, ఈ పంటలను కూడా కేంద్ర ప్రభుత్వ కొనుగోలు విధానంలో చేర్చి ఓ÷ూఖపై సేకరించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా రసాయనాలు-ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాకు తెలంగాణలో ఎరువుల సరఫరా, పోషకాధారిత ఎరువుల సబ్సిడీ విధానంలో మార్పులకు సంబంధించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల పలు లేఖలు రాయగా... ఈ వినతులపై స్పందించిన కేంద్ర మంత్రి తెలంగాణలో యూరియా, డి.ఎ.పి. తదితర ఎరువుల లభ్యత, సరఫరాపై కేంద్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని, రాష్ట్ర రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని శాఖ అధికారులను ఆదేశించినట్లు తన లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రస్తావించిన అంశాలపై కేంద్రం సానుకూలంగా స్పందించడం రైతాంగానికి ప్రయోజనకరంగా మారుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సమావేశాలలో మంత్రులు తుమ్మల, ఉత్తమ్ ల వెంట ఎంపిలు రఘువీర్ మరియు కొండ విశ్వేశ్వర్ రెడ్డి గారు పాల్గొన్నారు.

# మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయమే ధ్యేయంగా ముందుకు సాగుతోంది' అని అన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంపైట్ల వ్డదెర సంఘాల నేతలు, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# జగన్ కబంధ హస్తాల్లో వైకాపా కాపు నేతలు

సాక్షాత్తు కలియుగ దేవుడు వేంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని అపవిత్రం చేయాలనుకుంటే.. ఆ దేవుడే వారిని మొన్నటి ఎన్నికల్లో శిక్షించారని అన్నారు. పాస్టర్ ప్రవీణ్, కడప పాస్టర్ అభినయ్‌లను అడ్డుపెట్టుకుని మతాల మధ్య చిచ్చు పెట్టాలని జగన్ అండ్ కో చూస్తే బెడిసి కొట్టిందని ఎద్దేవా చేశారు. వైసీపీ కాపు నేతలను రెచ్చగొట్టి, తప్పులు చేయించి, జైలుకు పంపి రేపు బయటకు పోలేక, జీవితాంతం జగన్ చుట్టూ ఉండేలా, ఆయన అజెండా మాత్రమే అమలు చేసేలా పులివెందుల సంస్కృతిని ఏపీలో తీసుకువస్తున్నారని ఆగ్రహించారు.శ్రీలక్ష్మి, అంబటి రాంబాబు, పేర్ని నాని, గుడివాడ అమర్‌నాథ్ లాంటి వారితో జగన్ తప్పులు చేయించారని మంత్రి నిమ్మల మండిపడ్డారు. కొందరిని జైలుకు పంపారని, తద్వారా జగన్ ఉచ్చు లోంచి అంత త్వరగా బయటకు రాలేకపోయారని చెప్పుకొచ్చారు. నేరస్థులను తయారు చేసే కర్మాగారం గొడ్డలి పార్టీది అని వ్యంగ్యంగా అన్నారు. బలమైన నేతలను తయారు చేసే కర్మాగారం టీడీపీది అని అభివర్ణించారు. పలువురు నేతలను పెద్దల సభకు పంపింది తెలుగుదేశం పార్టీ అని ప్రస్తావించారు. చదలవాడ, ఆదికేశవులు, పప్పల చలపతిరావు వంటి వారికి టీటీడీ చైర్మన్ పదవి ఇచ్చి టీడీపీ గౌరవించిందని వ్యాఖ్యానించారు. జగన్ అధికారంలో ఉంటే భూమన కరుణాకర్ రెడ్డి, సుబ్బారెడ్డిలకు అవకాశాలు ఇచ్చారని దుయ్యబట్టారు. బ్రిటీష్ కాలంలో ఉన్న కాపుల రిజర్వేషన్‌ను నీలం సంజీవరెడ్డి తొలగించారని తెలిపారు. దామోదరం సంజీవయ్య ఇచ్చిన కాపుల రిజర్వేషన్‌లని.. కాసు బ్రహ్మానందరెడ్డి తొలగించారని మంత్రి నిమ్మల ఆరోపించారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన ఇచా ఐదు శాతం కాపు రిజర్వేషన్‌లను జగన్ రెడ్డి రద్దు చేశారని ఆగ్రహించారు. కాపు చరిత్రలో రిజర్వేషన్లు ఇచ్చింది దామోదరం సంజీవయ్య, చంద్రబాబు మాత్రమేనని తెలిపారు. నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, జగన్ రెడ్డి కాపు రిజర్వేషన్‌లను రద్దు చేసి కాపు ద్రోహులుగా మిగిలిపోయారని విమర్శించారు. రామలక్ష్మణులా మాదిరిగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి ఉన్నంత కాలం ఎవరూ విడదీయలేరని స్పష్టం చేశారు. వైసీపీకి అధికారం రాదనే అక్కసుతో పవన్ కల్యాణ్, కాపులను జగన్ టా÷-గ్గ÷ట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. కులాల మధ్య అడ్డుగోడలు ఉండకూడదనే లక్ష్యంతో చంద్రబాబు పని చేస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

# వరుస తనిఖీలు చేసినా కానరాని మార్పులు

**రెస్టారెంట్లలో అదే అపరిశుభ్రత..**

**ఫ్రీజర్లలో కాలం చెల్లిన పదార్థాలు**

**కంచి కేఫ్, కోడికూర చిట్టిగారెకు నోటీసులు**

హైదరాబాద్,జూన్23 : హైదరాబాద్ పరిధిలోని రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతున్న రెండు ప్రముఖ రెస్టారెంట్లలో నిబంధనల ఉల్లంఘనలను, తీవ్రమైన లోపాలను గుర్తించి నోటీసులు జారీ చేశారు. పుప్పాలగూడలోని కంచి కేఫ్‌లో నిర్వహించిన తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. కిచెన్, స్టోర్ రూమ్ మధ్య ఓపెన్ డస్ట్‌బిన్లు ఉండటంతో ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్వాసన వస్తూ, ఈగలు ముసురుతున్నాయి. స్టోర్ రూమ్ సీలింగ్‌పై దుమ్ము పేరుకుపోగా.. గ్రైండింగ్, కూరగాయలు కట్ చేసే ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండి అపరిశుభ్రంగా మారింది. అంతేకాకుండా, వంటకు ఉపయోగించే కాలీఫ్లవర్‌పై ఫంగస్ పెరిగినట్లు అధికారులు గుర్తించారు. డ్రెయిన్ల వద్ద దుర్వాసన రావడం, ఫ్రిజ్‌లలో నిల్వ చేసిన పిండిపై ఎలాంటి లేబులింగ్ లేకపోవడం గమనించారు. వంటగది, స్టోర్ రూమ్‌లలో ఈగలు, బొద్దింకలు తిరుగుతుండటంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటికి తోడు మెడికల్ ఫిట్‌నెస్, పెస్ట్ కంట్రోల్, వాటర్ టెస్టింగ్, ప్యాకేజింగ్ మెటీరియల్ టెస్టింగ్‌కు సంబంధించిన ఎలాంటి రికార్డులు రెస్టారెంట్ యాజమాన్యం వద్ద అందుబాటులో లేవు. దీంతో ఫుడ్ లేబులింగ్, హౌస్‌కీపింగ్ వెంటనే మెరుగుపరచాలని ఆదేశిస్తూ అధికారులు నోటీసులు ఇచ్చారు. నల్లగండ్లలోని కోడికూర చిట్టిగారే రెస్టారెంట్‌లోనూ తనిఖీలు కొనసాగాయి. ఇక్కడ నిల్వ ఉంచిన చికెన్, డెజర్ట్స్‌పై ఎలాంటి లేబుల్స్ లేవని అధికారులు గుర్తించారు. ఆ లేబుల్స్ లేని ఆహార పదార్థాలను అక్కడికక్కడే పారవేయించారు. గ్రైండింగ్ ఏరియా సీలింగ్‌పై దుమ్ము పేరుకుపోవడంతో పాటు కిచెన్ సీలింగ్ అంతా పూర్తిగా జిడ్డుగా మారినట్లు కనుగొన్నారు. ఆ జిడ్డును వెంటనే శుభ్రం చేయాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈ రెస్టారెంట్‌లోనూ ఉద్యోగుల మెడికల్ ఫిట్‌నెస్, ప్యాకేజింగ్ మెటీరియల్ టెస్టింగ్ రికార్డులు లేకపోవడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు తీవ్రంగా పరిగణించి నోటీసులు జారీ చేశారు.

# రేవంత్ కోరారు.. కేంద్రమంత్రులను కలిసాం

### ఎక్స్ వేదికగా కిషన్ రెడ్డి వెల్లడి

న్యూఢిల్లీ,జూన్23 : ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి సోమవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో, మంగళశారం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో రేవంత్ సమావేశమయ్యారు. ప్రధానంగా హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 విస్తరణపైనే చర్చ జరిగింది. రేవంత్‌తో కలిసి కేంద్ర మంత్రులను కలవడంపై కిషన్ రెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు.'కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండుసార్లు నాకు లేఖ రాశారు. 22వ తేదీన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో, 23వ తేదీన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో సమావేశం ఏర్పాటు చేయించాను. మెట్రో రైల్ విస్తరణపై సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయి. తెలంగాణ నుంచి కేంద్ర కేబినెట్ మంత్రిగా ఉన్న నేను రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం ఎల్లవేళలా పనిచేస్తా' అని ఎక్స్‌లో కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలి

### నిర్లక్ష్యపు కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలి

### రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జే అరుణశ్రీ

రామగుండం,జూన్23 : అభివృద్ధి పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలనీ, పనుల్లో జాప్యం, నిర్లక్ష్యం చేసే కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జే అరుణశ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలోని వివిధ పథకాల కింద చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పనుల నాణ్యత విషయంలో రాజీపడేది లేదన్నారు. క్షేత్ర స్థాయిలో పని పూర్తయిన తర్వాత సైట్ క్లియర్ చేసి రాకపోకలకు ఏలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చే అవకాశం లేకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలని అన్నారు. తగిన కారణం లేకుండా పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో నగర పాలక సంస్థ ఏఈ తేజస్విని, అన్వేష్, టెక్నికల్ ఆఫీసర్ సౌమ్య, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, పలువురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ

### బీబీనగర్ 46 పోలింగ్ కేంద్రాలకు బిఎల్‌వోల నియామకం

హైదరాబాద్,జూన్23 : ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు బీబీనగర్ మండలంలోని 46 పోలింగ్ కేంద్రాలకు బూత్ లెవల్ అధికారులను (బీఎల్‌వోలు) నియమించినట్లు తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీఎల్‌వోల పనితీరును పర్యవేక్షించేందుకు నలుగురు బీఎల్‌వో సూపర్‌వైజర్లను నియమించినట్లు పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ మేరకు జూన్ 25 నుండి జూలై 24 వరకు బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారమ్‌లను సక్రమంగా నింపేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించనున్నట్లు చెప్పారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటరు వివరాల సవరణలు, చిరునామా మార్పులు, కుటుంబ సభ్యుల వివరాల ధృవీకరణ వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. మండలంలోని గూడూరు, జైనపల్లి, కొండమడుగు, జియ్యాపల్లి, మహాదేవ్‌పూర్, రాయరావుపేట, నేమారుగొమ్ముల, వెంకిర్యాల, రుద్రవెల్లి, రాఘవాపురం, బ్రాహ్మణపల్లి, భట్టుగూడెం, బీబీనగర్‌తో పాటు వివిధ గ్రామాల్లో ఈ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమకు సంబంధించిన బీఎల్‌వోలను సంప్రదించి ఓటరు జాబితాలో అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# రామగుండం అభివృద్ధికి సహకరించండి

### ప్రిన్సిపల్ సెక్రటరీకి రామగుండం మేయర్ వినతి

హైదరాబాద్,జూన్23 : రామగుండం నగర అభివృద్ధికి సహకరించాలని పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ టీ.కే.శ్రీదేవిని నగర మేయర్ మహంకాళి స్వామి కోరారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో ని ఒక హోటల్లో మున్సిపల్ చైర్మన్, కార్పొరేషన్ మేయర్లకు మంగళవారం నిర్వహించిన ఓరియంటేషన్ కు రామగుండం మేయర్ స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా పురపాలక శాఖ సెక్రెటరీని కలిసి నగరంలో జరుగుతున్న అభివృద్ధిని వివరించినట్లు తెలిపారు. ఘన, వ్యర్థ పదార్థాల నిర్వహణలో రామగుండం కార్పొరేషన్ ఆధ్వర్యంలో బయో మైనింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి సహకరించాలనీ, అలాగే పనికి రావనుకున్న వాటి నుంచి కూడా అద్భుతాలు సృష్టించే వస్తువుల తయారీ వేస్ట్ టు వండర్ యూనిట్లు స్వశక్తి మహిళల ద్వారా స్థాపించడానికి అవసరమైన ప్రోత్సాహాన్ని అందించాలని కోరినట్లు తెలిపారు. మెరుగైన సేవలందించడానికి జనాభాకు తగినట్టుగా పారిశుధ్య సిబ్బందిని శాశ్వత ప్రాతిపదికన నియమించాలని కోరగా ఆమె సానుకూలంగా స్పందించారని మేయర్ తెలిపారు.

# మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి హౌస్ అరెస్టు

### రైతు ధర్నాకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు

### యూరియా యాప్‌ను ఎత్తేయాలన్న వేముల

### సకాలంలో యూరియా సరఫరా చేయాలని డిమాండ్



హైదరాబాద్,జూన్23 : మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. మంగళవారం ఉదయం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు నిర్బంధించారు. యూరియా యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా తాడ్వాయి మండలంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి జాజాల సురేందర్ ఆధ్వర్యంలో వేలాది మంది రైతులు ధర్నా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ధర్నాలో పాల్గొనేందుకు వేముల ప్రశాంత్ రెడ్డి బయల్దేరగా.. ముందస్తు చర్యల్లో భాగంగా ఆయన్ను పోలీసులు ఇంటి వద్దే నిలువరించారు. రైతులు యూరియా యాప్ వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సకాలంలో యూరియా దొరకడం లేదనే బాధతో నిరసన కార్యక్రమం చేపట్టారని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. రైతుల పిలుపు మేరకు, ఎల్లారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ సురేందర్ నాయకత్వంలో తామంతా అక్కడికి బయల్దేరాలని నిర్ణయించుకున్నామని, అయితే తనను హైదరాబాద్‌లోనే హౌస్ అరెస్ట్ చేయడం చాలా దుర్మార్గమని ఎమ్మెల్యే వేముల మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటువంటి నియంతృత్వ పాలనతో సాధించేదేమీ ఉండదని ఎమ్మెల్యే వేముల హితవు పలికారు. 'మమ్మల్ని అరెస్ట్ చేసి మా గొంతు నొక్కే బదులు, అక్కడ రైతులకు ఇబ్బందిగా మారిన యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు అన్-సీజన్‌లోనే దేశంలో ఎక్కడ యూరియా దొరికినా కొనుగోలు చేసి గోదాముల్లో నిల్వ ఉంచేవారు. రైతులు ఆటో వానికి పైసలు ఇచ్చి పంపిస్తే, నేరుగా పొలాల వద్దకే యూరియా సంచులు వచ్చే పరిస్థితి ఉండేదని , అందుకే రైతన్నలకు ఎలాంటి కొరత లేకుండా యూరియా దొరికిందని గుర్తుచేశారు. ఆ తెలివి ప్రస్తుత ముఖ్యమంత్రికి లేదన్నారు. రైతులకు సరిపడా యూరియాను విరివిగా అందుబాటులో ఉంచాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి అంతా హైదరాబాద్‌లో భూములు ఎక్కడున్నాయి. వాటిని ఏం చేయాలనే దానిపైనే ఉంది తప్ప, రైతుల బాధలపై లేదని ఎమ్మెల్యే వేముల విమర్శించారు. నిన్న మొన్నటి దాకా వడ్ల కొనుగోలు కోసం రైతులను ఏడు చెరువుల నీళ్లు తాగించారని, ఇప్పుడు యూరియా కోసం ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి నిరసన తెలుపుతామంటే, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో దాదాపు 300 మంది బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను పొద్దున నుంచి అరెస్ట్ చేసి పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ఇంచార్జ్ సురేందర్ , తాడ్వాయి మండల కేంద్రంలో డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్ రెడ్డిలను అరెస్ట్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని, రోడ్ల మీదికి వస్తున్న రైతులను సైతం వదలకుండా అరెస్ట్ చేస్తున్నారని తెలిపారు. కామారెడ్డి పట్టణంలో బాన్సువాడలో కూడా బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారన్నారు. ప్రజా పాలన తెస్తామన్న రేవంత్ రెడ్డి ఇవాళ నియంతృత్వ పాలన సాగిస్తున్నారు. అరెస్టులతో మా గొంతు నొక్కే బదులు యూరియా యాప్ రద్దు చేసి సరిపడా యూరియా రేవంత్ రెడ్డి. రేవంత్ రెడ్డిది ప్రజా పాలనా లేక నియంత పాలనా అనేది తెలంగాణ సమాజం, ప్రజా సంఘాలు ఆలోచించాలి. ఎక్కడో కామారెడ్డి జిల్లాలో నిరసన ఉంటే హైదరాబాద్‌లో మమ్మల్ని అరెస్ట్ చేయడం ఈ ప్రభుత్వం ఎంత నియంతృత్వంగా పనిచేస్తుందో చెప్తోంది. మమ్మల్ని అరెస్ట్ చేసినా రైతుల్లో వచ్చే తిరుగుబాటును మాత్రం ఆపలేరు. రైతులు తప్పకుండా బుద్ధి చెప్తారు'అని ఎమ్మెల్యే వేములహెచ్చరించారు. ఢిల్లీకి 72 సార్లు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మెట్రో రైలు పైన సమావేశాలు పెట్టడానికి సమయం ఉంటుంది కానీ, కేంద్ర ప్రభుత్వాన్ని యూరియా గురించి అడిగే శ్రద్ధ లేదన్నారు. రేవంత్ రెడ్డికి రైతులంటే చాలా చులకన భావం ఉందని విమర్శించారు. అటు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కూడా రాష్ట్రానికి రావాల్సిన యూరియాను ఒకేసారి ఇవ్వకుండా కోతలు విధిస్తోందని, ఇటు రేవంత్ రెడ్డికి కేంద్రం నుండి తెచ్చుకునే తెలివి లేదని దుయ్యబట్టారు. ప్రతిపక్షాలుగా తాము రైతుల బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుంటే వినే ఓపిక లేకపోగా, రివర్స్‌లో అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. అటు నరేంద్ర మోదీ, ఇటు రేవంత్ రెడ్డి.. ఈ రెండు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా విషయంలో, వడ్ల కొనుగోలు విషయంలో తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచుతున్నాయని ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# బాసర సరస్వతీ ఆలయంలో చోరీ

### కాళీమాత ఆలయంలో వెండి కిరీటం చోరీ

### సిసి కెమెరాలపై బట్టలు కప్పి చోరికి పాల్పడ్డట్లు గుర్తింపు

### సమాచారం అందుకుని పరిశీలించిన ఎస్పీ

నిర్మల్,జూన్23 : బాసరలో కొలువుదీరిన జ్ఞాన సరస్వతి దేవి ఆలయంలో భారీ చోరీ జరిగింది. మొదటి అంతస్తులోని మహంకాళి అమ్మవారి ఆలయంలో తలుపు తాళాలు దొంగలు పగలకొట్టి అమ్మవారి వెండి కిరీటంతోపాటు హుండీని దొంగిలించారు. మంగళవారం తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకం చేసేందుకు దేవాలయంలోకి పురోహితులు వెళ్లారు. అమ్మవారి ఆలయంలో చోరీ జరిగిన విషయాన్ని వారు గుర్తించారు అనంతరం దేవస్థానం అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సరస్వతి అమ్మవారి ఆలయంలోని పై అంతస్తులో ఉన్న మహంకాళి అమ్మవారి వెండి కిరీటంతో పాటు హుండీని దుండగులు ఎత్తుకెళ్లారు. గర్భగుడి తాళాలు పగులగొట్టి మరీ ఈ దోపిడీకి పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. మంగళవారం తెల్లవారుజామున సుప్రభాత సేవ, పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస్ గుడికి వచ్చిన సందర్భంగా తాళాలు పగులగొట్టి ఉండటం గుర్తించాడు. వెంటనే ఈ విషయాన్ని ఆలయ భద్రతా సిబ్బందికి సమాచారం అందించారు. ఆలయ భద్రతా సిబ్బంది ఇచ్చిన సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆలయ పూజారి చేత తలుపులు తెరిపించారు. ఆ సమయంలో అమ్మవారికి అలంకరించిన వెండి కిరీటంతో పాటు హుండీని అపహరించినట్లు పోలీసులు గుర్తించారు.కాగా, సీసీ కెమెరాలపై వస్త్రాలు కప్పి దొంగలు ఆలయంలోకి ప్రవేశించినట్లుగా పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. చోరీకి పాల్పడిన హుండీలో నుంచి డబ్బులు తీసుకుని, తర్వాత హుండీని వ్యాసగుడి సమీపంలో పడేసినట్లుగా పోలీసులు గుర్తించారు. బాసర ఆలయంలో చోరీ గురించి సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల ఘటనాస్థలిని పరిశీలించారు. చోరీ జరిగిన తీరు, సేకరించిన ప్రాథమిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీల పరిశీలన తదితర అంశాలపై అధికారులతో సమావేశమయ్యారు. కేసును అన్ని కోణాల్లో విచారించి నిందితులను త్వరితగతిన అరెస్టు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# జంటహత్యల కేసులో విస్తుపోయే విషయాలు

### స్నేహితుల మధ్య ఇఎంఐ చిచ్చే కారణం

### శ్రీధర్‌ను దారుణంగా హత్య చేసిన ప్రభాకర్ తదితరులు

### ప్రభాకర్ తండ్రిని మట్టుబెట్టిన శ్రీధర్ బంధువులు

### సూరారం గ్రామంలో హత్యలపై పోలీసుల దర్యాప్తు

మెదక్,జూన్23 : మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం సురారం గ్రామంలో తీవ్ర కలకలం రేపిన జంట హత్యల కేసులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. గతంలో ప్రాణ స్నేహితులైన శ్రీధర్, ప్రభు (ప్రభాకర్) మధ్య ఉన్న చిన్నపాటి ఆర్థిక వివాదం, ఆపై కుటుంబ గొడవలే ఈ దారుణ హత్యలకు దారితీశాయి. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం.. శ్రీధర్, ప్రభు గతంలో అత్యంత సన్నిహితంగా ఉండేవారు. ప్రభు బంధువుల నుంచి శ్రీధర్ ఒక ఆటోను ఈఎంఐ పద్ధతిలో తీసుకున్నాడు. అయితే, రెండు నెలల ఈఎంఐ బకాయిల విషయంలో వీరిద్దరి మధ్య గొడవ మొదలైంది. ఈ క్రమంలోనే గతంలో ప్రభు.. శ్రీధర్‌పై హత్యాయత్నానికి కూడా పాల్పడగా, అప్పట్లో పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ గొడవ ఇలా ఉండగానే, శ్రీధర్‌కు వరుసకు చెల్లెలు అయ్యే అమ్మాయిని ప్రభు రెండో పెళ్లి చేసుకున్నాడు. ఈ వివాహంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు, పగ మరింత తీవ్రరూపం దాల్చాయి. ఈ వివాదాలను పరిష్కరించుకోవడానికి ఇద్దరూ ఒకచోట కలుసుకుని మాట్లాడుకుందామని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం ఒకరికొకరు లొకేషన్లు షేర్ చేసుకున్నారు. ఈ క్రమంలో చేగుంట మండలం అనంతసాగర్ వద్దకు శ్రీధర్ బైక్‌పై రాగానే.. అప్పటికే పథకం ప్రకారం అక్కడ వేచి ఉన్న ప్రభు, అతని స్నేహితులు ఆటోతో శ్రీధర్ బైక్‌ను బలంగా ఢీకొట్టారు. అనంతరం శ్రీధర్‌ను దారుణంగా హతమార్చి అక్కడి నుంచి పరారయ్యారు. కన్నకొడుకు శ్రీధర్ హత్యకు గురయ్యాడనే విషయం తెలవడంతో ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు ప్రతీకారంతో రగిలిపోయారు. ప్రభుపై కక్షతో అర్ధరాత్రి వేళ అతని తండ్రి యాదగిరిని టార్గెట్ చేసి దారుణంగా హత్య చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు యాదగిరి మృతదేహాన్ని మాసాయిపేట మండలం కొప్పులపల్లి గ్రామ శివారులోని హల్దీవాగులో పడేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాలకు చేరుకుని దర్యాప్తు చేపట్టారు. శ్రీధర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, హల్దీవాగు నుంచి వెలికితీసిన యాదగిరి మృతదేహాన్ని నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ జంట హత్యల నేపథ్యంలో సురారం గ్రామంలో మళ్లీ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో భారీగా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

# ఎమ్మెల్సీ పేరుతో టిటిడిలో నకిలీ లేఖ

### పోలీసులకు ఫిర్యాఉద చేసిన ఎమ్మెల్సీ రాజశేఖర్

కాకినాడ,జూన్23 : డీపీ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ పేరుతో నకిలీ టీటీడీ లేఖ కలకలం రేపుతోంది. టీటీడీ దర్శనం కోసం ఎమ్మెల్సీ లెటర్ హెడ్‌తో నకిలీ సిఫార్స్ లేఖ తయారు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులో వచ్చింది. ఈ వ్యవహారంపై కాకినాడ సర్పవరం స్టేషన్‌లో ఎమ్మెల్సీ రాజశేఖర్ ఫిర్యాదు చేశారు. అప్పన్న అనే వ్యక్తి తన సంతకాన్ని ఫోర్జరీ చేసి టీటీడీ లేఖ ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నెల 25న తిరుమల శ్రీవారి దర్శనం కోసం నకిలీ లేఖ సిఫార్సు చేశారని వెల్లడించారు. అప్పన్న అనే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆధారాలతో సహా ఎమ్మెల్సీ ఫిర్యాదు చేశారు. తన పేరు, హోదా, సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ పత్రాలను రూపొందించిన వ్యక్తిపై సమగ్ర విచారణ జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఎమ్మెల్సీ రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం.

# ధాన్యం కుంభకోణంలో కాంగ్రెస్ నేతల హస్తం

### ఆది శ్రీనివాస్ అనుచరులదే ఈ పన్నాగం

### లోతైన విచారణ జరిగితే నిజాలు బయటకు వస్తాయి

### మీడియా సమావేశంలో సిరిసిల్ల జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ

వేములవాడ,జూన్23 : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ధాన్యం కుంభకోణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులదే ప్రధాన పాత్ర అని రాజన్న సిరిసిల్ల జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి ఆరోపించారు. మంగళవారం వేములవాడ పట్టణంలోని చల్మెడ నివాసంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధాన్యం కుంభకోణంలో ఇప్పటివరకు బయటపడింది రవ్వ అంతే అని లోతైన విచారణ జరిపితే పెద్ద ఎత్తున అవినీతి గుట్టలు బయటపడతాయన్నారు. సాక్షాత్తు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వగ్రామంలో ఆయన ప్రధాన అనుచరుడు కాంగ్రెస్ పార్టీ నాయకుడు స్వామి అలియాస్ గడ్డం నర్సారెడ్డి నకిలీ ట్రక్ షీట్లతో రెండు లారీల ధాన్యం అమ్మినట్లు పోలీసులు నిర్ధారించి అరెస్టు చేశారని గుర్తు చేశారు. రుద్రంగి ధాన్యం, మక్కల కొనుగోలు వ్యవహారంలో లోతైన విచారణ జరిపితే పెద్ద ఎత్తున ధాన్యంతో పాటు మక్కలు కూడా ఇదే తరహాలో నకిలీ పత్రాలు సృష్టించి అమ్మినట్లుగా తెలుస్తోందని ఆరోపించారు. స్వామి ఆదికి ముఖ్య అనుచరుడు కావడంతోనే రుద్రంగిలో డీసీఎంఎస్ ద్వారా ప్రత్యేక ధాన్యం, మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసి ఆ బాధ్యతలు అప్పగించారని అన్నారు. నియోజకవర్గ కేంద్రం వేములవాడలో కాకుండా రుద్రంగిలో మొక్కల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడమే ఆయనకు సన్నిహితుడనే విషయం బహిర్గతమైందన్నారు. మల్కపేట శ్రీనివాస్, రుద్రంగి స్వామి అలియాస్ నర్సారెడ్డి కాంగ్రెస్ అనుచరులు అనడానికి ఇదిగో సాక్ష్యం అంటూ ఆది శ్రీనివాస్ తో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాల్లో పాల్గొన్న చిత్రాలు వార్తాపత్రికల్లో వచ్చిన కథనాలను చూపుతూ బహిర్గతం చేశారు. దొంగలు దొరికాక ఇప్పుడు తమ వాళ్లు కాదని మీడియా సమావేశాలు పెట్టిన కాంగ్రెస్ నాయకులు, బీసీ బిడ్డ ఎదుగుతే చూడలేక ఆరోపణలు చేస్తున్నారంటూ కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారాలు కూడా చేస్తున్నారని అన్నారు. ఆది శ్రీనివాస్ బీసీ బిడ్డగా మంత్రి పదవి వస్తే పూర్తి స్థాయిలో స్వాగతి ఇచ్చి నియోజకవర్గ అభివృద్ధికి కూడా పాటుపడతాడని నమ్మకం ఉందని, కానీ అవినీతి జరిగినప్పుడు తప్పకుండా ప్రశ్నిస్తామని చెప్పారు. రైతులు ఆరుగాలం పండించిన పంటను కొనడానికి రాని చేతులు, కోట్లాది రూపాయల కుంభకోణాలకు ముందుకు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయల్లో అవినీతి అక్రమాలు జరిగాయని ఆమె ఆరోపించారు. అవినీతి కుంభకోణం బయటికి రావడంతో ధాన్యం విక్రయించిన జిల్లాలోని రైతులు ఆందోళన చెందుతున్నారని వారికి భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందని, సీఎంకు అత్యంత సన్నిహితుడుగా ఉన్నటువంటి ఆది శ్రీనివాస్ ఈ సంఘటనలను పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయించి రైతులకు తెలపాల్సిన బాధ్యత కూడా ఆయనపైనే ఉందని అన్నారు. గుమ్మడికాయ దొంగలు అంటే భుజాలు తడుముకున్నట్లుగా కాంగ్రెస్ నాయకుల పనితీరు ఉందని ఎద్దేవా చేశారు. వార్తాపత్రికలలో వచ్చిన కథనాలను సామాజిక మాధ్యమాల్లో పెడితే కార్యకర్తలను అర్ధరాత్రి కూడా అని చూడకుండా పోలీసులు వేధిస్తున్నారని ఆమె అన్నారు. చందుర్తి మండలంలోని బండపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సురేష్ ను దివ్యాంగుడు కూడా అని కూడా చూడకుండా రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకోవడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. పోలీసులు కూడా సమన్వయం పాటించకుండా కక్ష సాధింపులకు దిగితే తప్పనిసరిగా సమాధానం చెబుతామని అన్నారు. రైతుల దగ్గర నుండి కొనుగోలు చేసి గోదాముకు పంపిన లారీలోనే దొంగతనంగా మల్కపేటకు ధాన్యం బస్తాలు వచ్చాయని కొలనూరు సింగిల్ విండో చైర్మన్ రామ్మోహన్ రావు అన్నారు. ఇదే లారీలో మల్కాపేటకు దొంగతనంగా 89 బస్తాలు ధాన్యం వచ్చినట్లు పోలీసులు నిర్ధారించారని తెలిపారు. ఐకేపీ సెంటర్ నిర్వాహకుడు కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదని మాట్లాడిన నాయకులను ప్రశ్నిస్తూ ఇదిగో ఆది శ్రీనివాస్తో ఉన్న చిత్రాలను చూపుతూ గత పత్రికలలో వచ్చిన వార్త కథనాలను కూడా చూపుతూ ప్రశ్నించారు. అయితే ఇప్పటికే పలు గ్రామాల్లో తూకం వేసిన ధాన్యం సంబంధించిన లారీల ట్రక్ షీట్లు తిరిగి రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. రుద్రంగి మార్కెట్ కమిటీలో సహకార సంఘం తరఫున కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు సేవలందిస్తుండగా ఇటీవలే డీసీఎంఎస్ ద్వారా మరో కొనుగోలు కేంద్రాన్ని ఆది శ్రీనివాస్ ఏర్పాటు చేయించారని సింగిల్ విండో చైర్మన్ కిషన్ రావు అన్నారు. రైతుల కోసం మరో కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా చాలా ఉపయోగంగా ఉంటుందని అనుకున్నాం కానీ అక్రమాలు చేసేందుకే ఇంకో కేంద్రాన్ని ఏర్పాటు చేశారని ఇప్పుడే తెలిసిందని విమర్శించారు. నియోజకవర్గం కేంద్రంలో ఏర్పాటు చేయాల్సిన మొక్కల కొనుగోలు కేంద్రాన్ని కూడా ఆయన అనుచరుడు స్వామి కోసమే అది కూడా రుద్రంగిలోనే ఏర్పాటు చేశారని అన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి, ప్యాక్స్ చైర్మన్లు జలగం కిషన్ రావు, రామ్మోహన్ రావు, తిప్పని శ్రీనివాస్, మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 12వ వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలి

### సింగరేణి జాతీయ కార్మిక సంఘాల డిమాండ్

గోదావరిఖని,జూన్23 : బొగ్గు గని కార్మికుల 12వ వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణిలో నాలుగు జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టనున్నట్టు నాయకులు వెల్లడించారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, ఐఎన్టీయూసీ నాయకులు జనక్ ప్రసాద్, సీఐటీయూ నాయకులు రాజారెడ్డి హెచ్ఎంఎస్ నాయకులు మాట్లాడారు. జూన్ 30 2026 తో 11వ వేతన ఒప్పంద కాల పరిమితి ముగుస్తుందని 1 జులై 2026 నుంచి 12వ వేతన ఒప్పందం అమలు కావాల్సి ఉండగా ఇప్పటివరకు కమిటీ వేయలేదని నాయకులు విమర్శించారు. కోల్ ఇండియాలో జులై 1న నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చిన క్రమంలో సింగరేణి సంస్థలు జూలై 3న కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముందు నాలుగు జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని కేతన ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు వారు వివరించారు. జూలై3న కొత్తగూడెం హెడ్ ఆఫీస్ తో పాటు రామగుండం, శ్రీరాంపూర్, భూపాలపల్లి, బెల్లంపల్లి డివిజన్లో జీఎం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి నిరసన తెలియజేయడానికి నిర్ణయించినట్లు వారు పేర్కొన్నారు.

# సంపాదకీయం

## దేశంలో మారుతున్న రాజకీయ ముఖచిత్రం !

దేశంలో రాజకీయాలు అనూహ్య మలుపు తిరుగుతున్నాయి. ప్రధాన పార్టీలన్నీ డంగయిపోతున్నాయి. బెంగాల్ ఫలితాల తరవాత మమతా బెనర్జీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. తాజాగా ఆమెను అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తూ మెజార్టీ ఎమ్మెల్యేలు తీర్మానం చేశారు. ఇక మహారాష్ట్రలో బాలథాక్రే స్థాపించిన శివసేన దాదాపు అంతర్థానం అయ్యే దుస్థితిలో ఉంది. యూపిలో అఖిలేశ్ పార్టీలో సైతం ముసలం పుట్టింది. ఇదంతా యాదృచ్ఛికంగా జరుగుతన్నదని భావించడానికి లేదు. మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లు వీగిపోయిన తరవాత అధికార బిజెపి వేస్తున్న ఎత్తులకు ప్రాంతీయ పార్టీలు చిత్తవుతున్నాయి. ఇదే ఆయా పార్టీల పునాదులను పెకిలిస్తోందని భావించాలి. ఇదంతా కూడా మళ్లీ డీ లిమిటేషన్, మహిళా బిల్లును గట్టెక్కించే పనిలో అధికార పార్టీ చేస్తున్న కసరత్తుగానే గుర్తించాలి. ఈసారి ఈ రెండు బిల్లును ఎలాగైనా గట్టెక్కించే పనిలో మోడీ ద్వయంయ ఉన్నట్లుగా అర్థం అవుతోంది. ప్రభుత్వం పూర్తిస్థాయిలో ముసాయిదాను సిద్ధం చేసినా పార్లమెంట్‌లో తగిన మద్దతు దక్కుతుందన్న నమ్మకం కలిగితేనే ఈ బిల్లును సభ ముందుకు తీసుకురావాలని వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఈ చట్టం ఆమోదం పొందాలంటే లోక్‌సభ.. రాజ్యసభల్లో మూడింట రెండు వంతుల ప్రత్యేక మెజారిటీ సాధించాలి. అంతటితో ఈ పక్రియ పూర్తి కాదు. దేశంలోని కనీసం సగంరాష్ట్రాల శాసనసభలు ఈ బిల్లును ఆమోదించి తీరాల్సి ఉంటుంది. సంఖ్యాబలంపై పూర్తి ధీమా వచ్చాకే ఎన్డీయే సర్కార్ ఈ మహిళా బిల్లును అధికారికంగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం కనిపిస్తోంది. గతంలో జరిగిన అవమానానికి బద్లా తీసుకునే పనిగా కూడా భావిస్తున్నారు. ఎందుకంటే మహిళా రిజర్వేషన్ల అమలుపై దేశవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. ఈ బిల్లును అమలులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం తెరవెనుక పక్కా ప్రణాళిక సిద్ధం చేస్తోందనడానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. డీలిమిటేషన్.. సీట్ల పెంపు లాంటి కీలక అంశాలపై ఉన్న అనుమానాలను నివృత్తి చేస్తూ ఓ సరికొత్త ముసాయిదాను ప్రభుత్వం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ వర్షాకాల సమావేశాల్లోనే దీనిని గట్టెక్కించే పనిలో భాగగంఆ బలాన్ని పెంచుకునే ఎత్తులో బిజెపి ఉన్ట్లు స్పష్టం అవుతోంది. గతంలో ప్రతగిపాదించినట్లుగానే లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను ఏకంగా 50 శాతం పెంచే ఆలోచనలో మోడీ సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. చట్టసభల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించాలన్న డిమాండ్ దశాబ్దాలుగా ఉంది. ఇటీవల ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లును విపక్షాలు వ్యతిరేకించడంతో అది వీగిపోయింది. బెంగాల్, తమిళనాడు ఎన్నికల తర్వాత విపక్షాల బలం తగ్గడంతో మహిళా రిజర్వేషన్ల అమలుపై కేంద్ర ప్రభుత్వం వేగంగా పావులు కదుపుతోంది. మరింత పకడ్బందీగా 133వ రాజ్యాంగ సవరణను తీసుకురావడానికి సన్నాహాలు చేస్తోంది. ముఖ్యంగా సీట్ల పునర్విభజన సమయంలో దక్షిణాది రాష్ట్రాల నుంచి వస్తున్న అభ్యంతరాలకు చెక్ పెట్టేలా ఈ కొత్త ముసాయిదాను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. పార్లమెంట్ స్థానాల పెంపు వల్ల జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాలకు రాజకీయంగా నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే.. రాష్ట్రాల మధ్య సీట్ల నిష్పత్తిని 1971 జనాభా లెక్కల ఆధారంగానే కొనసాగించాలని కేంద్రం గట్టిగా భావిస్తోంది. అదే సమయంలో ఒక రాష్ట్రం పరిధిలో నియోజకవర్గాల సరిహద్దుల మార్పునకు మాత్రం 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోనున్నట్లు ప్రచారం సాగుతోంది.ప్రభుత్వం సిద్ధం చేసిన ఈ కొత్త ముసాయిదా లో అత్యంత కీలకమైన అంశం చట్టసభల స్థానాల పెంపు. లోక్‌సభతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను భారీగా పెంచబోతున్నారు. వీలైనంత వరకు అన్ని చోట్లా ఏకంగా 50 శాతం మేర సీట్లను పెంచాలని కేంద్రం భావిస్తోంది.. సాధ్యమైనంత వరకు 50 శాతం పెంపు విధానాన్ని అమలు చేసి.. మహిళలకు తగినన్ని సీట్లు కేటాయించాలని చూస్తున్నారు. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 55, 81, 82తో పాటు 170, 330లకు మార్పులు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం పార్లమెంట్‌లో పెండింగ్‌లో ఉన్న డీలిమిటేషన్ బిల్లులో కూడా తగిన సవరణలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. భవిష్యత్తులో ఏర్పాటు చేయబోయే నియోజకవర్గాల పునర్విభజన కమిషన్ ఈ కొత్త సూత్రాల ఆధారంగానే తన పనిని కొనసాగించాల్సి ఉంటుంది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటే ముందుగా సభలో మొత్తం సభ్యుల సంఖ్య పెరగాలి. అప్పుడే సిట్టింగ్ ఎంపీలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఈ సీట్ల పెంపు పక్రియతో కేవలం మహిళలకే కాకుండా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కూడా భారీగా రాజకీయ లబ్ధి చేకూరనుంది. తాజా ప్రతిపాదనల ప్రకారం చూస్తే.. లోక్‌సభలో ఎస్సీ స్థానాలు ప్రస్తుతమున్న 84 నుంచి ఒకేసారి 136కు పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. అలాగే ఎస్టీల స్థానాలు కూడా 47 నుంచి 70కి పెరగనున్నాయి. ఈ మార్పు చేయడం ద్వారా లోక్‌సభలో షెడ్యూల్డ్ కులాలకు దక్కాల్సిన పూర్తి 16 శాతం కోటా వారికి అందుతుంది. పెరిగిన ఈ కొత్త స్థానాల్లో మహిళా రిజర్వేషన్లను వర్టికల్ విధానంలో పక్కాగా అమలు చేస్తారని ప్రచారం. అంటే పెరిగిన ఎస్సీ.. ఎస్టీ స్థానాల్లో కూడా మూడో వంతు సీట్లను ఆయా వర్గాలకు చెందిన మహిళలకే కేటాయిస్తారు. ఈ మొత్తం రాజకీయ పక్రియను 2029 సాధారణ ఎన్నికల నాటికి పూర్తి చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. డీలిమిటేషన్ విషయంలో పలు రాష్ట్రాల నుంచి వ్యక్తమవుతున్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని.. అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపేలా ప్రధానమంత్రి కార్యాలయం ఇప్పటికే ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించి కీలక నిర్ణయాలు తీసుకుంది. అయితే భారత రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే ఈ భారీ నిర్ణయం అమలు చేయడం ప్రభుత్వానికి అంత సులభం కాదు. దీనికోసం చట్టసభల్లో స్పష్టమైన సంఖ్యాబలం అత్యవసరం. అందుకే ఇప్పుడు ఆయా పార్టీల్లో పగుళ్లు పడుతు న్నాయి. బెంగాల్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లో దాదాపు ఆయా ప ఆర్టీలకు వణుకు పుట్టించేలా చీలికలు మొదలయ్యాయి. దీంతో లోక్‌సభలో, రాజ్యసభలో సంపూర్ణ మెజార్టీ కోసం యత్నాలు మొదలయ్యాయని భావించాలి. తమిళనాడులో కూడా డిఎంకె పరోక్షంగా మద్దతు ఇస్తుందని భావిస్తున్నారు. కాంగ్రెస్‌పై గుర్రుగా ఉన్న ఆ పార్టీ,ఇండి కూటమితో కలసి వెళ్లకపోవచ్చు. మొత్తంగా రానున్న రోజుల్లో ఈ ముఖచిత్రం మరింత స్పష్టంగా ఆవిష్కృతం కానుంది.

# హర్మూజ్‌పై ఆధారపడితే సంక్షోభమే



లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులతో విరుచుకుపడడం, 32మంది మరణించడం తదితర అనూహ్య పరిణామాలతో తాత్కాలిక ఒప్పందానికి తీవ్ర విఘాతం కలిగిందని హర్మూజ్ జలసంధిని మళ్లీ ఇరాన్ మూసివేసిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతిగా 60 రోజుల్లో ఇరాన్‌తో తుది ఒప్పందం కుదరకపోతే జలసంధి మార్గంలో టోల్ విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఆ హెచ్చరికలను బేఖాతరు చేసూ ఇరాన్ 'హర్మూజ్ మీ క్యాసినో కాదు, సముద్రపు దొంగలుండే పెరడు కాదని' గట్టిగా బదులిచ్చింది. అమెరికా ఇరాన్ మధ్య ఈ పరస్పర హెచ్చరికలు, బెదిరింపులు చూస్తుంటే హర్మూజ్ జలసంధి దిగ్బంధనం ఇప్పట్లో ముగిసే పరిస్థితి కనిపించడం లేదు. మన దేశంతో పాటు హర్మూజ్ జలసంధిపై ఆధారపడే దేశాలన్నిటికీ మళ్లీ సంక్షోభం కొనసాగక తప్పదు. చాలా దేశాలు హర్మూజ్ జలసంధిపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ మార్గాల కోసం అన్వేషిస్తున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ హర్మూజ్ జలసంధిపై ఏమాత్రం ఆధారపడకుండా ఉండేందుకు 'జీరో హర్మూజ్ డిపెండెన్సీ' వ్యూహాన్ని రూపొందించుకుంటోంది. ప్రస్తుత సంక్షోభం నుంచి భారత్ పాఠాలు నేర్చుకోవలసింది చాలా ఉంది. ప్రత్యామ్నాయ సముద్ర, భూగర్భ రవాణా మార్గాల నిర్మాణానికి భారీగా పెట్టుబడులు పెట్టడం, వ్యూహాత్మక భాగస్వామ్యాలను బలోపేతం చేయడం ప్రాధాన్యాలుగా గుర్తించాలి. హర్మూజ్ జలసంధి అనేది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసించే అతిముఖ్యమైన సముద్ర మార్గం. ఇరాన్ దీనిని తన గుప్పెటలో పెట్టుకుంది. జలసంధి మీదుగా నౌకల రాకపోకలు నియంత్రించేందుకు పర్షియన్ గల్ఫ్ స్ట్రయిట్ అథారిటీని ఏర్పాటు చేసింది. ఏ నౌక అయినా ఈ సంస్థ నుంచి అనుమతులు పొందాల్సిందేనని ఆంక్షలు విధించింది. ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు 20 శాతం వరకు ముడి చమురు సరఫరాను అడ్డుకోగలమని నిరూపిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా వినియోగించే ముడిచమురు దాదాపు 20శాతం, అలాగే ద్రవీకృత సహజవాయువు (ఎల్ఎన్‌జి)లో 20 శాతం ఈ ఇరుకైన హర్మూజ్ జలసంధి ద్వారానే రవాణా అవుతోంది. దీనిపైనే ప్రపంచ ఇంధన భద్రత ఆధారపడి ఉంది. ఈ జలసంధిని మూసివేస్తే అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు ఒక్కసారి ఆకాశానికి అంటుకుంటాయి. ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరిగిపోతుంది. రవాణా వ్యయం అమాంతంగా పెరగడమే కాదు, నిత్యావసరాల ధరలు అదుపు తప్పుతాయి. ఇంతటి తీవ్ర సమస్యలకు కారణమవుతున్న హర్మూజ్ జలసంధి దిగ్బంధనాన్ని బయటపడాలంటే భారత్ ఎంతవరకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోందో చెప్పలేం. ఈ నేపథ్యంలో భారత్ దౌర్బల్యాలు చాలా బయటపడుతున్నాయి. ఫిరాయింపుల చట్టానికి తూట్లు ప్రపంచ సముద్ర వాణిజ్యంలో దాదాపు 60 శాతం కంటే ఎక్కువ హిందూ మహాసముద్రం మీదుగానే జరుగుతోంది. అయినా మనదేశం సొంత నౌకల ద్వారా కేవలం 10 శాతం కన్నా తక్కువ సరకును మాత్రమే రవాణా చేయగలుగుతోంది. దీనివల్ల భారతీయ ఎగుమతిదారులు సరకుల రవాణాకు విదేశీ నౌకలపై ఆధారపడవలసి వస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా పనిచేస్తున్న మొత్తం నావికుల్లో దాదాపు 15 శాతం వరకు భారతీయులే ఉన్నారు. అంతర్జాతీయంగా అత్యధిక నావికులను అందిస్తున్న మూడు దేశాల్లో భారత్ ఒకటిగా ఉంటోంది. విదేశీ మారక ద్రవ్య నిల్వలను పెంపొందించడంలో నావికులు (సీఫేరర్స్) ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. సుమారు 6.5 బిలియన్ డాలర్ల (రూ.54,000 కోట్లకు పైగా) విదేశీ మారకద్రవ్యాన్ని వీరు మన దేశానికి తీసుకు వస్తున్నారు. కానీ ఏం లాభం? పశ్చిమాసియా సముద్ర జలాల్లో పెరుగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, సోమాలియా తరహా సముద్రపు దొంగల దాడులవల్ల వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. మనదేశంలో నౌకలు, ఓడరేవులు పరిమితంగానే ఉన్నాయి. భారతీయ పతాకాలతో విదేశీ నౌకలను రవాణా చేయించవలసి వస్తోంది. మన నౌకల్లో దీర్ఘకాలికంగా, భారీగా ఇంధనం లేదా ఎల్‌పిజి రవాణా చేయడానికి, నిల్వచేయడానికి అండర్ గ్రౌండ్ సౌకర్యం తగినంతగా ఉండడం లేదు. ఎప్పటికప్పుడు సమయానికి అనుగుణంగా సరఫరా జరుగుతోంది. ఇలాంటి దౌర్బల్యాలే ఇతర దేశాల నుంచి ఇంధన సరఫరాపై వ్యతిరేక ప్రభావం చూపిస్తున్నాయి. మరో ముఖ్య విషయం ఇరాన్ భారత్ సంయుక్తంగా చేపట్టే చాబహార్ ఓడరేవు నిర్మాణం సందిగ్ధంలో పడడం ప్రస్తుత సంక్షోభ సమయంలో మనకు తీరని నష్టమే. ఈ ఓడరేవు నిర్మాణం మన దేశానికి వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా ఎంతో కీలక అవకాశం. అమెరికా ఆంక్షలు, అంతర్జాతీయ, భౌగోళిక రాజకీయాల ఒత్తిళ్ల కారణంగా మనదేశం ఈ ప్రాజెక్టును పక్కన పెట్టింది. మధ్య ఆసియా, అఫ్ఘాన్ దేశాలకు పాకిస్థాన్ మీదుగా వెళ్లే అవసరం లేకుండా సముద్రమార్గం ద్వారా ప్రత్యామ్నాయ వాణిజ్య మార్గాన్ని ఏర్పాటు చేసుకోవడానికి చాబహార్ ఓడరేవు ప్రాజెక్టును భారత్ చేపట్టింది. దీనికి కావలసిన రూ. 400 కోట్ల మేర ఆర్థిక అవసరాలను 2025లో పూర్తి చేసింది. అయితే ఇరాన్‌పై అగ్రరాజ్యం అమెరికా కఠినమైన ఆంక్షలను విధించడం, దౌత్యపరమైన ఒత్తిళ్ల వల్ల ఈ ప్రాజెక్టుపై తీవ్ర ప్రతికూలత ఏర్పడింది. ఈ దౌర్బల్యాలే మనదేశాన్ని వెంటాడుతున్నాయి. హర్మూజ్ జలసంధిపై పూర్తిగా ఆధారపడడాన్ని పూర్తిగా తగ్గించుకోకుంటే మనదేశానికి తీవ్ర ఆర్థిక సంక్షోభం తప్పదు. ఇది కేవలం ఆర్థిక లక్ష్యం మాత్రమే కాదు, జాతీయ భద్రత. ఆర్థిక స్థిరత్వం కోసం ఇది తక్షణ అవసరం.

## పాక్, ఖతార్‌లను నమ్మలేం

**ఉగ్రవాదానికి ఊతమిచ్చిన ఘనత వారిది**

**బిన్‌లాడెన్‌ను దాచిపెట్టిన చరిత్ర పాక్‌ది**

**జెడి వాన్స్ వ్యాఖ్యలపై ఇద్దరు సెనేటర్ల విమర్శలు**

వాషింగ్టన్,జూన్23 : పాకిస్థాన్‌పై ప్రేమను వ్యక్తం చేస్తూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై అమెరికాకు చెందిన ఇద్దరు సెనేటర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ దేశ ఉగ్రచరిత్ర గురించి ప్రస్తావిస్తూ, బిన్ లాడెన్‌ను దాచిన ఘనత పాక్‌దని అన్నారు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్, ఖతార్ దేశాలపై అమెరికాకు చెందిన ఇద్దరు రిపబ్లికన్ సెనేటర్లు రిక్ స్కాట్, టిమ్ షీహీ ఘాటుగా స్పందించారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన చరిత్ర ఆ దేశాలకు ఉందంటూ తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. కాగా, అమెరికా– ఇరాన్ శాంతి ఒప్పందానికి సంబంధించిన సాంకేతిక వివరాలపై స్విట్జర్లాండ్‌లో ఇటీవల చర్చలు జరిగాయి. ఈ సమావేశానికి పాకిస్థాన్, ఖతార్ నాయకులతో వాన్స్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 'మేము పాకిస్తాన్‌ను ప్రేమిస్తున్నాం' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. అయితే, ఈ చర్చల్లో పాకిస్థాన్, ఖతార్‌లను నిష్పక్షపాత మధ్యవర్తులుగా చూడకూడదని సెనేటర్ రిక్ స్కాట్ తేల్చి చెప్పారు. మధ్యప్రాచ్యంలో యూఏఈ, ఇజ్రాయెల్, సౌదీ అరేబియాలే వాషింగ్టన్‌కు నిజమైన మిత్రదేశాలని పేర్కొన్నారు. ఆ దేశాలనూ అమెరికా చర్చల్లో చేర్చుకోవాలని స్కాట్ సూచించారు. 'మన నిజమైన స్నేహితులు ఎవరో ఇప్పటికే అందరికీ స్పష్టంగా తెలిసి ఉండాలి. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన సుదీర్ఘ చరిత్ర ఖతార్, పాకిస్థాన్‌లకు ఉంది. ప్రస్తుతం వారు అర్థవంతమైన శాంతిని సాధించడం కంటే ఇరాన్ దశాబ్దాల నాటి ఉగ్రవాద ప్రచారాన్ని ప్రోత్సహించడానికే మొగ్గు చూపుతున్నట్లు కనిపిస్తోంది. అందరికీ ప్రయోజనం చేకూర్చే ఆచరణీయమైన ఒప్పందానికి ఇంకా ఆస్కారం ఉంది' అని ఆయన చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా మోంటానా సెనేటర్ టిమ్ షీహీ కూడా పాకిస్థాన్‌ను విమర్శించారు. 'పాకిస్థాన్ ఒక దశాబ్దం పాటు బిన్ లాడెన్‌కు ఆశ్రయం ఇచ్చిందనే విషయాన్ని మనం మరిచిపోకూడదు. పాకిస్థానీలు ఐఎస్ఐ ద్వారా మాపై పోరాడే వారికి నిధులు సమకూర్చారు. ముఖ్యంగా అయతుల్లాకు నిధులు అందించారు. ఖతార్ కూడా దశాబ్దాలుగా ఉగ్రవాద సంస్థలకు మనీలాండరింగ్ ద్వారా డబ్బును అందిస్తోంది. ఇరాన్, అమెరికా– ఇజ్రాయెల్ శాంతి ఒప్పందంలో పాకిస్థాన్, ఖతార్‌లు పాల్గొంటే.. ఆ చర్చల్లో యూఏఈ, ఇజ్రాయెల్, సౌదీ అరేబియాలనూ చేర్చుకోవాలి.

## హర్మూజ్‌పై పట్టుకోసం ఇరాన్ బెట్టు

**అమెరికన్లను ఎప్పుడూ నమ్మబోమన్న ఇరాన్**

టెహ్రాన్,జూన్23 : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతోన్న తరుణంలోనూ.. హర్మూజ్ జలసంధిపై అమెరికా, ఇరాన్ తరచూ ఏదో ఒక ప్రకటన చేస్తూనే ఉన్నాయి. హర్మూజ్ నిర్వహణను ఇరానే చూస్తుందని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ జలసంధి.. యుద్ధానికి ముందున్న స్థితికి ఎప్పటికీ తిరిగిరాదన్నారు. మేం అమెరికన్లను ఎన్నడూ నమ్మలేదు. ఇప్పుడూ నమ్మడం లేదు. భవిష్యత్తులోనూ వారిపట్ల ఆ ధోరణితో ఉండటం సమంజసమే అని ఘాలిబఫ్ అమెరికా పట్ల ఇరాన్‌కున్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. స్విట్జర్లాండ్‌లో ఇప్పటికే రెండు దేశాల మధ్య చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. ఫ్రీజ్ చేసిన 12 బిలియన్ డాలర్ల ఇరాన్ ఆస్తులను విడుదల చేయడానికి తుది ఒప్పందం కుదిరిందని ఆయన పేర్కొన్నారు. కాగా.. తమ నుంచి సోయా, మొక్కజొన్న, గోధుమలు కొనేందుకు ఇరాన్ అంగీకరిస్తే.. ఫ్రీజ్ చేసిన ఆ దేశ ఆస్తులను విడుదల చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హర్మూజ్‌పై భిన్నమైన వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్ పూర్తిగా తెరిచే ఉందని ప్రకటించారు. ఈ జలసంధికి మరోవైపున ఉన్న ఒమన్ దేశం తాజా పరిణామాలపై స్పందించింది. అంతర్జాతీయ చట్టాలకు, టోల్ రహిత ప్రయాణానికి కట్టుబడి ఉన్నామని ప్రకటించింది. ఇరాన్–అమెరికా మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంపై నిర్మాణాత్మక చర్చలు జరిగాయని పేర్కొంది.


## ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి నివాసంలో ఏసీబీ సోదాలు

**తెల్వారు జాము నుంచే పలుచోట్ల ఏక కాలంలో తనిఖీలు**

నిజామాబాద్,జూన్23 : హైదరాబాద్ నగరంలో మరోసారి ఏసీబీ అధికారుల సోదాలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి నివాసంలోనూ ఏసీబీ సోదాలు చేపట్టారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే సోదాలు కొనసాగాయి. ఆదాయానికి మించి అక్రమాస్తులు కలిగి ఉన్నారనే పక్కా సమాచారంతో మల్లారెడ్డి నివాసంతో పాటు ఆయన బంధువులు, సన్నిహితుల నివాసాల్లోనూ దాడులు చేపట్టారు. హైదరాబాద్, నిజామాబాద్‌లో మొత్తం పదిచోట్ల ఏకకాలంలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. మూడు సంవత్సరాల క్రితం ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా మల్లారెడ్డి విధుల్లో చేరారు. ఇటీవల ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు అయ్యింది. దీంతో తెల్లవారుజామునే ప్రత్యేక బృందాలు నిజామాబాద్ చేరుకుని.. అక్కడి ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. ఆఫీసులో విధుల్లో ఉన్న ఉద్యోగులు, సిబ్బందిని కూడా విచారించారు. ప్రగతినగర్‌లో మల్లారెడ్డి అద్దెకు ఉంటున్న ఇంట్లో సోదాలు నిర్వహించారు. తనిఖీల్లో బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన పత్రాలు లభించినట్లు సమాచారం.

## ధ్యానయోగం.. దైవమార్గం

ఆలోచనా ప్రవాహాన్ని ఒక ప్రత్యేకమైన వస్తువు మీద గానీ, ఒక భావం మీద గానీ,అవిచ్ఛిన్నమైన తైలధారగా స్థిరంగా ఉంచగలిగితే దానిని 'ధ్యానం' అంటారు.ధ్యానమంటే మనసు లోతును కొలిచే సాధనంగా నిర్వచిస్తారు తాత్త్వికులు. ఆలోచనల వెనుక అంతర్నిహితంగా దాగిఉన్న శక్తిని పరిశీలించటమే ధ్యాన లక్ష్యం. మరి ఈ ఆలోచనల వెనుక ఉన్నది ఏమిటి? అసలు ఎటువంటి ఆలోచనలు లేని మనసును ఊహించగలమా? ఎప్పుడూ మంచి చెడులు, తప్పు ఒప్పులనే పరస్పర విరుద్ధాలైన ద్వంద్వాల చుట్టూ పరిభ్ర మించే ఈ మనసు వెనుక ఉన్నది ఏమిటి? మనసును శోధించటం ద్వారా ఆలోచనలను పరిష్కరించటం, సమాధానపరచటం.. ఇదే ధ్యానం. క్రమక్రమంగా ధ్యానంలో పురోగమిస్తూ ఉన్నత స్థాయిని అందుకున్నప్పుడు ఈ మనసు మనం అనుకున్నంత చెడ్డదేమీ కాదని అవగతమవుతుంది. ధ్యానం సిద్ధించినప్పుడు మనసు నుంచి విషయవాసనలన్నీ తొలగిపోతాయి. అప్పుడు మనసు శుద్ధమై ఆధ్యాత్మిక పరిధిలోకి వస్తుంది. 'ధ్యానం చేసేవారికి దేహాభిమానం తొలగుతుంది. భగవంతుని సాక్షాత్కారం కలుగుతుంది. ఈ జన్మలోనే ముక్తిని పొందుతారు' అంటోంది వేదాంత పంచదశి. హృదయంలో బొటనవేలు పరిమాణంలో ఆత్మ ఉందని కఠోపనిషత్తు చెబుతుంది. నిరాకార నిర్గుణ పరమాత్మ ధ్యానం ఈ హృదయంలో చేయాలి. ఈ హృదయాకాశంలో జ్యోతిని పరమాత్మగానూ, ఆ జ్యోతి మధ్యలో ఉన్న చిన్న జ్యోతిని తన ఆత్మగానూ ధ్యానించాలని స్వామి వివేకానంద ఉద్ఘాటించారు. అలాంటి మహాత్ములు ఆత్మ, పరమాత్మలు ఒకటని చెప్పారు. అందుకే ఏకత్వాన్ని ధ్యానించాలి. హృదయాకాశంలో ద్వాదశ దళాల కమలంపై ఇష్టదేవత చిన్మయమూర్తి ఆసీనుడై ఉన్నట్లుగా భావించి ధ్యానించాలి.



ఆధ్యాత్మికం

# ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకుంటూ రెవెన్యూ పెంచే విధంగా ప్రజలు సహకరించాలి

● ధర్మపురి నియోజకవర్గంలో కొత్తగా 11రూట్లలో ఆర్టీసీ సర్వీసులు ప్రారంభించిన మంత్రి అడ్లూరి







**ధర్మపురి, జూన్ 23, (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్రరోడ్డు రవాణా సంస్థ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపు నిచ్చారు. ధర్మపురికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం ధర్మపురి నుంచి నిర్మల్, కరీంనగర్ కు రెండు కొత్త బస్సు సర్వీసులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం ధర్మపురి బస్టాండ్ ఆవరణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ధర్మపురి శ్రీలక్ష్మీ నర్సింహా స్వామి దేవాలయానికి నిత్యం వేల మంది భక్తులు వస్తుంటారని అన్నారు. భక్తుల సౌకర్యం కోసం నిర్మల్ నుంచి ధర్మపురి వరకు ఎక్స్ ప్రెస్ బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందని మంత్రి పేర్కొన్నారు. ఈ బస్సు ఉదయం 7గంటలకు నిర్మల్ నుంచి దస్తురాబాద్, కడెం, ఖానాపూర్ మీదుగా ధర్మపురి వస్తుందని మంత్రి వివరించారు. రోజుకు రెండు ట్రిపుల చొప్పున నిర్మల్ ధర్మపురి మధ్య బస్సు నడుస్తుందని మంత్రి అడ్లూరి తెలిపారు. ధర్మపురి నుంచి జగిత్యాల మీదుగా ప్రయాణం కష్టంగా ఉన్న నేపథ్యంలో రాయపట్నం, వెల్గటూర్, ధర్మారం, చొప్పదండి మీదుగా కొత్త బస్సు సర్వీస్ ను ప్రారంభించినట్లు మంత్రి వివరించారు.

ఈ కొత్త సర్వీస్ ఉదయం 7గంటలకు జగిత్యాల నుంచి బయలుదేరి ధర్మపురి, రాయపట్నం, వెల్గటూర్, ధర్మారం మీదుగా కరీంనగర్ చేరకుంటుందని మంత్రి అడ్లూరి తెలిపారు. కొత్త సర్వీస్ విద్యార్థులకు, ఉద్యోగులకు ఉపయోగంగా ఉంటుందని మంత్రి తెలిపారు. అదే విధంగా కరీంనగర్ నుంచి రాత్రి 9గంటలకు ధర్మపురికి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు మంత్రి వివరించారు. రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ మంత్రి పొన్న ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ చోరవతో ధర్మపురి నియోజకవర్గంలో కొత్తగా 11 రూట్లలో నూతన బస్సు సర్వీసులు నడిపించడానికి అనుమతి తీసుకున్నామని మంత్రి అడ్లూరి తెలిపారు.

నియోజకవర్గంలోని విద్యార్థుల సౌకర్యం కోరకు నూతన బస్సు సర్వీసులు నడిపించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలోని ప్రజలు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకొని ఆర్టీసీకి ఆదాయం వచ్చే విధంగా సహకరించాలని మంత్రి అడ్లూరి కోరారు. జిల్లా గంధ్రాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్ మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడ లేని విధంగా తెలంగాణ ఆర్టీసీ సేవలు అందిస్తుందని అన్నారు. ధర్మపురికి వచ్చే భక్తుల కోసం నూతనంగా నడిపిస్తున్న సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని దినేష్ కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య, నాయకులు వేముల రాజుతో పాటు ధర్మపురి మున్సిపాల్ కౌన్సిలర్లు, జగిత్యాల డిపో మేనేజర్ రమేష్, నిర్మల్ డిపో మేనేజర్ పండరి, ఆర్టీసీ జగిత్యాల సీఐ శ్రీనివాస్, ఎఫ్ ఎం నిర్మల్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# నేరెళ్లలో ఉపాధి హామీ కూలీలకు అండగా సర్పంచ్ కాసారపు బాలాగౌడ్





**ధర్మపురి, జూన్ 23, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ నేరెళ్ల గ్రామ సర్పంచ్ కాసారపు బాలగౌడ్ మానవత్వాన్ని చాటుకున్నారు. మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా గ్రామాభివృద్ధి కోసం శ్రమిస్తున్న ఉపాధి హామీ కూలీల కోసం ఆయన మంగళవారం ప్రత్యేకంగా భోజన వసతిని ఏర్పాటు చేశారు. పని ప్రదేశంలోనే కూలీలందరికీ సర్పంచ్ కాసారపు బాలగౌడ్ భోజనాలను వడ్డించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా గ్రంధాలయ చైర్మన్ సంగన బట్ల దినేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు, చెరువుల పునరుద్ధరణకు కూలీలు పడుతున్న శ్రమ అమూల్యమైనదన్నారు. తీవ్రమైన ఎండల దృష్ట్యా కూలీలు అనారోగ్యానికి గురికాకుండా ఉండేందుకు, వారి శ్రమను గుర్తించి ఈ చిన్న సాయం చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కూడా కూలీల సంక్షేమం కోసం, వారికి పని ప్రదేశంలోకే తాగునీరు, రోజురోజు పంపిస్తున్నారని తెలిపారు. నీడ వంటి అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని సర్పంచ్ ఈ సందర్భంగా కూలీలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్ కాసారపు కొమురయ్య, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, పాదం శంకర్ బోనకంటి రాకేష్, వేముల లత, పంచాయతీ కార్యదర్శి నరేష్, చక్రాల శ్రీనివాస్, రజిత, ప్రసన్న, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ జంజూర అశోక్, పురంశెట్టి మల్లేశం, తోట్ల రాజన్న, మాడిశెట్టి లక్ష్మణ్, పాదం శేఖర్, మేట్లు మరియు పెద్ద సంఖ్యలో కూలీలు పాల్గొన్నారు. తమ కష్టాన్ని గుర్తించి, పని స్థలంలోనే ఇంత మంచి భోజన సదుపాయం కల్పించినందుకు కూలీలు సర్పంచ్ కాసారపు బాలగౌడ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి



ధర్మపురి, జూన్ 23, (ది క్రైమ్ న్యూస్): భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ధర్మపురి బిజెపి పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో ఆయనకు ఘన నివాళులు అర్పించారు. మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణ బీజేపీ నాయకులు మాట్లాడుతూ నిజమైన దేశభక్తుడు నిర్భయ నాయకుడు ఒకే దేశం కోసం అమరుడైన మహానుభావుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని అన్నారు. 23 జూన్ 1953న 51 సంవత్సరాల వయస్సులో జమ్మూ కాశ్మీర్లోని శ్రీనగర్ పోలీసుల అదుపులో ఉండగా అనుమానస్పద పరిస్థితుల్లో మరణించారని తెలిపారు. ఆయన జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర ప్రత్యేక హోదా ఆర్టికల్ 370 కి వ్యతిరేకంగా నిరసన చేసి అక్కడి అనుమతి పత్రం పర్మిట్ లేకుండా ప్రవేశించినందుకు విచారణ లేకుండానే జైల్లో నిర్బంధించారని రెండు ప్రధానులు రెండు జెండాలు ఉండలేవని ఒకే దేశం ఒకే చట్టం కోసం పోరాడి అమరుడైన మహానుభావులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాజుభాస్కర్, మండల అధ్యక్షులు కమలాపూర్ సర్పంచ్ కుమ్మరి తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా కార్యక్రమం కో-కన్వీనర్ పూదరి పవన్, పట్టణ బిజెపి ప్రధాన కార్యదర్శిలు తిరుమందాస్ సత్యనారాయణ, సంఘీ మాధవ్, బీజేవైఎం నాయకులు మండలోజీ సూరజ్, కోశాధికారి సంఘీ రాజేష్, సోమిశెట్టి శివ సాయి, మామిడిపల్లి రంజిత్, అప్పం శ్రీనివాస్, సంద వేణి సతీష్, సంగా వెంకటగిరి, మల్కన్నా, రాగుల కాంతన్న, సోషల్ మీడియా ఇన్చార్జి కాశెట్టి హరీష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# మొహరం పండుగ సందర్భంగా 44వ డివిజన్ లెనిన్ నగర్‌లో ఖమ్మం ఫ్లవర్ మర్చంట్ కమిటీ అన్న ప్రసాదాల వితరణ





**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆశీస్సులతో ఖమ్మం నగరంలో 44వ డివిజన్ లెనిన్ నగర్‌లో మొహరం పండుగ సందర్భంగా ఖమ్మం ఫ్లవర్ మర్చంట్ కమిటీ సహకారంతో షేక్ మోయిన్, షేక్ మహమూద్ ఆధ్వర్యంలో ఘనంగా అన్న ప్రసాదాల వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ పార్టీ ఖమ్మం నగర మాజీ అధ్యక్షులు పగడాల నాగరాజు హజరై మాట్లాడుతూ. మోహరం పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు, స్థానిక ప్రజలకు అంగన్వాడీ టీచర్ షేక్ రజియా బేగం ఇంటి దగ్గర అన్నప్రసాదం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అన్న ప్రసాదాలు వితరణ చేయడం మంచి కార్యక్రమని కొనియాడారు.మత సామరస్యానికి ప్రతీకగా మొహరం వేడుకలను ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తుంటారని తెలిపారు. ప్రజలందరూ ఐక్యంగా, సోదరభావంతో పండుగలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మైనార్టీ మాజీ అధ్యక్షులు మహమ్మద్ తాజుద్దీన్, షేక్ జానీ చిన్న నాగరాజు, ఫెరోజ్, ఎజాస్, సోహెల్, షకీల్, జావీద్, జిలాని, అబ్దుల్ మరియు డివిజన్ బిఆర్ఎస్ నాయకులు మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మానకొండూర్‌లో డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125 వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**కరీంనగర్ టౌన్, జూన్ 23(ది క్రైమ్ న్యూస్):** భారతీయ జనతా పార్టీ మానకొండూర్ మండల శాఖ ఆధ్వర్యంలో భారత జాతీయవాది, విద్యావేత్త, దేశభక్తుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ 125వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ భారతదేశ సమగ్రత, ఏకత్వం కోసం జీవితాంతం పోరాడిన మహానేత అని కొనియాడారు. భారతీయ జనసంఘ్ స్థాపకులలో ఒకరైన ఆయన దేశంలో ఒకే రాజ్యాంగం, ఒకే జెండా, ఒకే ప్రధానమంత్రి ఉండాలనే సిద్ధాంతంతో కాశ్మీర్‌లో ప్రత్యేక హోదాకు వ్యతిరేకంగా ఉద్యమించారని తెలిపారు. “ఒక దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, ఇద్దరు ప్రధానమంత్రులు ఉండరాదు” అనే నినాదంతో దేశ సమైక్యత కోసం ఆయన చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ప్రతి భారతీయుడు ఆదర్శంగా తీసుకోవాలని, దేశభక్తి, జాతీయ సమైక్యత కోసం ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు కంది రాజిరెడ్డి, మాజీ మండల అధ్యక్షులు ఉపసర్పంచ్ రాపాక ప్రవీణ్, మియపురం లక్ష్మణచారి, సోన్నకుల శ్రీనివాస్, వంగల ఆంజనేయులు, బాషబోయిన ప్రదీప్ యాదవ్, శీలం కుమార్, పోచంపల్లి శ్రీనివాస్, ఎదులాపురం అశ్విన్ తేజ, కొల శ్రీనివాస్ తాడూరి కిరణ్ రెడ్డి, నందగిరి బలరాం, ఆరెపల్లి సునంద్, శమంతుల నరేందర్, సాయి, బీజేపీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రామగుండం నగరాభివృద్ధికి సహకరించండి

## పురపాలక శాఖా సెక్రటరీని కోరిన మేయర్ మహంకాళి స్వామి



**గోదావరిఖని టౌన్(ది క్రైమ్ న్యూస్):** రామగుండం నగరాభివృద్ధికి సహకరించాలని పురపాలక పరిపాలనా శాఖా సెక్రెటరీ టి . కె . శ్రీదేవి ని మేయర్ మహంకాళి స్వామి కోరారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్మెంట్ ఆద్వర్యంలో హైదరాబాద్ లోని ఒక హోటల్ లో మునిసిపల్ ఛైర్మన్, మేయర్ లకు మంగళ వారం నిర్వహించిన ఓరియెంటేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆమెను మేయర్ కలిశారు. ఈ సందర్భంగా రామగుండం నగరంలో జరుగుతున్న అభివృద్దిని ఆమెకు వివరించినట్లు తెలిపారు . ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణలో భాగంగా రామగుండం నగర పాలక సంస్థ ఆద్వర్యంలో బయో మైనింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయడానికి సహకరించాలని అలాగే పనికి రావనుకున్న వాటి నుంచి కూడా అద్భుతాలు సృష్టించే వస్తువుల తయారీ వేస్ట్ టు వండర్ యూనిట్లు స్వశక్తి మహిళల ద్వారా స్థాపించడానికి అవసరమైన ప్రోత్సాహాన్ని అందించాలని కోరినట్లు తెలిపారు. మెరుగైన సేవలు అందించడానికి జనాభాకు తగినట్లుగా పారిశుద్ధ్య సిబ్బందిని శాశ్వత ప్రాతిపదికన నియమించాలని కోరగా ఆమె సానుకూలంగా స్పందించారని మేయర్ తెలిపారు.

# అక్రమార్కులకు మైనింగ్ అధికారి రక్షక కవచం ప్రభుత్వ ఖజానాకు వందల కోట్ల గండి

**- సేవాలాల్ సేన మండల అధ్యక్షులు ధర్మసోత్ పవన్ కళ్యాణ్ నాయక్**



ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ): కంచే చేను మేసినట్లు ప్రభుత్వ ఆదాయానికి రక్షణగా ఉండాల్సిన మైనింగ్ శాఖ జిల్లా అధికారి, అక్రమార్కులతో చేతులు కలిపి ప్రభుత్వ ఖజానాకు వందల కోట్ల రూపాయల గండి కొట్టడం అత్యంత దారుణం అని సేవాలాల్ సేన మండల అధ్యక్షులు ధర్మ సోత్ పవన్ కళ్యాణ్ నాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాల్వంచ మండలం తోగూడెం గ్రామపంచాయతీ పరిధిలో సాగుతున్న మైనింగ్ దోపిడీపై జిల్లా మైనింగ్ శాఖ అధికారులు ఎందుకు స్పందించలలేదో కారణం చెప్పాలని అన్నారు. తోగూడెం పరిధిలో ఏకంగా 6 అక్రమ క్వారీలు ఇన్ని రోజులుగా యథేచ్ఛగా నడుస్తున్నా జిల్లా మైనింగ్ అధికారి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక భారీ అవినీతి దాగి ఉందన్నారు. కేంద్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు స్వయంగా ఫీల్డ్ పైకి వచ్చి, క్షేత్రస్థాయి పరిశీలన జరిపి ఆ క్వారీలను సీల్ చేసేంతవరకు. ఈ స్థానిక అధికారికి ఆ అక్రమాలు కనిపించకపోవడం వెనుక ఉన్న అసలు రహస్యమేంటని ఆయన ప్రశ్నించారు. అధికారి కళ్ళు మూసుకున్న మైనింగ్ శాఖ ఒక పక్క ప్రకృతి సంపద కొల్లగొట్టుకుపోతుంటే, మరోపక్క పర్యావరణం కుప్పకూలుతుంటే, కేవలం మామూళ్ల మత్తులో మునిగిపోయి మైనింగ్ అధికారి విధుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహించారు. కేంద్ర బృందం వస్తేనే కదలిక స్థానిక అధికార యంత్రాంగం చేయాల్సిన పనిని ఢిల్లీ నుంచి కేంద్ర పొల్యూషన్ శాఖ వారు వచ్చి సీజ్ చేసే వరకు ఇక్కడి అధికారి ఆ అక్రమ దారులకు కొమ్ముకాయడం సిగ్గుచేటు. వందల కోట్ల నష్టం ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీని, పన్నులను అక్రమ క్వారీ నిర్వాహకులు ఎగవేస్తుంటే. ఈ అధికారి వారికి పూర్తి స్థాయిలో సహకరిస్తూ ప్రభుత్వ ఆదాయాన్ని నాశనం చేశారు. డబ్బుకు ఆశపడి, అక్రమార్కులతో కుమ్మక్కై, ప్రభుత్వానికి ద్రోహం చేసిన సదరు మైనింగ్ శాఖ జిల్లా అధికారిని కేవలం సస్పెండ్ చేస్తే సరిపోదని, అతడిని తక్షణమే రిమూవ్ ఆఫ్ ది సర్వీస్ ఉద్యోగం నుండి తొలగించడం చేయాలని డిమాండ్ చేశారు. ఈ అవినీతి తిమింగలంపై పూర్తి స్థాయి ఉన్నత స్థాయి విచారణ జరిపించి, బాధ్యులైన వారందరినీ కఠినంగా శిక్షించాలని జిల్లా కలెక్టర్ ని సేవాలాల్ సేన తరపున కోరుతున్నామన్నారు. ప్రజాధనాన్ని, ప్రకృతి సంపదను దోచుకునే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ఈ విషయంలో న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆపబోమని హెచ్చరించారు. ఇతనిపై సోమవారం నాడు గ్రీవెన్స్ డే లో కలెక్టర్ కి ఫిర్యాదు పత్రాన్ని సేవాలాల్ సేన ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ అధ్యక్షతన అందిస్తామని అన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లతో వెలుగుమట్ల పేదల సొంతింటి కల సాకారం

## ● జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్





**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రభుత్వం పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనాన్ని అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని తమ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మంగళవారం ఖమ్మం నగర పరిధిలోని వెలుగుమట్ల ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను మున్సిపల్ కార్పోరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో తిరుగుతూ నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను ఒక్కొక్కటిగా పునాదుల నిర్మాణం, గోడల నిర్మాణం, పైకప్పు పనులు, తుదిదశ పనుల పురోగతిని పరిశీలించారు. ప్రతి ఇంటి నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందిస్తూ నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా సహకరించాలని హౌసింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఇంటి నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, నిర్మాణ దశల వివరాలను తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీసి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ఇండ్ల నిర్మాణాలు ప్రభుత్వం ప్రత్యేక చొరవతో వేగంగా కొనసాగు ఉన్నాయని తెలిపారు. వెలుగుమట్ల కాలనీకి ప్రధాన రహదారి, వాటర్ సౌకర్యం, విద్యుత్ స్తంభాలు పూర్తిస్థాయిలో లైట్లు ఏర్పాటు చేశామన్నారు. ఆదేవిధంగా ఇండ్లకు విద్యుత్ కనెక్షన్ తో పాటు మీటర్లు అమరుస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు స్థిరమైన గృహ వసతి కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని అన్నారు. ఇంటి నిర్మాణం వివిధ దశలను పూర్తిచేసిన వెంటనే ప్రభుత్వ ఆర్థిక సహాయం విడతల వారీగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోందన్నారు. పునాదుల నిర్మాణం పూర్తయిన తర్వాత, గోడల నిర్మాణం పూర్తయిన తర్వాత, స్లాబ్ దశ పూర్తయిన తర్వాత, తుదిదశ పనులు పూర్తయిన తర్వాత మొత్తం రూ.5 లక్షల వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైనప్పటికీ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా పునాది దశ పనులు ప్రారంభించలేని కుటుంబాలకు మహిళా సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ అన్నారు. స్వయం సహాయక సంఘాల సహకారంతో లబ్ధిదారులు నిర్మాణ పనులు నిలిచిపోకుండా కొనసాగించే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల విషయంలో రెవెన్యూ, హౌసింగ్, విద్యుత్, మున్సిపల్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతులు, సాంకేతిక సహాయం, పరిపాలనా అనుమతులు సకాలంలో అందించడంతో పాటు లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీ లో కలెక్టర్ వెంట హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, విద్యుత్ ఎస్ఇ శ్రీనివాసచారి, ఈఈ జగ్గారావు, హౌసింగ్ ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా నడిపిస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి




**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** ఈ సమావేశంలో పిడిఎస్యు ఖమ్మం జిల్లా అధ్యక్షులు గోకి నపల్లి మస్తాన్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు కావస్తున్న విద్యారంగాన్ని వ్యాపారంగం మార్చిన పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో ఉంది తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో సుమారు 23 వేల చిల్లర స్కూలను తనని తెలంగాణ విద్యా శాఖ మంత్రి మరియు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియాల ముందు చెప్పడం సరికాదు ఈ మాటను ఉపసరించుకోవాలని వారన్నారు. ఖమ్మం నగరంలోని అనుమతులు లేకుండా పాఠశాలలను నడిపిస్తూ బుక్స్ పేరుతోనే అడ్మిషన్ పేరుతోనే వేలాది ఫీజులను విద్యార్థి తల్లిదండ్రుల దగ్గర నుంచి వసూలు చేస్తున్నారు. జిల్లా అధికారులు ఏమి పట్టించుకోకుండా ప్రైవేటు స్కూలను సందర్శించకుండా ఆఫీసులకే పరిమితమైన పరిస్థితి ఖమ్మం జిల్లాలో కనపడుతుంది. పాఠశాలలు ఒక పేరుతోనే బోర్డు బయట కనపడుతుంది. లోపట్ల అడ్మిషన్ వేరే స్కూళ్ల పేరు మీద చేస్తున్న పరిస్థితి ఖమ్మం నగరంలో ఉంది ఇట్లాంటి వాటికీ పర్మిషన్ ఎలా ఇస్తారు అని వారన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుకుంటున్న విద్యార్థులకు సరిగా గదులు లేక ఇబ్బందులు పడతా ఉంటే మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతుంటే ఏమి పట్టించుకోకుండా బడా కార్పొరేట్ విద్యాసంస్థలకు అమ్ముడుపోయిన పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో ఉన్నది విద్యా వ్యవస్థను మారుస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులు ధర్నాలు చేయొద్దు అని చెప్పిన ముఖ్యమంత్రి ఈరోజు విద్యార్థి తరఫునుంచి విద్యార్థి సంఘాలు ధర్నాలు చేస్తే కేసులు పెట్టే పరిస్థితి తెలంగాణ రాష్ట్రం మరోపక్క ఇంటర్నేషనల్ స్కూల్స్ తీసుకొచ్చి కార్పొరేట్ విద్యాసంస్థలతో కుమ్మక్కైన పరిస్థితి ఉన్నది. గురుకులంలో చదువుకుంటున్న విద్యార్థులకు సరిగా మెనూ ప్రకారం పెట్టకుండా ఇబ్బందులు పెడతామన్నారు. గురుకులాలకు మరియు హాస్టల్ కి సొంత భవనాలు లేవు ఇవి పట్టించుకోకుండా కార్పొరేట్ విద్యా సంస్థలకు అనుమతులు ఉన్నారు. ఇప్పటికైనా కార్పొరేట్ విద్యాసంస్థలను గుర్తింపు రద్దుచేసి ప్రభుత్వ విద్యాసంస్థలను బలపేతం చేయండి అని వారు డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించిన యెడల ఈనెల 30 తారీఖున ఖమ్మం జిల్లాలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన చేయబోతున్నారు ఖమ్మం జిల్లా విద్యారంగ సమస్యలపై స్పష్టమైన హామీ ఇవ్వకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు ఖమ్మం జిల్లా సభ్యులు రాము, విశ్వంత్, నాయకులు కార్తీక్, రాజేష్, అసాత్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు శిక్షణా తరగతులు ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించాలి

## ● టి డబ్ల్యూ జె ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నాగేష్



**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** స్థానిక ఖమ్మం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ హెచ్ 2843 జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ దివాకర్ టీ.ఎస్ ను కలిసి జర్నలిస్టులకు శిక్షణ తరగతులు ప్రభుత్వం తరపున ఏర్పాటు చేయాలని, వినతి పత్రం ద్వారా కలెక్టర్ ను కలవడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ, ప్రస్తుతం జర్నలిజం ప్రాథమిక సూత్రాలు మారుతున్న టెక్నాలజీ మరియు నైతిక విలువలు చుట్టూ ఉంటుంది. కాబట్టి జర్నలిస్టులకు అత్యంత ముఖ్యమైన ఆయుధం నిజ సత్యాలు నిర్ధారణ సోషల్ మీడియా యుగంలో ఒక వార్త నిజమో కాదో తేల్చుకోవడం, ఎంత ముఖ్యమో చెప్పాలి. వార్తలను ఒకే కోణంలో కాకుండా నాణానికి రెండువైపులా ఏ విధంగా చూడగలుగుతామొ బాధ్యతను గుర్తు చేయాలి, అదే సమయంలో మూలాధారాల గోప్య సమాచారం ఇచ్చే నమ్మకమైన వ్యక్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉంటుంది. ఈ డిజిటల్ యుగంలో కొత్త సవాళ్లు ఇప్పుడు ప్రింట్, టీవీ కంటే డిజిటల్ మీడియా వేగంగా దూసుకుపోతుంది, కాబట్టి కొత్తతరం జర్నలిస్టులు వీటిపై పట్టు సాధించాలి. కావున ప్రభుత్వం తరపున కేవలం ఒక స్మార్ట్ ఫోన్ తోటే నాణ్యమైన వార్తలు ఇంటర్వ్యూలు వీడియోలు ఎలా రికార్డ్ చేయాలో, శిక్షణ తరగతుల ద్వారా నేర్పించాలి. కాబట్టి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వాడకం వార్తల విశ్లేషణకు రీసెర్చ్ కు ఏ.ఐ టూల్స్ ని ఎలా వాడాలి, అలాగే ఫేక్ న్యూస్ ను ఎలా గుర్తించాలో, చెప్పే విధంగా డేటా జర్నలిజం పెద్ద డేటా గణాంకాలను చదివి, వాటి వెనక ఉన్న అసలు కథను ప్రజలకు అర్థమయ్యే విధంగా గ్రాఫిక్స్ రూపంలో కూడా ఎలా వివరించాలో, శిక్షణా తరగతులు ద్వారా అవగాహన కల్పించాలని, వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వేములకొండ రమేష్, ఉపాధ్యక్షులు కందరబోయిన నాగ కృష్ణ ,మామిడాల వీరబాబు, టీబీజేఏ జిల్లా అధ్యక్ష కార్యదర్శి వందనపు సామ్రాట్ గుప్తా,కాసోజు శ్రీధర్, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షులు అమరబోయిన ఉపేందర్, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి కరుణాకర్ సుదగాని, టిడబ్ల్యూజేఎఫ్ నగర అధ్యక్షులు గంటేల కుమార్, టీబీజేఏ నగర అధ్యక్షులు ఎలుగోటి వెంకట్, సహాయ కార్యదర్శి చిన్నంశెట్టి రాంబాబు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, కప్పల మధు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులపై దాడి చేస్తే గనులు స్తంభిస్తాయి సెంట్రల్ వర్క్‌షాప్ గేట్ మీటింగ్‌లో ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ హెచ్చరిక




**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సింగరేణి సంస్థలో కార్మికుల సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నా యాజమాన్యం, ప్రభుత్వాలు వాటి పరిష్కారంపై చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని, కార్మికుల హక్కులను కాలరాస్తూ సంస్థ భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చే విధానాలను ఏఐటీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఉదయం సెంట్రల్ వర్క్‌షాప్‌లో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ, దేశానికి బొగ్గు ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న సింగరేణి సంస్థను బలోపేతం చేయాల్సిన సమయంలో రాజకీయ జోక్యాలు,కార్మిక వ్యతిరేక విధానాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గుర్తింపు సంఘంగా ఉన్నప్పటికీ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారం కాకపోవడంతోనే ఏఐటీయూసీ 31 ప్రధాన డిమాండ్లపై సమ్మె నోటీసు ఇవ్వాల్సి వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ కార్మికుల శ్రమ చట్టాలపై తీవ్రమైన దాడి అని, వాటి అమలు కారణంగానే 12వ వేజ్ బోర్డు కమిటీ ఏర్పాటు ఆలస్యమవుతోందని విమర్శించారు. వేజ్ రివిజన్‌ను ఉద్దేశపూర్వకంగా వాయిదా వేస్తూ లక్షలాది మంది బొగ్గు కార్మికులను ఆర్థికంగా నష్టపరుస్తున్నారని మండిపడ్డారు. సింగరేణి సంస్థకు ప్రభుత్వం చెల్లించాల్సిన సుమారు రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిధులు అందితే సంస్థ మరింత బలోపేతమవడంతో పాటు కొత్త ప్రాజెక్టులు, ఆధునికీకరణ కార్యక్రమాలు, ఉద్యోగావకాశాల విస్తరణకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మణుగూరు డిసైడ్ బ్లాక్‌ను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను విరమించి సింగరేణికే కేటాయించాలని, కొత్త గనులు ప్రారంభించడం ద్వారా సంస్థ భవిష్యత్తును రక్షించాలని కోరారు,ఉద్యోగాల భద్రత, ఉత్పత్తి సామర్థ్యం, సంస్థ అభివృద్ధి కోసం ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న మెడికల్ బోర్డు పునరుద్ధరణ,మారుపేర్ల సమస్య,సొంతింటి పథకం అమలు, పెర్క్స్‌పై విధిస్తున్న ఆదాయపు పన్ను భారం తొలగింపు, సహజ మరణం చెందిన ఉద్యోగుల కుటుంబాలకు మ్యాచింగ్ గ్రాంట్ పునరుద్ధరణ వంటి అంశాలపై యాజమాన్యం నిర్లక్ష్య ధోరణిని విడనాడాలని సూచించారు. సెంట్రల్ వర్క్‌షాప్ కార్మికులు ఎదుర్కొంటున్న సిబ్బంది కొరత, పనిభారం పెరుగుదల,మౌలిక సదుపాయాల లోపం, పదోన్నతుల సమస్యలు,భద్రతా అంశాలపై కూడా ఆయన ప్రస్తావిస్తూ,కార్మికుల సంక్షేమాన్ని పక్కనబెట్టి కేవలం ఉత్పత్తి లక్ష్యాలపై మాత్రమే దృష్టి పెట్టడం సరికాదన్నారు. కార్మికుల హక్కులు,సింగరేణి భవిష్యత్తు, సంస్థ అభివృద్ధి కోసం ఏఐటీయూసీ రాజీలేని పోరాటాలు కొనసాగిస్తుందని, సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెతో పాటు మరింత ఉధృతమైన ఉద్యమాలకు కార్మిక లోకం సిద్ధంగా ఉందని రాజ్‌కుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.వి.రమణమూర్తి, ఉపాధ్యక్షులు క్రిస్టఫర్, సహాయ కార్యదర్శి రాము,పిట్ కార్యదర్శి నరేష్,నాయకులు నాగయ్య, నరసయ్య, మల్లయ్య, రాజేశ్వరరావు, రవీందర్, కందెలింగం, ఆనందరెడ్డి, మురళి, అనిల్, రాజగోపాల్, రవి, శశికరణ్, దేవేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించని ఇంటినిర్మాణాన్ని నిలిపివేయాలి

## జిల్లా కలెక్టరుకు స్థానికుల ఫిర్యాదు



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మున్సిపల్ నిబంధనలకు విరుద్దంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని నిలిపివేయాలని రంగంపల్లికి చెందిన స్థానికులు అధికారులను కోరుతున్నారు. ఈ సందర్భంగా పూదరి హరీష్ మాట్లాడుతూ, 11వ వార్డు రంగంపల్లిలో పూదరి లక్ష్మి-నర్సయ్య దంపతులకు ఇందిరమ్మ గృహం మంజూరు కాగా, ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండా, తమ నివాస స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణాన్ని చేస్తున్నారన్నారు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయగా విచారణ అనంతరం పనులను చేయకూడదని ఆదేశించినట్లు పేర్కొన్నారు. అయినప్పటికి రాజకీయ అందండలు ఉన్నాయనే ధీమాతో మున్సిపల్ అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నారని తెలిపారు. ఇదేవిషయమై జిల్లా కలెక్టరుకు సైతం ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఉన్నతాధికారులు స్పందించి తమ స్థలంలో ఇంటి నిర్మాణం జరపకుండా చూడాలని కలెక్టరుని ఫిర్యాదులో కోరారు.

# క్షణకాలపు మత్తు జీవితాంతం కన్నీళ్లను మిగుల్చుతుంది

## - పెద్దపల్లి మున్సిపల్ కమీషనర్ వెంకటేష్



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** డ్రగ్స్ అనేవి కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాదు, వారి నమ్ముకున్న కుటుంబాన్ని, సమాజాన్ని కూడా నాశనం చేస్తాయని, క్షణకాలం మత్తు జీవితాలను నాశనం చేస్తుందని పెద్దపల్లి మున్సిపల్ కమీషనర్ వెంకటేష్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నశా ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమం లో పాల్గొని మాట్లాడారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సరదాగా మొదలై అలవాటుగా మారి వ్యాసనాలు జీవితాలను కుటుంబాలను చిన్నా భిన్నం చేస్తాయన్నారు. ఉద్యోగ రీత్యా ఎన్ని పనులున్నా పిల్లలను కనిపెట్టుకొని కాపాడుకోవాలని సిబ్బందికి సూచించారు ఈ సందర్భంగా “డ్రగ్స్‌కు నో చెప్దాం - జీవితానికి ఎస్ చెబుదాం అంటూ కార్యాలయ సిబ్బంది తో డ్రగ్స్ నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, అకౌంటెంట్ నాగవేణి, వార్డ్ ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది, నశా ముక్త్ భారత్ కో ఆర్డినేటర్ శ్యామల, ప్రకృతి ఎన్ జి ఓ, డి అడిక్షన్ సెంటర్ సిబ్బంది మౌనిక, హరిత పాల్గొన్నారు.

# ఆర్టికల్ 370 రద్దుకోసం ఉద్యమించిన శ్యామప్రసాద్

## ఘనంగా ముఖర్జీ బలిదాన్ దివస్

## రక్తదానం చేసిన బిజెపి కార్యకర్తలు..



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కాశ్మీరుకు స్వయం ప్రతిపత్తి హక్కులను కల్పించే ఆర్టికల్ 370 అధికరణానికి వ్యతిరేకంగా ఉద్యమించి, దేశప్రజలను చైతన్యవంతులను చేయడంలో భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ చూపిన చొరవ వెలకట్టలేనిదని భారతీయ జనతా పార్టీ నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన వర్ధంతిని పురస్కరించుకొని బలిదాన్ దివస్ చేపట్టి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు పెంజర్ల రాకేష్ మాట్లాడుతూ, ఆధునిక భారతదేశపు గొప్ప జాతీయవాదిగా, రాజనీతిజ్ఞుడిగా ముఖర్జీ పేరుగాంచారని తెలిపారు. ఆయన స్ఫూర్తితోనే కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం 370 ఆర్టికల్ రద్దుచేసి కాశ్మీరు ప్రజలకు నిజమైన స్వాతంత్ర్యాన్ని అందించిందన్నారు. 370 ఆర్టికల్ రద్దుకోసం ఉద్యమిస్తున్న సమయలో జైలుపాలైన ముఖర్జీ అదే జైలులో అనుమానస్పదంగా మరణించడం బాధాకరమన్నారు. ఆయన ఆశయ సాధన కొరకు బిజెపి కార్యకర్తలు కడవరకు దేశంకోసం పనిచేస్తారని రాకేష్ స్పష్టం చేశారు. అనంతరం కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు, సర్పంచ్ వేల్పుల రమేష్, నాయకులు పోల్సని సంపత్ రావు, కావేటి రాజగోపాల్, ఎర్రోళ్ల శ్రీకాంత్, గుడ్ల సతీష్, గాదాసి సతీష్, బొడ్డుపల్లి అంజి, కూషనపల్లి మధుకర్, శ్రీనివాస్, శివ, సాయి, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# రఘునాధపాలెం గిరిజన గ్రామాలకు రూ.110 కోట్లు ఇవ్వండి

- కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ ● వరద నీటి కాలువల నిర్మాణానికి నిధుల కోసం విజ్ఞప్తి
- 37 పంచాయతీల్లో 28 ఏజెన్సీ, గిరిజన గ్రామాలు ● శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు లేఖ

**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలోని రఘునాధపాలెం మండలంలో ఏజెన్సీ, గిరిజన గ్రామ పంచాయతీలకు వరద నీటి కాలువలు, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణం కోసం రూ.110 కోట్లు మంజూరు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత–జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. సోమవారం రాసిన ఈ లేఖలో మండలంలోని డ్రైనేజీ సమస్యలను మంత్రి వివరించారు. మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో 28 ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల పరిధిలోకి వస్తాయని మంత్రి తెలిపారు. వర్షాకాలంలో సరైన వరద నీటి కాలువలు లేక ఈ గ్రామాలు తీవ్ర నీటి నిల్వ, పారిశుధ్య సమస్యలను ఎదుర్కొంటున్నాయని, గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా వరద నీటి కాలువలు, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణానికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ పనులకు రూ.110 కోట్లు అంచనా వ్యయం అవుతుందని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన తన నియోజకవర్గ పరిధిలోని ఈ గిరిజన ప్రాంతాలకు సరిపడా స్థానిక వనరులు లేనందున, గ్రామీణాభివృద్ధి లేదా గిరిజన ప్రాంత అభివృద్ధి పథకాల ద్వారా నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని తుమ్మల కోరారు. ప్రతిపాదిత పనులు ఈ గిరిజన ప్రాంతాల్లో పారిశుధ్యం, ప్రజారోగ్యం, జీవన పరిస్థితులు, మొత్తం మౌలిక సదుపాయాలను గణనీయంగా మెరుగుపరుస్తాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. డీపీఆర్‌తో పాటు గ్రామ పంచాయతీల జాబితాను లేఖకు జతచేస్తూ, నిధుల మంజూరుకు సానుకూలంగా స్పందించాలని కేంద్ర మంత్రిని ఆయన అభ్యర్థించారు.





# శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తి: రవికుమార్ యాదవ్

**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** దేశ ప్రయోజనాల కోసం త్యాగం చేసిన ముఖర్జీ జీవితం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని రవికుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం జనసంఘ్ వ్యవస్థాపకులు, దేశ ఐక్యత కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి (బలిదాన్ దివాస్) సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పటేల్‌కుంట పార్క్ ఎదురుగా ఉన్న భారతీయ జనతా పార్టీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి బీజేపీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యత, జాతీయ సమగ్రత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప దేశభక్తుడని కొనియాడారు. "ఒక్కటే దేశం, ఒక్కటే రాజ్యాంగం, ఒక్కటే జెండా" అనే మహోన్నత సిద్ధాంతం కోసం ఆయన నిరంతరం పోరాడారని గుర్తుచేశారు. ఒక దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జెండాలు ఉండకూడదనే స్పష్టమైన జాతీయవాద భావజాలంతో ముఖర్జీ దేశ రాజకీయాల్లో చెరగని ముద్రవేశారని పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్ సంపూర్ణంగా భారతదేశంలో అంతర్భాగంగా ఉండాలనే లక్ష్యంతో ముఖర్జీ చేసిన పోరాటం చారిత్రాత్మకమని రవికుమార్ యాదవ్ అన్నారు. ఆయన చూపిన దారిలోనే కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దు చేసి దేశ సమైక్యతకు మరింత బలాన్నిచ్చిందని తెలిపారు. దేశ అభివృద్ధి, జాతీయతాభావం, దేశ సమగ్రత కోసం శ్యామా ప్రసాద్ ముఖర్జీ చూపిన మార్గంలో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. యువతలో దేశభక్తి, జాతీయ చైతన్యాన్ని పెంపొందించడం ద్వారా ఆయన ఆశయాలను సాకారం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, డివిజన్ స్థాయి నాయకులు, పదాధికారులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ఘనంగా నివాళులర్పించారు.




# రైల్వే అండర్‌పాస్‌లో నిలిచిన వర్షపు నీటిపై బీజేవైఎం ఆందోళన

- పేపర్ పడవలతో వినూత్న నిరసన చేపట్టిన నందనం విష్ణుదత్

**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మదీనగూడ డివిజన్ పరిధిలోని హుడా కాలనీ, పాపిరెడ్డి కాలనీ మధ్య ప్రజల రాకపోకలకు ఎంతో కీలకమైన రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి వర్షపు నీటితో నిండిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి నెలకొంటున్నప్పటికీ జీహెచ్ఎంసీ అధికారులు శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారని బీజేవైఎం రాష్ట్ర నాయకులు నందనం విష్ణు దత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమస్యపై అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ నందనం విష్ణు దత్ ఆధ్వర్యంలో మంగళవారం వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. వర్షపు నీటితో నిండిపోయిన అండర్‌పాస్‌లో స్థానిక చిన్నారులతో కలిసి పేపర్ పడవలను వదులుతూ నిరసన తెలియజేశారు. ప్రతి వర్షం కురిసినప్పుడూ అండర్‌పాస్ మొత్తం నీటమునిగిపోవడం వల్ల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, విద్యార్థులు, ఉద్యోగులు, స్థానిక కుటుంబాలు రాకపోకల్లో అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నందనం విష్ణు దత్ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం నిర్మించిన అండర్‌పాస్ వర్షాకాలంలో ప్రజలకు శాపంగా మారడం దురదృష్టకరమన్నారు. సమస్య తీవ్రత తెలిసినా సంబంధిత అధికారులు మొద్దునిద్ర వీడి స్పందించడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు తక్షణమే అండర్‌పాస్‌లో నిలిచిన నీటిని తొలగించి, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి రాకుండా శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి వజీర్ రాజు ముదిరాజ్, సీనియర్ నాయకులు దేవేందర్ రావు, వెంకటేష్ ముదిరాజ్, అమర్నాథ్ రెడ్డి, పాలం శ్రీనివాస్ యాదవ్, శ్రీకాంత్ తదితరులతో పాటు కాలనీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



# మియాపూర్ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష

- వన్ డే--వన్ వార్డ్ కార్యక్రమంలో సమస్యల పరిష్కారానికి ఆదేశాలు



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీలో నిర్వహించిన "వన్ డే--వన్ వార్డ్" కార్యక్రమంలో భాగంగా కాలనీల్లో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై విస్తృత స్థాయిలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజన ఐఏఎస్, డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ, తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీఎంసీ పలు విభాగాల అధికారులు, కాలనీల రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ వన్ డే--వన్ వార్డ్ కార్యక్రమం ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో జరిగిన ముఖాముఖి సమావేశంలో కాలనీల్లోని పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చామని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రథమ ప్రాధాన్యతగా తీసుకొని, పెండింగ్ పనులను ఎలాంటి అలసత్వం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. మయూరి నగర్ కాలనీలో అన్ని హంగులతో, సకల సౌకర్యాలతో పార్కును అభివృద్ధి చేసి సుందర శోభిత వనంగా తీర్చిదిద్దామని గాంధీ తెలిపారు. అదే తరహాలో మియాపూర్ వార్డ్ పరిధిలో ఉన్న ఇతర కాలనీల్లో కూడా అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులతో చర్చించినట్లు పేర్కొన్నారు. మియాపూర్ వార్డ్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను తక్షణమే పూర్తి చేయాలని, అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులకు వేగం పెంచాలని, అవసరమైన నిధులను సకాలంలో మంజూరు చేయాలని కమిషనర్‌ను కోరినట్లు గాంధీ తెలిపారు. ముఖ్యంగా సీసీ రోడ్ల నిర్మాణం, రోడ్ల మరమ్మత్తులు, అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు, కాలనీల్లో మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని అసంపూర్తిగా మిగిలిపోయిన నాలాల విస్తరణ పనులను వెంటనే చేపట్టాలని, నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలని, కాలనీల్లో నీటి నిల్వలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని, మియాపూర్ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని, శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు పలు అవగాహన సూచనలు కూడా చేశారు. ప్రతి ఇంటి ఆవరణలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. కాలనీల్లో పేరుకుపోయిన చెత్త, మట్టి కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని పారిశుధ్య సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఎస్ఈ శ్రీకాంతిని, ఈఈ గోవర్ధన్, డీఈ రూపాదేవి, డీఈ దుర్గాప్రసాద్, అలాగే నాయకులు, కార్యకర్తలు, కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# కార్పొరేటు ఫీజు నియంత్రణ చట్టం అమల్లోకి తేవాలి

- కదంతొక్కిన కాషాయ విద్యార్థులు - ఏబీవీపీ పాఠశాల బంద్ విజయవంతం




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ ప్రభుత్వ అసమర్థ పాలన కారణంగా 27వేల ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ చేపట్టిన ఒక్కరోజు పాఠశాలల బంద్ విజయవంతం అయ్యింది. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నాశనమవుతోందని, ముఖ్యమంత్రి రేవంతరెడ్డి విద్యార్థి వ్యతిరేక విధానాల వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు గోసపడుతున్నారని మండిపడ్డారు. ప్రయివేటు కార్పోరేట్ పాఠశాలలు రోజురోజుకు మితిమీరిపోతూ, అధికంగా ఫీజులు వసూలు చేస్తూ, నూతన విద్య హక్కుచట్టాన్ని తుంగలో తొక్కుతున్నాయన్నారు. ఖాళీగా ఉన్న ఎంఈఓ, డీఈఓ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని కోరారు. 27వేల పాఠశాలలు మూసివేసి కేవలం 4వేల పాఠశాలలు మాత్రమే నడిపిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం సిగ్గుచేటన్నారు. రేవంతరెడ్డి చర్యల వల్ల పేద, మధ్యతరగతి దళిత, బహుజన, గిరిజన విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని రాజశేఖర్ ఆందోళన వ్యక్తం చేశారు. అంతకుముందు జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలను ఏబీవీపీ నాయకులు మూసివేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాస్టల్స్ కన్వీనర్ అజయ్, నగర ఉపాధ్యక్షుడు విగ్నేష్, జోనల్ ఇంచార్జ్ గణేష్, జశ్వంత్, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి విచ్చేయుచున్న రైతు ఆశీర్వాద సభను జయప్రదం చేయండి

**జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్**



**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** ఈనెల ది 30-06-2026 న చింతకాని మండలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్న రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ సన్నాహక సమావేశం నిర్వహించనైనది. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచ్చేయుచున్న రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని దిశా నిర్దేశం చేశారు, అదే విధంగా మధిర నియోజకవర్గం చింతకాని మండలం నుండి 9000 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా నిధులు విడుదల చేయనున్నారని, మన ఖమ్మం జిల్లా నుండి నిధులు విడుదల చేయటం మన జిల్లా రైతాంగానికి గర్వకారణం అని రైతు శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రజాప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, ఖమ్మం జిల్లా రైతు సోదరులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమమును జయప్రదం చేయగలరని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ కోరారు. అదే విధంగా జన సమీకరణకు నియోజకవర్గాల వారీగా,మండలాల వారీగా ఇంచార్జీలను నియమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు శాసనమండలి మాజీ సభ్యులు బాలసాని లక్ష్మీనారాయణ, శాసనసభ మాజీ సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, అనుబంధ సంఘ అధ్యక్షులు సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్ గౌడ్, పుచ్చకాయల వీరభద్రం జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మరియు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాదులో మున్సిపల్ చైర్మన్లకు ఓరియంటేషన్ కార్యక్రమం

**- హాజరైన హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి**

**నల్గొండ, ప్రతినిధి, జూన్ 23(ది క్రైమ్ న్యూస్):** హైదరాబాదులోని మెర్క్యూర్ హోటల్, సోమాజిగూడలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్మెంట్ , తెలంగాణ రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు, చైర్‌పర్సన్‌లకు వన్‌డే ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాలియా పురపాలక సంఘం చైర్మన్ చింతల చంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం మున్సిపాలిటీలలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై మేయర్లు, మున్సిపల్ చైర్మన్లకు అధికారులు అవగాహన కల్పించారు. ముఖ్యంగా అమృత్ 2.0 పథకం కింద మంచినీటి ట్యాంకుల నిర్మాణం, నగరాభివృద్ధి నిధుల ద్వారా చేపడుతున్న పనులు, స్వచ్ఛ భారత్ మిషన్ కింద ఘన వ్యర్థాల నిర్వహణ, పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలపై సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీమతి శ్రీదేవి, చీ×ఖవీ డైరెక్టర్, డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్, మున్సిపల్ శాఖ జాయింట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు. పట్టణాల సమగ్ర అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా వ్యవస్థల బలోపేతం, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా ఈ ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

# కమిషనరేట్ ఆర్మ్డ్ హెడ్‌క్వార్టర్స్‌ను సందర్శించిన సీపీ



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కమిషనరేట్ ఆర్మ్డ్ హెడ్‌క్వార్టర్స్‌ను సందర్శించి, హెడ్‌క్వార్టర్స్,ఆర్ఐ కార్యాలయం,డాగ్ స్క్వాడ్ గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడి సిబ్బంది వివరాలు,విధుల నిర్వహణ,స్పెషల్ పార్టీ సిబ్బంది విధులు,ప్రతిరోజూ నిర్వహించే కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. హెడ్‌క్వార్టర్స్‌లోని ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం, పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు.అలాగే సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ, కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా, సక్రమంగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

# ట్రాఫిక్ విధులపై గ్రేహౌండ్స్ సిబ్బందికి సీపీ రమేష్ దిశానిర్దేశం





**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ విధుల నిర్వహణ కోసం ప్రత్యేక శిక్షణ పొందిన 150 మంది గ్రేహౌండ్స్ పోలీసు సిబ్బందితో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ మంగళవారం సీపీ కార్యాలయం ఆడిటోరియంలో సమావేశమయ్యారు. వారం రోజుల పాటు ప్రత్యేక శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బందితో మాట్లాడిన సీపీ, ట్రాఫిక్ విధుల్లో క్రమశిక్షణ, సమన్వయం, ప్రజలతో మర్యాదపూర్వక ప్రవర్తన ఎంతో ముఖ్యమని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధుల్లో సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిర్వహణ, ట్రాఫిక్ ఇంజనీరింగ్, చట్టపరమైన అంశాలపై ఇండోర్, అవుట్‌డోర్ తరగతుల ద్వారా సిబ్బందికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. హెల్మెట్ వినియోగం, లేన్ క్రమశిక్షణ, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో పోలీసుల పాత్ర కీలకమని పేర్కొన్న సీపీ, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రమాదాల కారణంగా కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని, బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌పై ప్రతి సిబ్బంది ప్రజలను చైతన్యపరచాలని అన్నారు. ఐటీ కారిడార్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఒత్తిడి అధికంగా ఉంటుందని, అక్కడ మరింత అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సీపీ సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సేవాభావంతో, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు తక్షణ సహాయం అందించాలని, తమ పనితీరుతో పోలీసు శాఖపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచాలని సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, ఎస్బీ డీసీపీ సుధీంద్ర, ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిని రెడ్డి, సైబర్ క్రైమ్ డీసీపీ సాయి మనోహర్, సీఏఆర్ అండ్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, శేరిలింగంపల్లి ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, ట్రాఫిక్ అడ్మిన్ ఏడీసీపీ నరేందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# అందుకే పీరియడ్స్ సమయంలో చిన్న బెల్లం ముక్క తినాలట.. ఎన్ని లాభాలో



చాలా మంది మహిళలు ప్రతి నెలా పీరియడ్స్ టైంలో భరించలేని కడుపు నొప్పిని అనుభవిస్తుంటారు. దీనివల్ల ఆఫీస్‌కు వెళ్లడం కష్టంగా మారుతుంది. కడుపు నొప్పి, తిమ్మిర్లు, ఉబ్బరం కారణంగా ఏమీ తినాలని అనిపించదు. చాలా అసౌకర్యంగా ఉంటుంది. మీకు కూడా ఇలాంటి రోజుల్లో సమస్యలు తలెత్తితే ఈ కింది జాగ్రత్తలు తీసుకోండి. ఈ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పీరియడ్స్ సమయంలో వచ్చే సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఐరన్ అధికంగా ఉండే బెల్లం సర్వరోగనివారిణి పీరియడ్స్ సమయంలో చిన్న బెల్లం ముక్క తినాలి. ఇది కడుపు నొప్పి నుంచి తక్షణ ఉపశమనం ఇచ్చి, శక్తిని ఇస్తుంది. బెల్లంలో చాలా ఎక్కువ మొత్తంలో ఐరన్ లభిస్తుంది. ఇది తీసుకోవడం వల్ల శరీరానికి తక్షణ శక్తిని అందుతుంది. ఇది పీరియడ్స్ సమయంలో రక్త నష్టాన్ని కూడా భర్తీ చేస్తుంది. బెల్లం ఉపయోగం రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. పీరియడ్స్ సమయంలో వచ్చే తిమ్మిరి నుంచి ఉపశమనం అందిస్తుంది. అలాగే రక్తం కొరత ఉండదు. దీనితో పాటు పీరియడ్స్ సమయంలో ఐరన్ పుష్కలంగా ఉండే పాలకూర, దానిమ్మ, బీట్‌రూట్ వంటి వాటిని కూడా తీసుకోవాలి. బెల్లం తినడం వల్ల కడుపునొప్పి నుంచి తక్షణ ఉపశమనం లభించి, నొప్పిని కూడా తగ్గిస్తుంది. బెల్లంలోని మెగ్నీషియం, పొటాషియం వంటి పోషకాలు కండరాలను రిలాక్స్ చేసి, తిమ్మిరి నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. మానసిక స్థితిని మెరుగుదల పీరియడ్స్ సమయంలో బెల్లం తినడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది. చిరాకు తగ్గుతుంది. బెల్లం వాడకం వల్ల శరీరంలో సంతోషకరమైన హార్మోన్లు పెరుగుతాయి. దీని కారణంగా ఎక్కువ రిలాక్స్‌గా ఉంటారు. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది చాలా మంది మహిళలు పీరియడ్స్ సమయంలో మలబద్ధకం, ఉబ్బరం సమస్యతో ఇబ్బంది పడుతుంటారు. పీరియడ్స్ సమయంలో బెల్లం తప్పనిసరిగా తీసుకోవాలి. ఎందుకంటే ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. పీరియడ్స్ సమయంలో హార్మోన్లలో మార్పుల కారణంగా మానసిక అస్థిరత ఏర్పడుతుంది. బెల్లం తినడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది. పోషకాహార నిపుణులు ప్రకారం.. పీరియడ్స్ ప్రారంభానికి 4 నుంచి 5 రోజుల ముందు నుంచే.. బెల్లం తీసుకోవడం ప్రారంభించాలి.

# కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన సీపీ గౌష్ ఆలం

- కేసుల దర్యాప్తులో వేగం పెంచాలి
- పెండింగ్ కేసులపై సీపీ సమీక్ష
- రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశం

**కరీంనగర్ టౌన్, జూన్ 23(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారంనాడు పోలీస్ కమిషనర్ (సీపీ) గౌష్ ఆలం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన సీపీ, సిబ్బంది పనితీరుపై పలు కీలక సూచనలు చేశారు. నమోదైన కేసుల వివరాలను ఎప్పటికప్పుడు సీసీటీఎన్ఎస్ 2.0 (క్రైమ్, క్రిమినల్ ట్రాకింగ్ నెట్వర్క్ సిస్టమ్స్ )లో పొందుపరచాలని సీపీ ఆదేశించారు. రికార్డుల నిర్వహణ శాస్త్రీయంగా, పారదర్శకంగా ఉండాలని సూచించారు. స్టేషన్ పరిధిలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ఆయన ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌కు గల కారణాలను అడిగి తెలుసుకుని, దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.

కరీంనగర్ రూరల్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలను సెక్టార్లు, సబ్ సెక్టార్లుగా విభజించి, ప్రతి గ్రామానికి గ్రామ పోలీస్ అధికారులను కేటాయించాలని స్పష్టం చేశారు. తద్వారా క్షేత్రస్థాయిలో నిఘా పెంచాలని సూచించారు. విఘాతం కలిగించే రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ప్రతి నెలవారి సమాచారాన్ని సేకరించి రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో భాగంగా కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల తీగలగుట్టపల్లి లోగ రౌడీషీటర్ రొమాల ఉదయ్ అభి ఇంటికి సీపీ నేరుగా వెళ్లి తనిఖీ చేసారు. ప్రస్తుతం ఏం చేస్తున్నారో తెలుసుకున్నారు. సత్ప్రవర్తనతో మెలగాలని హెచ్చరించారు. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌లో రిసెప్షన్, కోర్టు డ్యూటీ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, బీట్ మరియు పెట్రోలింగ్ వంటి అన్ని విభాగాల్లో సిబ్బంది నైపుణ్యం సాధించాలని సీపీ అన్నారు. విధుల నిర్వహణలో నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరి అని హెచ్చరించారు. మహిళా సిబ్బంది కోసం ప్రత్యేక విశ్రాంతి గదుల సౌకర్యాల గురించి ఆరా తీశారు. అవసరమైన మరమ్మత్తులు వెంటనే చేపట్టి, సిబ్బందికి మెరుగైన వసతులు కల్పించాలని ఆదేశించారు. 'స్నేహిత' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలుచేయాలన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయ కుమార్ , రూరల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి, ఎస్సై లక్ష్మారెడ్డి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.





# డ్రగ్స్ రహిత జిల్లాగా మారుద్దాం.. 'యాంటీ డ్రగ్ సోల్జర్స్'గా ముందుకు రండి

- యువత డ్రగ్స్ కు బానిస కావొద్దు - పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి

**రామగిరి, జూన్ 23(ది క్రైమ్ న్యూస్):** డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చే బాధ్యత మనందరిపై ఉందని అలాగే యువత డ్రగ్స్ కు బానిస కావద్దని పెద్దపెల్లి జిల్లా పోలీస్ కమిషనర్ బి రామ్ రెడ్డి అన్నారు. మంగళవారం కమాన్ పూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో డ్రగ్స్ నిషేధంపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. జూన్ 22 నుంచి 26 వరకు నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమాల్లో భాగంగా, జూన్ 26న నిర్వహించనున్న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాదరావు, కమాన్‌పూర్ ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో పెద్దపల్లి జోన్‌లోని కమాన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నాయకత్వంలో డ్రగ్స్ నిర్మూలనను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని తెలిపారు. ఈ లక్ష్యంతో ప్రత్యేకంగా డీజీ స్థాయి అధికారితో "ఈగల్" విభాగాన్ని ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకొని తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం చేపడుతున్న డ్రగ్స్ వ్యతిరేక కార్యక్రమాలకు స్థానిక పోలీసులు, సర్కిల్ అధికారులు, ఏసీపీలు సమన్వయంతో పనిచేస్తూ ప్రత్యేక సమయం కేటాయిస్తున్నారని తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. విద్యకు ప్రాధాన్యత ఇచ్చే పాఠశాలల నుంచే ప్రతిభావంతులైన విద్యార్థులు ఎదుగుతారని పేర్కొన్నారు. ఈ పాఠశాల నుంచి గతంలో మండల స్థాయి టాపర్ రావడం అభినందనీయమని, భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర స్థాయి టాపర్లుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు కేంద్ర నాడీ వ్యవస్థను దెబ్బతీస్తుందని హెచ్చరించారు. తాము మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటమే కాకుండా, ఇతరులను కూడా వాటి నుంచి దూరంగా ఉంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలను వినియోగిస్తున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఇందుకోసం 100 లేదా 1908 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు, మాదకద్రవ్యాల వినియోగంపై సమాచారం అందించి సమాజాన్ని రక్షించడంలో ప్రతి విద్యార్థి "యాంటీ డ్రగ్ సోల్జర్"గా బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గంజాయి, మత్తు పదార్థాలకు సంబంధించిన చట్టవ్యతిరేక కార్యకలాపాల సమాచారం మీలో ఎవరు పోలీసులకు అందిస్తారని డీసీపీ ప్రశ్నించగా, విద్యార్థులందరూ చేతులు ఎత్తి డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు అందిస్తామని తమ మద్దతు తెలిపారు. అలాగే, కార్యక్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'యాంటీ డ్రగ్ సోల్జర్' సెల్ఫీ పాయింట్ వద్ద విద్యార్థులు ఫోటోలు దిగారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ 'యాంటీ డ్రగ్ సోల్జర్'గా మారి సమాజంలో అవగాహన కల్పించాలని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని డీసీపీ బి.రామ్ రెడ్డి, ఏసీపీ ఎం.రమేష్ పిలుపునిచ్చారు.





# ప్రతి విద్యార్థి బాధ్యతాయుతమైన పౌరుడుగా ఎదగాలి

- పన్నూరు కస్తూరిబాలో డ్రగ్స్ పై విద్యార్థులకు అవగాహన
- రామగిరి ఎస్సై తాడవేని శ్రీనివాస్



**రామగిరి, జూన్ 23(ది క్రైమ్ న్యూస్):** ప్రతి విద్యార్థి సమాజంలో బాధ్యతాయుతమైన పౌరుడుగా ఎదగాలని రామగిరి ఎస్సై తాడవేని శ్రీనివాస్ అన్నారు. డ్రగ్స్ వినియోగంపై మండలంలోని పన్నూరు కస్తూరిబా పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం విద్యార్థులు యాంటీ డ్రగ్ సోల్జర్‌గా పని చేయాలని పిలుపునిచ్చారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. డ్రగ్స్ మీద పోలీసులు చేస్తున్న పోరాటంలో పాలుపంచుకోవాలని కోరారు. మత్తు పదార్థాల భారిన పడడం వల్ల బంగారు భవిష్యత్ నాశనం అవుతోందన్నారు. శారీరక, మానసిక ఆరోగ్య విచ్ఛిన్నం కావడంతో పాటు, ఆర్థిక సమస్యలు, సమాజంలో గౌరవం లేకుండా పోతుందన్నారు. ఒక్కసారి డ్రగ్స్ సేవించి పట్టుబడి కేసు నమోదైతే భవిష్యత్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలకు, ఏ ఇతర దేశాలకు కూడా వెళ్లే అవకాశం దొరకక జీవితం అంధకారంలోకి వెళ్తుందన్నారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్నట్లు సమాచారం తెలిస్తే సమాచారం తెలుపాలన్నారు. అనంతరం నేను మాదక ద్రవ్యాల నిరోధకతపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి మంజుల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మీ చర్మం ఆరోగ్యంగా ఉండడంతోపాటు ముఖ సౌందర్యం పెరగాలంటే.. రోజూ ఈ పండ్లను తినాలి..!

చర్మం మృదువుగా, తేమగా ఉండడంతోపాటు సురక్షితంగా ఉండాలని, కాంతివంతంగా మారి మెరవాలని చాలా మంది కోరుకుం టుంటారు. అందులో భాగంగానే చర్మ సంరక్షణకు అనేక మార్గాలను అనుసరిస్తుంటారు. కొందరు బ్యూటీ పార్లర్ చికిత్సలను తీసుకుంటారు. ఇంకా కొందరు ఇంట్లోనే పలు చిట్కాలను పాటిస్తుంటారు. అయితే చర్మ సౌందర్యం, సంరక్షణ కోసం ఆయా చికిత్సలను, చిట్కాలను పాటించడం సరైందే అయినప్పటికీ ఆహారం విషయంలోనూ మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. మనం తినే ఆహారం సరిగ్గా ఉంటేనే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. చర్మ సంరక్షణకు ఆహారం కూడా చాలా ముఖ్యమైందే అన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలి. ఈ క్రమంలోనే పలు రకాల పండ్లను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే దాంతో చర్మాన్ని సురక్షితంగా ఉంచుకోవచ్చు. ఇక ఆ పండ్లు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం. **బెర్రీలు, సిట్రస్ ఫలాలు..** స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప బెర్రీల వంటి బెర్రీ పండ్లను రోజూ తింటుంటే చర్మాన్ని సురక్షితంగా ఉంచుకోవచ్చు. ఈ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లతోపాటు విటమిన్ సి అధిక మొత్తంలో ఉంటుంది. ఇవి చర్మాన్ని దృఢంగా మార్చి యవ్వనంగా ఉండేలా చేస్తాయి. ఈ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల వల్ల ఫ్రీ ర్యాడికల్స్ తొలగిపోతాయి. దీని వల్ల కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీంతో వృద్ధాప్య ఛాయలు రాకుండా అడ్డుకోవచ్చు. చర్మం మృదువుగా మారి కాంతివంతంగా ఉంటుంది. యవ్వనంగా కనిపిస్తారు. అలాగే సిట్రస్ జాతికి చెందిన నిమ్మ, నారింజ వంటి పండ్లను కూడా తింటుండాలి. ఈ పండ్లలోనూ విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది కొల్లాజెన్ ఉత్పత్తికి సహాయం చేస్తుంది. దీని వల్ల చర్మం సాగే గుణాన్ని పొందుతుంది. ముఖంపై ఉండే ముడతలు తగ్గిపోతాయి. ఈ పండ్లను తింటుంటే చర్మం కాంతివంతంగా మారుతుంది. ముఖంపై ఉండే నల్లని మచ్చలు, మొటిమలు తొలగిపోతాయి. చర్మం సురక్షితంగా ఉంటుంది. **బొప్పాయి పండ్లు..** బొప్పాయి పండ్లు మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. ఈ పండ్లు మన చర్మానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ పండ్లలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది ఎక్స్‌ఫోలియేటింగ్ గుణాలను కలిగి ఉంటుంది. కనుక చర్మంపై ఉండే మృతకణాలు తొలగిపోతాయి. బొప్పాయి పండ్లలో ఉండే వటమిన్లు ఎ, సి, ఇ వల్ల మొటిమలు తగ్గి చర్మం కాంతివంతంగా మారుతుంది. నల్లని మచ్చలు తొలగిపోతాయి. బొప్పాయిలో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాల వల్ల చర్మ వాపులు తగ్గిపోతాయి. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. దానిమ్మ పండ్లను తింటున్నా కూడా చర్మానికి మేలు జరుగుతుంది. ఈ పండ్లలో పాలిఫినాల్స్‌తోపాటు యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి సూర్యుని నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల బారి నుంచి చర్మాన్ని రక్షిస్తాయి. ఈ పండ్లలో యాంటీ ఏజింగ్ గుణాలు ఉంటాయి. కనుక వీటిని తింటే వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. యవ్వనంగా కనిపిస్తారు. ముఖ సౌందర్యం పెరుగుతుంది. **అరటి పండ్లు..** అరటి పండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది చర్మానికి కావల్సిన తేమను అందిస్తుంది. ఈ పండ్లలో విటమిన్లు ఎ, బి, ఇ అధికంగా ఉంటాయి. కనుక అరటి పండ్లను తింటే పొడి చర్మం ఉన్నవారికి మేలు జరుగుతుంది. అరటి పండ్లను ఫేస్ ప్యాక్‌గా కూడా ఉపయోగించవచ్చు. దీంతో ముఖానికి కావల్సిన తేమ, మృదుత్వం లభిస్తాయి. ముఖం కాంతివంతంగా మారి మెరుస్తుంది. పుచ్చకాయలు, కీరదోసలను కూడా తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలి. వీటిల్లో నీరు అధిక మొత్తంలో ఉంటుంది. ఇది చర్మానికి కావల్సిన తేమను అందించి చర్మం సురక్షితంగా, ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. వీటిల్లో విటమిన్లు ఎ, సి సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ఎల్లప్పుడూ యవ్వనంగా కనిపించాలంటే వీటిని తరచూ తింటుండాలి. అదేవిధంగా ద్రాక్ష పండ్లను తింటున్నా కూడా చర్మానికి మేలు జరుగుతుంది. ఈ పండ్లలో రెస్వెరెట్రాల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. చర్మాన్ని సూర్య కిరణాల బారి నుంచి రక్షిస్తుంది. చర్మం ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. ఇలా ఆయా పండ్లను రోజూ తింటుంటే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. కాంతివంతంగా మారి మెరుస్తుంది. వృద్ధాప్య ఛాయలు రాకుండా యవ్వనంగా ఉంటారు.

## రాత్రి పూట మీరు తినే ఆహారంలో వీటిని చేర్చుకోండి.. అధిక బరువును సులభంగా తగ్గించుకోవచ్చు..

అధికంగా బరువు ఉన్నవారు రాత్రి పూట భోజనాన్ని త్వరగా ముగిస్తుంటారు. రాత్రి పూట తినే ఆహారంలో చపాతీలను చేర్చుకుంటారు. అంతే కాదు రాత్రి పూట ఆహారాన్ని తక్కువగా తింటారు. ఇలా బరువు తగ్గాలనుకునే వారు రాత్రి భోజనం పట్ల అనేక జాగ్రత్తలను పాటిస్తుంటారు. అయితే బరువు తగ్గాలంటే పలు ఆహారాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. సరైన పోషకాలు ఉండే ఆహారాలను తింటే బరువు తగ్గడం తేలికవుతుంది. ఈ క్రమంలోనే రాత్రి పూట కొన్ని రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల సులభంగా బరువు తగ్గుతారు. వీటిల్లో అనేక పోషకాలు ఉంటాయి కనుక ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి. అధిక బరువు తగ్గాలనుకునే ప్రణాళికలో ఉన్న వారు రాత్రి పూట ఈ ఆహారాలను తీసుకుంటే ఎంతో మేలు జరుగుతుంది. స్కిన్‌లెస్ చికెన్, చేపలు, కూరగాయలు..రాత్రి పూట ఆహారంలో స్కిన్ లెస్ చికెన్ తినవచ్చు. ఇది అద్భుతమైన ప్రోటీన్లను అందిస్తుంది. అలాగే రాత్రి పూట ఆహారంలో చేపలను తింటున్నా మేలు జరుగుతుంది. చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. పిండి పదార్థాలు చాలా తక్కువగా ఉండే కూరగాయలను రాత్రి పూట తినాల్సి ఉంటుంది. పాలకూర, బ్రోకలీ, కాలిఫ్లవర్, మొలకలు, క్యాప్సికం, పుట్ట గొడుగులు, గ్రీన్ బీన్స్ వంటి ఆహారాలను రాత్రి పూట తింటుంటే మేలు జరుగుతుంది. కినోవా, బ్రౌన్ రైస్.. సంక్లిష్టమైన పిండి పదార్థాలు ఉండే ఆహారాలను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ఇవన్నీ రాత్రి పూట తీసుకోదగిన ఆహారాలు. అలాగే బరువు తగ్గేందుకు కూడా ఇవి ఎంతగానో దోహదం చేస్తాయి. ఈ కాంబినేషన్ ట్రై చేయండి.. రాత్రిపూట ఆహారంలో చేపలను, కూరగాయలను కలిపి కాంబినేషన్‌లో తినవచ్చు. లేదా చికెన్, వెజిటబుల్ సలాడ్, ఫ్రూట్ సలాడ్ వంటి వాటిని కలిపి తీసుకోవచ్చు. బ్రౌన్ రైస్, వెజిటబుల్ సూప్‌ను కలిపి తీసుకోవచ్చు. సోయా టోఫు, కూరగాయలను కలిపి కూడా తినవచ్చు. ఇలా రాత్రి పూట భోజనాన్ని ప్లాన్ చేసుకోవచ్చు. అయితే ఆరోగ్యకరమైన ఆహారాలను తిన్నప్పటికీ వీటిని రాత్రి పూట తక్కువ మోతాదులోనే తినాలి. ఇతర ఆహారాలతో పోలిస్తే ఇవి బరువు తగ్గేందుకు మనకు ఎంతో ఉపయోగపడతాయి. కానీ ఎక్కువ మోతాదులో మాత్రం తినకూడదు. భోజనానికి, నిద్రకు మధ్య కనీసం 2 నుంచి 3 గంటల వ్యవధి ఉండేలా చూసుకోవాలి. చక్కెర ఉండే ఆహారాలు, ప్రాసెస్ ఫుడ్స్, శీతల పానీయాలను తాగకూడదు. ఇలా ఆహారపు అలవాట్లను పాటిస్తుంటే అధిక బరువును చాలా తేలిగ్గా తగ్గించుకోవచ్చు.

# సచిన్ రికార్డుకు ఎసరు పెట్టిన జో రూట్

స్పోర్ట్స్



ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ జో రూట్ టెస్ట్ క్రికెట్ లో సరికొత్త హిస్టరీ క్రియేట్ చేశాడు. లండన్ నైట్‌క్లబ్ వివాదం వల్ల బెన్ స్టోక్స్ టీమ్‌కు దూరం అవ్వడంతో జో రూట్ మళ్లీ కెప్టెన్సీ బాధ్యతలు తీసుకున్నాడు. ఓవల్ మైదానంలో న్యూజిలాండ్‌తో జరిగిన సెండ్ టెస్ట్ మ్యాచ్ లో కెప్టెన్సీ ప్రెజర్ ఉన్నప్పటికీ రూట్ బ్యాటింగ్‌లో రెచ్చిపోయాడు. ఈ మ్యాచ్ లో 46, 77 రన్స్ స్కోర్ చేయడం ద్వారా టెస్ట్ క్రికెట్ హిస్టరీలోనే సచిన్ టెండూల్కర్ తర్వాత 14,000 రన్స్ మార్కును దాటిన రెండో బ్యాటర్‌గా రికార్డ్ క్రియేట్ చేశాడు. దీంతో క్రికెట్ ప్రపంచంలో ఇప్పుడు ఒకే ఒక ఇంట్రెస్టింగ్ డిస్కషన్ నడుస్తోంది. సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న 15,921 రన్స్ ఆల్ టైమ్ రికార్డును జో రూట్ బ్రేక్ చేయగలడా, అసలు ఆ రేర్ మైలురాయిని ఎప్పుడు అందుకుంటాడు అనే క్వశ్చన్ హాట్ టాపిక్‌గా మారింది. సచిన్ టెండూల్కర్ 2013 లో రిటైర్ అయినప్పుడు అతని 15,921 రన్స్ రికార్డ్ ఎవరూ బ్రేక్ చేయలేరని అందరూ అనుకున్నారు. అలిస్టర్ కుక్, విరాట్ కోహ్లీ, స్టీవ్ స్మిత్ లాంటి స్టార్స్ ట్రై చేసినా సచిన్ రికార్డుకు చాలా దూరంలోనే ఆగిపోయారు. ఒకప్పుడు ఈ రేసులో లేని జో రూట్, 2021 సంవత్సరం నుంచి తన ఆటతీరును కంప్లీట్‌గా మార్చేశాడు. 2021 లో అతను ఏకంగా 61 యావరేజ్‌తో 1,708 రన్స్ చేసి తన కెరీర్ లోనే బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇచ్చాడు. ఆ తర్వాత నుంచి రూట్ సెంచరీల కన్వర్షన్ రేట్ డబుల్ అయింది. కెరీర్ ఫస్ట్ ఫేజ్ లో ప్రతీ 6 మ్యాచులకు ఒక సెంచరీ కొట్టిన రూట్, లాస్ట్ ఐదేళ్లలో ప్రతీ 3.5 మ్యాచులకే ఒక సెంచరీ బాదుతున్నాడు. ఈ మైండ్ బ్లోయింగ్ కన్సిస్టెన్సీ వల్లే సచిన్ రికార్డును రూట్ బ్రేక్ చేయడం ఇంపాజిబుల్ కాదు, అది కేవలం టైమ్ ప్యాక్టర్ మాత్రమే అని అనలిస్టులు చెప్తున్నారు. ఓవల్ టెస్ట్ ముగిసేసరికి జో రూట్ కెరీర్ టోటల్ 14,075 రన్స్ కు చేరింది. సచిన్ టెండూల్కర్ ఆల్ టైమ్ రికార్డును బ్రేక్ చేయాలంటే రూట్ ఇంకా 1,846 రన్స్ చేయాల్సి ఉంటుంది. రూట్ ఉన్న ప్రెజెంట్ ఫామ్ ప్రకారం చూస్తే మరో 25 టెస్ట్ మ్యాచ్‌లు లేదా 42 ఇన్నింగ్స్ ఆడితే ఈ రన్స్ ఈజీగా వచ్చేస్తాయి. అయితే ఇంగ్లాండ్ రాబోయే క్రికెట్ షెడ్యూల్ మునుపటి కంటే కాస్త తక్కువగా ఉంది. న్యూజిలాండ్ సిరీస్ తర్వాత ఆగస్టులో పాకిస్తాన్‌తో హోమ్ సిరీస్, ఆ తర్వాత సౌతాఫ్రికా టూర్ ఉన్నాయి. ఇక 2027 లో బంగ్లాదేశ్ సిరీస్, ఆస్ట్రేలియాతో 150వ యానివర్సరీ చారిత్రాత్మక టెస్ట్, ఆపై ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్ ఉన్నాయి. ఈ లెక్కన చూస్తే ప్రెజెంట్ డబ్ల్యూటీసీ సైకిల్ ముగిసేసరికి రూట్ సచిన్ రికార్డును దాటడం కష్టమే కావచ్చు. ప్రస్తుత ప్రొజెక్ట్ ప్రకారం, జో రూట్ ఈ వరల్డ్ రికార్డును బ్రేక్ చేసే గోల్డెన్ ఛాన్స్ 2028 స్టార్టింగ్‌లో జరిగే ఇండియా టూర్ లో వచ్చే అవకాశం ఉంది. అప్పటికి రూట్ ఏజ్ 38 ఇయర్స్ కి చేరుకుంటుంది. సచిన్ టెండూల్కర్ తన లాస్ట్ టెస్ట్ మ్యాచ్ ఆడిన ముంబైలోని వాంఖెడే స్టేడియంలోనే జో రూట్ ఈ ఆల్ టైమ్ రికార్డును బ్రేక్ చేస్తే క్రికెట్ హిస్టరీలోనే అది ఒక బిగ్గెస్ట్ పోయెటిక్ మూమెంట్ అవుతుంది. వయసు పైబడుతున్నా రూట్ ఫిట్‌నెస్, డ్యూరబిలిటీ అద్భుతంగా ఉన్నాయి. ఒకప్పుడు ఇంపాజిబుల్ అనుకున్న సచిన్ రికార్డు పర్వతాన్ని జో రూట్ తన ప్రతీ ఇన్నింగ్స్ తో కరిగిస్తూ సంచలనం సృష్టిస్తున్నాడు.

## తీవ్ర భావోద్వేగానికి గురైన వైభవ్ సూర్యవంశీ

ఇండియా క్రికెట్ హిస్టరీలో సరికొత్త సంచలనం సృష్టిస్తున్న 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ ఇంటర్నేషనల్ కెరీర్ లో బిగ్గెస్ట్ మైలురాయిని అందుకున్నాడు. ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు వెళ్లే సీనియర్ టీ20 స్క్వాడ్‌కు అజిత్ అగార్కర్ సెలెక్షన్ కమిటీ వైభవ్‌ను ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. జూన్ 26 నుంచి ఐర్లాండ్ సిరీస్ స్టార్ట్ అవ్వబోతుండగా, హోటల్ రూమ్‌లో వైభవ్‌కు టీమిండియా అఫీషియల్ జెర్సీని అందజేశారు. దీనికి సంబంధించిన ఎమోషనల్ వీడియోను బీసీసీఐ తన అఫీషియల్ హ్యాండిల్‌లో షేర్ చేసింది. టీమ్ ప్రసిద్ధ త్రోడౌన్ స్పెషలిస్ట్ రఘు స్వయంగా వైభవ్ రూమ్‌కు వెళ్లి కిట్ బాక్స్ ఇచ్చాడు. రఘును చూడగానే వైభవ్ ఎంతో వినయంగా అతని పాదాలకు నమస్కరించి బ్లెస్సింగ్స్ తీసుకోవడం ఫ్యాన్స్ మనసులను గెలుచుకుంది. జెర్సీని చేతిలోకి తీసుకున్న తర్వాత వైభవ్ సూర్యవంశీ తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. "నిజంగా ఈ అనుభూతిని చెప్పడానికి మాటలు రావడం లేదు. ఏ కల కోసమైతే నేను ఫస్ట్ డే బ్యాట్ పట్టుకుని ప్రాక్టీస్ కోసం క్రికెట్ గ్రౌండ్‌కు వెళ్లానో, ఆ డ్రీమ్ ఈరోజు నెరవేరింది. నా లైఫ్ లో మోస్ట్ ఇంపార్టెంట్ స్టెప్ కంప్లీట్ అయింది. ఇది ఒక కలలా అనిపిస్తోంది. ఆ బ్లూ టీషర్ట్ పై నా పేరు చూడగానే ముఖంలో నవ్వు ఆపుకోలేకపోయా. కొన్నిసార్లు మనం అస్సలు ఊహించని అద్భుతాలు మన లైఫ్ లో జరుగుతాయి, అవి నిజమైనప్పుడు ఎలా రియాక్ట్ అవ్వాలో కూడా అర్థం కాదు. నా సిట్యుయేషన్ కూడా ప్రెజెంట్ అలాగే ఉంది" అని వైభవ్ ఎమోషనల్ గా చెప్పాడు. ఈ సిరీస్ లో వైభవ్ సూర్యవంశీకి నంబర్ 3 జెర్సీని కేటాయించారు. గతంలో ఇండియా లెజెండ్స్ అయిన హర్భజన్ సింగ్, సురేష్ రైనా లాంటి స్టార్స్ ఈ నంబర్ జెర్సీతోనే మైదానంలో అదరగొట్టారు. ప్రొఫెషనల్ కెరీర్ స్టార్టింగ్ లో నంబర్ 12 జెర్సీ వేసుకున్న వైభవ్, తన తల్లి సలహా మేరకే నంబర్ 3 కి చేంజ్ అయ్యాడు. 12 లో ఉన్న అంకెలను ప్లస్ చేస్తే (1o2) మూడు వస్తుందని, అలాంటప్పుడు డైరెక్ట్‌గా నంబర్ 3 ఎందుకు తీసుకోకూడదు అని అతని తల్లి చెప్పిన మ్యాథ్స్ ఈక్వేషన్ వైభవ్‌కు బాగా లక్ కలిసి వచ్చేలా చేసింది. ఐపీఎల్ లో రికార్డ్ రన్స్ తో ఆరెంజ్ క్యాప్ గెలిచిన ఈ యంగ్ ఓపెనర్, అదే నంబర్ 3 జెర్సీతో ఇండియా సీనియర్ టీమ్ లో సత్తా చాటాలని చూస్తున్నాడు. ఇండియా సీనియర్ టీ20 స్క్వాడ్‌లోకి ఎంట్రీ దక్కినప్పటికీ, ప్లేయింగ్ ఎలెవన్ లో ఓపెనర్‌గా గ్రౌండ్ లోకి దిగడం వైభవ్‌కు అంత ఈజీ కాదు. ఎందుకంటే ఓపెనింగ్ స్లాట్స్ కోసం టీమ్ లో ఆల్రెడీ సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ లాంటి సీనియర్ డ్యాషింగ్ బ్యాటర్లతో భారీ కాంపిటీషన్ ఉంది. ఐర్లాండ్‌తో జరిగే ఫస్ట్ మ్యాచ్ లో మేనేజ్‌మెంట్ వైభవ్‌కు డెబ్యూ క్యాప్ ఇస్తే, సచిన్ టెండూల్కర్ రికార్డును బ్రేక్ చేస్తూ ఇండియా తరఫున ఇంటర్నేషనల్ క్రికెట్ ఆడిన అత్యంత పిన్న వయస్కుడిగా వైభవ్ సూర్యవంశీ సరికొత్త హిస్టరీ క్రియేట్ చేస్తాడు. ఈ వండర్ కిడ్ ఇంటర్నేషనల్ ఎంట్రీ కోసం ఇండియా అంతా చాలా ఈగర్‌గా వెయిట్ చేస్తోందని క్రికెట్ అనలిస్ట్ స్పష్టం చేశాడు.



## వరుస ఫెయిల్యూర్స్ ఉన్నా ఫ్లెమింగ్‌కే ఓటు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో మోస్ట్ సక్సెస్ ఫుల్ ఫ్రాంచైజీ అయిన చెన్నై సూపర్ కింగ్స్ ఒక బిగ్ డెసిషన్ తీసుకుంది. ఐపీఎల్ 2026 సీజన్ లో ఘోరంగా ఫెయిల్ అయ్యాక కోచింగ్ స్టాఫ్ లో మార్పులు వస్తాయనే రూమర్స్ కు సీఎస్కే మేనేజ్‌మెంట్ ఎండ్ కార్డ్ వేసింది. తాజా రిపోర్ట్ ప్రకారం హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను పదవి నుంచి తొలగించే ఆలోచన సీఎస్కేకు లేదు. 2008 నుంచి ఈ ఫ్రాంచైజీతో ప్లేయర్‌గా అసోసియేట్ అయిన ఫ్లెమింగ్, 2009 నుంచి హెడ్ కోచ్‌గా సేవలు అందిస్తున్నాడు. ఐపీఎల్ 2025 లో లాస్ట్ ప్లేస్ లో నిలిచిన చెన్నై, ఐపీఎల్ 2026 లో ఎయిత్ ప్లేస్ కే పరిమితమైంది. దీంతో సోషల్ మీడియాలో "శాక్ ఫ్లెమింగ్" క్యాంపెయిన్స్ నడిచినా మేనేజ్‌మెంట్ మాత్రం అతనిపైనే నమ్మకం ఉంచింది. అతని కాంట్రాక్ట్ ను మరో సీజన్ కోసం ఎక్స్‌టెండ్ చేయనున్నారు. ప్రస్తుతం స్టీఫెన్ ఫ్లెమింగ్ అమెరికాలో జరుగుతున్న మేజర్ లీగ్ క్రికెట్ (మీజ) లో చెన్నై సబ్సిడరీ టీమ్ అయిన టెక్సాస్ సూపర్ కింగ్స్ కు హెడ్ కోచ్‌గా వర్క్ చేస్తున్నాడు. ఈ టోర్నీ ముగిసిన వెంటనే సీఎస్కే మేనేజ్‌మెంట్ ఐపీఎల్ 2026 పర్ఫార్మెన్స్ పై ఒక అఫీషియల్ రివ్యూ మీటింగ్ కండక్ట్ చేయనుంది. అక్కడే ఫ్లెమింగ్ కాంట్రాక్ట్ ఎక్స్‌టెన్షన్ పై అఫీషియల్ స్టాంప్ పడనుంది. సీఎస్కే తీసుకున్న ఈ డెసిషన్ వెనుక లెజెండ్ ఎమ్మెస్ ధోనీ ఇన్ఫ్లుయెన్స్ ఇంకా స్ట్రాంగ్ గా ఉందని స్పష్టంగా అర్థమవుతోంది. ధోనీ, ఫ్లెమింగ్ కాంబినేషన్ ఐపీఎల్ హిస్టరీలోనే మోస్ట్ సక్సెస్ ఫుల్ కెప్టెన్-కోచ్ పెయిర్ కావడంతో పాత స్ట్రక్చర్‌నే బ్యాక్ చేయాలని చెన్నై ఫిక్స్ అయింది. కాగా ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి ఖలీల్ అహ్మద్, డేవిడ్ మిల్లర్ ల మార్పిడి (స్వాప్) పై కొన్ని ఎంక్వైరీలు వచ్చినా చెన్నై దాన్ని తిరస్కరించింది. అలాగే హార్దిక్ పాండ్యా కోసం ఎలాంటి అప్రోచ్ జరగలేదని మేనేజ్‌మెంట్ స్పష్టం చేశాడు. మరోవైపు ఐపీఎల్ 2027 సీజన్ కు ముందే ఒక సంచలన ప్లేయర్ ట్రేడింగ్ ప్రాసెస్ స్టార్ట్ అయింది. లక్నో సూపర్ జాయింట్స్ నుంచి వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ మళ్లీ తన పాత ఫ్రాంచైజీ అయిన ఢిల్లీ క్యాపిటల్స్ లోకి వెళ్లడం దాదాపు ఖాయమైంది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో లక్నో టీమ్ పంత్‌ను ఏకంగా రూ. 27 కోట్ల రికార్డ్ ప్రైస్ పెట్టి కొనుగోలు చేసింది. ఐపీఎల్ హిస్టరీలోనే ఇది అత్యంత ఖరీదైన బిడ్. కానీ లక్నో మేనేజ్‌మెంట్‌తో లీడర్‌షిప్ రోల్ పై వచ్చిన కొన్ని ఇష్యూస్ వల్ల పంత్ ఇప్పుడు లక్నోను వీడాలని డిసైడ్ అయ్యాడు. ఐపీఎల్ ట్రేడ్ విండో రూల్స్ ప్రకారం సీజన్ ముగిసిన ఒక నెల నుంచి నెక్స్ట్ వేలానికి ఒక వారం ముందు వరకు ఈ ప్లేయర్ల మార్పిడికి ఛాన్స్ ఉంటుంది. ఈ మెగా ట్రేడ్ లో భాగంగా రిషభ్ పంత్ ఢిల్లీ క్యాపిటల్స్ లోకి వస్తుండగా, అతని ప్లేస్ లో చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ లక్నో సూపర్ జాయింట్స్ లోకి వెళ్లనున్నాడు. ఈ స్వాప్ డీల్ కోసం రెండు ఫ్రాంచైజీలు తీవ్రంగా డిస్కస్ చేస్తున్నాయని ఇన్సైడ్ సోర్స్ సమాచారం. అయితే పంత్ తీసుకునే అమౌంట్, కుల్దీప్ కోసం లక్నో చెల్లించే ప్రైస్ మనీకి సంబంధించిన ఫార్మాలిటీస్ ఇంకా పూర్తి కాలేదు. "రిషభ్-కుల్దీప్ స్వాప్ ట్రేడ్ జరుగుతున్న మాట నిజమే. రెండు ఫ్రాంచైజీలు ఇందులో బిజీగా ఉన్నాయి. కానీ ఫైనల్ అమౌంట్, మిగిలిన ఫార్మాలిటీస్ ప్రెజెంట్ బీసీసీఐ, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ అప్రూవల్ కోసం పెండింగ్ లో ఉన్నాయి" అని ఈ డెవలప్‌మెంట్‌తో క్లోజ్ గా ఉన్న ఒక అఫీషియల్ సోర్స్ స్పష్టం చేశాడు. ఈ డీల్ కి గ్రీన్ సిగ్నల్ వస్తే ఐపీఎల్ 2027 లో ఇదే బిగ్గెస్ట్ ట్రేడ్ అవుతుంది.



## చరిత్ర సృష్టించిన లియోనెల్ మెస్సీ..

లియోనెల్ మెస్సీ ఫుట్‌బాల్ చరిత్రలో మరో అద్భుత మైలురాయిని అందుకున్నాడు. జూన్ 22, 2026న ఫిఫా వరల్డ్ కప్ 2026 గ్రూప్ జెలో ఆస్ట్రియాతో జరిగిన మ్యాచ్‌లో అర్జెంటీనా కెప్టెన్ రెండు గోల్స్ కొట్టి పురుషుల వరల్డ్ కప్ ఆల్ టైమ్ అత్యధిక గోల్స్ రికార్డును బద్దలు చేశాడు. ఇంతకుముందు జర్మనీ లెజెండ్ మిరోస్లావ్ క్లోజ్ 16 గోల్స్‌తో రికార్డు సృష్టించాడు. మెస్సీ ఈ మ్యాచ్‌లో 17వ గోల్‌తో ఆ రికార్డును సమం చేసి, 18వ గోల్‌తో దాటేశాడు. మ్యాచ్ డల్లాస్‌లోని స్టేడియంలో జరిగింది. మెస్సీ తొలుత పెనాల్టీ కిక్ మిస్ చేశాడు కానీ 38వ నిమిషంలో ఫకుండో మెడినా పాస్‌ను లెఫ్ట్ ఫుట్‌తో అందుకుని అద్భుత గోల్ చేశాడు. ఇది అతని 17వ వరల్డ్ కప్ గోల్. అప్పటికే అల్జీరియాపై హ్యాట్రిక్‌తో 16 గోల్స్ సాధించి క్లోజ్‌ను సమం చేశాడు. ఇన్జ్యూరీ టైమ్‌లో (90o5') మరో గోల్ చేసి రికార్డును తనదిగా చేసుకున్నాడు. అర్జెంటీనా 2-0తో విజయం సాధించి నాకౌట్ స్టేజ్‌కు అర్హత సాధించింది. ఈ విజయంతో మెస్సీ వరల్డ్ కప్‌లో అత్యధిక విజయాలు, అత్యధిక మ్యాచ్‌లు, అత్యధిక నిమిషాలు వంటి ఇతర రికార్డులను కూడా విస్తరించాడు. మెస్సీ ఈ టోర్నమెంట్‌లో ఇప్పటికే 5 గోల్స్ చేశాడు. అతను 6వ వరల్డ్ కప్ ఆడుతున్న మొదటి ఆటగాడు. 38 ఏళ్ల వయసులో కూడా అతని ప్రదర్శన అద్భుతం. ఇంతకుముందు 2022లో వరల్డ్ కప్ గెలిచిన అర్జెంటీనా బ్యాక్ టు బ్యాక్ టైటిల్ కోసం ఆశలు కలిగించింది. మెస్సీ తండ్రి ఆరోగ్య సమస్యలు ఉన్నా, అతను జట్టుకు నాయకత్వం వహించి చరిత్ర సృష్టించాడు. వికీపీడియా, మెస్సీ ఇప్పుడు 18 గోల్స్‌తో టాప్ స్కోరర్. మహిళల వరల్డ్ కప్ రికార్డు హోల్డర్ మార్టా (17)ను కూడా దాటేశాడు. అర్జెంటీనా గ్రూప్ జెలో 6 పాయింట్లతో టాప్‌లో ఉంది. మెస్సీ చిన్న వయసు నుంచి రికార్డులు బద్దలు చేస్తున్నాడు. 2006లో మొదటి వరల్డ్ కప్ గోల్ చేశాడు. ఇప్పుడు 6 ఎడిషన్లలో ఆడి చరిత్ర సృష్టించాడు. అతని సాంకేతిక నైపుణ్యం, లీడర్‌షిప్, హ్యూమిలిటీ అభిమానులను ఆకర్షిస్తున్నాయి. ఈ రికార్డు ఫుట్‌బాల్ ప్రపంచానికి మెస్సీ అని మరోసారి నిరూపించింది. అర్జెంటీనా జట్టు ఆటగాళ్లు ఎంజో ఫెర్నాండెజ్ వంటి వారు మెస్సీని ఆనందంగా ఆలింగనం చేసుకున్నారు. ఈ విజయం అర్జెంటీనా ఫుట్‌బాల్ అభిమానులకు పండగ. బ్యూనస్ ఎయిర్స్‌లో సెలబ్రేషన్స్ జరిగాయి. మెస్సీ తన 39వ పుట్టినరోజు సమీపంలో ఈ రికార్డు సాధించడం ప్రత్యేకం. ఫిఫా, అంతర్జాతీయ మీడియా ఈ సాధనను ప్రధాన హైలైట్‌గా ప్రచురించింది. మెస్సీ ఇంకా ఎన్నో రికార్డులు సాధించాలని అభిమానులు ఆశిస్తున్నారు. అతని కెరీర్ ఇంకా కొనసాగుతుందని భావిస్తున్నారు. మొత్తంమీద ఈ ఈవెంట్ ఫుట్‌బాల్ ప్రపంచాన్ని మెస్సీ మాయాజాలంలో ముంచేసింది. అతని అంకితభావం, నైపుణ్యం యువ ఆటగాళ్లకు స్ఫూర్తి. అర్జెంటీనా జట్టు బ్యాక్ టు బ్యాక్ వరల్డ్ కప్ గెలవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ చరిత్రాత్మక సాధన ఫుట్‌బాల్ ఫ్యాన్స్‌కు ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

## గాయంతో టీ20 జట్టు నుంచి నితీశ్ ఔట్..!

ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌కు ముందు టీమిండియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తర్వాత ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి తొడ కండరాల గాయం కారణంగా ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. కాగా, నితీశ్ స్థానంలో యువ ప్లేయర్ సూర్యాంశ్ షెడ్జెను బీసీసీఐ మంగళవారం జట్టులోకి ఎంపిక చేసింది. జూన్ 26, 28 తేదీల్లో ఐర్లాండ్‌తో , జులై 1 నుంచి ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. అఫ్గానిస్థాన్‌తో వన్డే సిరీస్ ముగిసింది. భారత జట్టు త్వరలో ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో తలపడనుంది. ఇందులో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో టీమిండియా బరిలోకి దిగనుంది. జూన్ 26, జూన్ 28 తేదీల్లో ఐర్లాండ్ వేదికగా ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇప్పటికే బీసీసీఐ.. టీమిండియా జట్టును ఎంపిక చేసింది. కానీ మ్యాచ్‌లకు మూడు రోజుల ముందు టీమిండియాకు షాక్ తగిలింది. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి గాయం కారణంగా ఈ సిరీస్‌లకు దూరమయ్యాడు. ఇప్పటికే మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి టీ20 జట్టు నుంచి వైదొలగగా.. తాజాగా తొడ కండరాల గాయం కారణంగా ఐర్లాండ్, ఇంగ్లాండ్‌లతో టీ20 సిరీస్‌కు అతడు అందుబాటులో ఉండడని బీసీసీఐ తెలిపింది. దీంతో ఈ సిరీస్‌లుకు నితీశ్ ప్లేసులో బీసీసీఐ సూర్యాంశ్ షెడ్జెను ఎంపిక చేసింది. ఈ మేరకు అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. అఫ్ఘాన్‌తో వన్డే సిరీస్‌లో ఆడుతూ.. నితీశ్ రెడ్డి గాయపడ్డాడు.

# పద్మశ్రీ అవార్డు అందుకున్న రోహిత్ శర్మ

టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ దేశ నాలుగో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మశ్రీ అవార్డును అందుకున్నాడు. మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన అవార్డుల పురస్కార కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ అత్యున్నత పురస్కారాన్ని హిట్ మ్యాన్ స్వీకరించాడు. ఈ కార్యక్రమానికి దేశ ప్రధాని నరేంద్ర మోదీతో పాటు పలువు కేంద్ర మంత్రులు, ప్రముఖులు, అవార్డు గ్రహీతలు హాజరయ్యారు. రోహిత్ శర్మ కుటుంబ సభ్యులు కూడా ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముఖ్యంగా రోహిత్ శర్మ అవార్డు స్వీకరించే క్రమంలో అతని సతీమణి రితికా సజ్దే సంతోషం వ్యక్తం చేస్తూ కనిపించారు. క్రికెట్‌లో దేశానికి అందించిన సేవలు గానూ రోహిత్ శర్మను ఈ అవార్డు వరించింది. క్రీడా అత్యున్నత పురస్కారమైన ఖేల్ రత్న అవార్డును కూడా రోహిత్ శర్మ ఇప్పటికే అందుకున్న సంగతి తెలిసిందే. అంతర్జాతీయ టీ20లతో పాటు టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రోహిత్ శర్మ కేవలం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్నాడు. వన్డే ప్రపంచకప్ 2027 ఆడటమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఇటీవల అఫ్గానిస్థాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ మెరుగైన ప్రదర్శన చేశాడు. తొలి మ్యాచ్‌లో విఫలమైనా తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో సత్తా చాటాడు. ఇంగ్లండ్ పర్యటనలో జరిగే వన్డే సిరీస్‌తో రోహిత్ మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టనున్నాడు. రాష్ట్రపతి భవన్‌లో రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 65 మంది ప్రముఖులకు పద్మ అవార్డులు అందజేశారు. ఈ విడతలో మొత్తం 2 పద్మ విభూషణ్, 7 పద్మభూషణ్, 56 పద్మశ్రీ పురస్కారాలు ప్రదానం చేశారు. సినీ, సాహిత్య, వైద్య, క్రీడా తదితర రంగాల్లో విశేష కృషి చేసిన పలువురు ప్రముఖులు అవార్డులు దక్కాయి. మలయాళ సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ నటుడు మమ్ముట్టికి పద్మభూషణ్ పురస్కారం లభించగా.. ప్రముఖ వైద్య నిపుణులు నోరి దత్తాత్రేయుడుకు కూడా పద్మభూషణ్ అవార్డు దక్కింది. తెలుగు సినీ రంగానికి చెందిన ప్రముఖ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌తో పాటు నటుడు ఆర్. మాధవన్‌కు పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. దేశ అభివృద్ధికి, తమ తమ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులను గౌరవించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది పద్మ పురస్కారాలను ప్రదానం చేస్తోంది.



# విశ్వజి



## ఒత్తిడి ఉపశమనం, ప్రశాంతమైన నిద్ర.. ఈ ఒక్కటి ట్రై చెయ్యండి!

వంటింట్లో వెల్లుల్లిని చాలా ప్రధానంగా భావిస్తాము. నిత్యం మనం చేసే వంటలలో కూడా వెల్లుల్లి పాత్ర చాలా ఉంటుంది. వెల్లుల్లిలో మన శరీరానికి ఆరోగ్యాన్నిచ్చే అనేక మంచి గుణాలు ఉన్నాయి. ముఖ్యంగా వెల్లుల్లి నిద్రలేమి లక్షణాలను తగ్గించడంలో ఎంతగానో సహాయం చేస్తుంది. ఇటీవల జరిగిన అధ్యయనాలు వెల్లుల్లి యొక్క సహజ సమ్మేళనాలు నిద్ర నాణ్యతను మెరుగుపరచగలవని సూచిస్తున్నాయి. నిద్ర సమస్యలతో బాధపడుతున్న అనేక మంది వెల్లుల్లి తో నిద్రలో మెరుగుదలను చూసినట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. వెల్లుల్లి ప్రయోజనాలు వెల్లుల్లిలో విటమిన్లు మాంగనీస్, మరియు కాల్షియం, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, విటమిన్లు %జు, ఖ% వంటి అనేక ఖనిజాలు ఉంటాయి. ఇది కాకుండా, వెల్లుల్లిలో అల్లిసిన్ వంటి శక్తివంతమైన సమ్మేళనాలు ఉంటాయి. ఇవి యాంటీ బాక్టీరియల్ మరియు యాంటీ ఫంగల్ లక్షణాలను కలిగి ఉంటాయి. వెల్లుల్లిలో అలిసిన్ ఉంటుంది. ఇది వ్యాధినిరోధక లక్షణాలను కలిగి ఉంటుంది. వెల్లుల్లితో నిద్ర నాణ్యత.. అధ్యయన ఫలితాలు ఈ లక్షణాలు నిద్రలేమికి సాధారణ కారణాలైన ఒత్తిడి మరియు ఆందోళనను తగ్గించడంలో సహాయపడవచ్చు. అదనంగా, వెల్లుల్లి యొక్క యాంటీఆక్సిడెంట్లు మొత్తం ఆరోగ్యాన్ని ప్రోత్సహించగలవు, ఇది మెరుగైన నిద్రని ఇస్తుంది. అధ్యయనం ప్రకారం నిద్ర వ్యవధి మరియు నాణ్యతను మెరుగుపరచడంలో వెల్లుల్లి గణనీయమైన పాత్రను కలిగి ఉంది. రాత్రివేళ ఆహారంలో వెల్లుల్లిని చేర్చిన తర్వాత నిద్రపోయేవారు తక్కువ అంతరాయాలతో ఎక్కువ సేపు నిద్ర పోయారు. రాత్రి పడుకోబోయే ముందు వెల్లుల్లి మంచి నిద్రనిస్తుంది కనుక వెల్లుల్లి మన నిద్రకు దోహదం చేసే గొప్ప గుణాలు కలిగి ఉందని నమ్మవచ్చనే అభిప్రాయం ఉంది. రోజువారీ భోజనాలలో వెల్లుల్లిని చేర్చడం మంచిది. మన ఆరోగ్యానికి ఇది ఒక ఖర్చు తక్కువ విధానం. ఇది వివిధ వంటకాలలో వివిధ రకాలుగా ఉపయోగించవచ్చు. ఆహారంలో భాగంగా దీనిని తీసుకోవడం నిద్రకు మాత్రమే కాదు అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలిగిస్తుంది.ఏది ఏమైనా రాత్రి పడుకోబోయే ముందు వెల్లుల్లిని తీసుకోవడం మంచి నిద్రకు దోహదం చేస్తుందని అధ్యయనం నిద్రలేమితో బాధపడే వారికి ఒక మంచి శుభవార్త చెప్పినట్టే భావించాలి.

## డయాబెటిస్ పేషెంట్స్ రాగిజావ ఎక్కువగా తాగుతున్నారా?



డయాబెటిస్.. ఇప్పుడు ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న మహమ్మారి. ప్రతి పదిమందిలో ఐదుగురు డయాబెటిస్ బాధితులు ఉంటున్నారంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. డయాబెటిస్‌ను పట్టించుకోకపోతే మనకు తెలియకుండానే మన ప్రాణాలను హరిస్తుంది. డయాబెటిస్ తో బాధపడేవారు మందులు తీసుకోవడంతో పాటు ముఖ్యంగా లైఫ్ స్టైల్ చేంజ్ చేసుకోవడం చాలా అవసరం. అన్నానికి బదులుగా రాగిజావ తినే ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించడం, ప్రతిరోజు వ్యాయామం చేయడం, యోగ సాధన చేయడం, ఒత్తిడిని తగ్గించుకోవడం, ప్రతిరోజు ఏడు నుండి ఎనిమిది గంటల పాటు నిద్రపోవడం ఎంతో అవసరం. ఇక్కడ డయాబెటిస్ తో బాధపడేవారు డయాబెటిస్ ను కంట్రోల్ చేసుకోవడం కోసం చాలామంది అన్నానికి బదులుగా రాగిజావ ను తీసుకుంటున్నారు. రాగి జావతో డయాబెటిస్ బాధితులకు ప్రయోజనం కలుగుతుందా? అయితే రాగిజావ ని తీసుకోవడం మంచిదేనా? రాగి జావతో డయాబెటిస్ బాధితులకు ప్రయోజనం కలుగుతుందా అనేది ప్రస్తుతం మనం తెలుసుకుందాం.రాగులలో ఫైబర్ అధికంగా ఉంటుంది. అంతేకాదు తక్కువ గ్లైసిమిక్ ఇండెక్స్ కలిగి ఉంటుంది. అటువంటి రాగులు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి సహాయపడతాయి. రాగులలో ఉండే ఫైబర్ కారణంగా జీర్ణక్రియ మందగిస్తుంది. మధుమేహం ఉన్నవారికి ఇది మేలు చేస్తుందా? ఇది రక్తంలో చక్కెర స్థాయిలు నెమ్మదిగా పెరగడానికి సహాయపడుతుంది. కాబట్టి ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు మేలు చేస్తుందని చెప్పవచ్చు. ఇక్కడ చెక్కర స్థాయిలను వేగంగా రాగులు పెంచకపోవడం వల్ల, మధుమేహం ఉన్నవారు నిరభ్యంతరంగా తీసుకోవచ్చు. అయితే రాగిజావ ని తీసుకోవడంలో ఒక ప్రమాదం కూడా ఉంది. రాగి జావను మితంగా తీసుకుంటే అది మన బ్లడ్ షుగర్ లెవల్స్ ను కంట్రోల్ చేస్తుంది. మోతాదు కంటే ఎక్కువగా తీసుకుంటే డేంజర్ రాగి జావ ని తీసుకుంటే ఏమి కాదు అన్న ఉద్దేశంతో దానిని మోతాదు కంటే ఎక్కువగా తీసుకుంటే మళ్లీ అది మన బ్లడ్ షుగర్ లెవెల్స్ పెరగడానికి కారణమవుతుంది. పచ్చ జొన్నలు, సజ్జలు, కొర్రలు, ఒంద్రు కొర్రలు వంటి వాటితో పోల్చి చూస్తే రాగులు కాస్త త్వరగా షుగర్ లెవెల్స్ పెంచుతాయని చెప్పవచ్చు. రాగిజావ తీసుకోవాలంటే ఇలా చెయ్యండి కాబట్టి రాగిజావ ని తీసుకోవాలనుకునే వారు మితంగా తీసుకుంటే మంచిది. మీ ఆహారంలో మీరు రాగిజావ ను చేర్చాలి అనుకుంటే, మీ డయాబెటిస్ కు సంబంధించి చికిత్స తీసుకుంటున్న వైద్య నిపుణులతో సంప్రదించి ఆయన సూచన మేరకు తీసుకోవడం మంచిది.

## ఫేస్ క్రీములు అవసరం లేదు, ఈ నీళ్లు ఉంటే చాలు..
# మిలమిలా మెరిసిపోతారు అంతే!



చాలా మందికి మండే ఎండలో అందంగా కనిపించాలనే కోరిక ఉంటుంది. అందుకోసం చాలా మంది రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. క్రీములు అని, పేస్ ప్యాక్ అని ఏదేదో ప్రయత్నిస్తుంటారు. కానీ అవేమి సరైన ఫలితాలు ఇవ్వక అందరూ నిరాశకు గురవుతుంటారు. అయితే ఎవరైతే అందం మీద ఎక్కువగా ఆశ ఉంటుందో, అందంగా కనిపించాలనే కోరిక ఉంటుందో వారు రోజ్ వాటర్ వినియోగిస్తే చాలా మంచి ఫలితాలు పొందే అవకాశం ఉంటుంది. ఇంతకీ రోజ్ వాటర్ వలన ఎలాంటి ఉపయోగాలు కలుగుతాయి? దానిని ఎలా ఉపయోగించాలి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం. టోనర్: రోజ్ వాటర్ ఒక అద్భుతమైన టోనర్. ఇది చర్మ రంధ్రాలను శు భ్రపరచడానికి, చర్మం %జూ౧% స్థాయిని సమతుల్యం చేయడానికి, చర్మాన్ని మృదువుగా చేయడానికి సహాయపడుతుంది. సైలెంట్ హార్ట్ ఎటాక్..నొప్పి లేకుండానే చంపేస్తది..మీ గుండె భద్రమో కాదో ఇలా తెలుసుకోండి మాయిశ్చరైజర్: రోజ్ వాటర్ చర్మాన్ని తేమగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇది పొడి చర్మానికి మంచి మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది. దీంతో చర్మం ఎప్పుడూ తాజాగా, తేమగా కనిపిస్తూ ఉంటుంది. మొటిమలు మరియు మచ్చలు: రోజ్ వాటర్‌లో యాంటీ బాక్టీరియల్ మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి మొటిమలు మరియు మచ్చలను తగ్గించడంలో సహాయపడతాయి. కళ్ళ కింద నల్లటి వలయాలు మరియు వాపు: రోజ్ వాటర్ కళ్ళ కింద నల్లటి వలయాలు మరియు వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. సన్ బర్న్ మరియు చర్మం చికాకు: రోజ్ వాటర్ సన్ బర్న్, చర్మం చికాకును తగ్గించడంలో సహాయపడుతుంది. జుట్టు సంరక్షణ కోసం జుట్టు కండీషనర్: రోజ్ వాటర్ జుట్టును మృదువుగా మరియు మెరిసేలా చేస్తుంది. చుండ్రు నివారణ: రోజ్ వాటర్‌లో యాంటీ ఫంగల్ లక్షణాలు ఉన్నాయి, ఇవి చుండ్రును తగ్గించడంలో సహాయపడతాయి. జుట్టు పెరుగుదల: రోజ్ వాటర్ జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడంలో సహాయపడుతుంది. ఇడ్లీ,దోశ కాదు..మన పూర్వీకులు పొద్దున్నే తిన్నది ఇదే..కొండలను ఢీకొట్టే శక్తి..ఎలా చేసుకోవాలంటే 00:00 రోజ్ వాటర్ మానసిక స్థితిని మెరుగుపరచడానికి మరియు ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడుతుంది. తలనొప్పి ఉపశమనం: రోజ్ వాటర్ తలనొప్పిని తగ్గించడంలో సహాయపడుతుంది. నిద్ర నాణ్యతను మెరుగుపరచడం: రోజ్ వాటర్ నిద్ర నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. జీర్ణక్రియను మెరుగుపరచడం: రోజ్ వాటర్ జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

# మార్కెట్

## మైక్రోసాఫ్ట్‌లో ఇజ్రాయెల్ అలజడి..
### 18 మంది ఉద్యోగులు అరెస్ట్

హమాస్ అంతమే లక్ష్యంగా గాజాలో ఇజ్రాయెల్ సైన్యం మారణహోమం సృష్టిస్తోంది. వైమానిక దాడులతో విరుచుకుపడుతోంది. ఈ దాడుల్లో అనేక మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. అయితే, ఈ దాడులు టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌కు ఇబ్బందికరంగా మారాయి. గాజాలో ఇజ్రాయెల్ సైన్యం పాల్పడుతున్న దారుణాలపై అమెరికాలోని మైక్రోసాఫ్ట్ ప్రధాన కార్యాలయంలోని కొందరు ఉద్యోగులు ఇటీవలే నిరసనకు దిగారు. కంపెనీ రూపొందించిన టెక్నాలజీని ఉపయోగించి ఇజ్రాయెల్ సైన్యం దారుణాలకు పాల్పడుతోందని ఆరోపిస్తున్నారు. తక్షణమే ఇజ్రాయెల్ సైన్యంతో ఉన్న సాంకేతిక సంబంధాలకు ముగింపు పలకాలని మైక్రోసాఫ్ట్‌ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఆందోళనలతో అప్రమత్తమైన సంస్థ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు దాదాపు 18 మంది మైక్రోసాఫ్ట్ ఉద్యోగులను అరెస్ట్ చేశారు. ఇజ్రాయిల్ సైన్యం గాజాలో కార్యకలాపాలు నిర్వహించడానికి, పాలస్తీనియన్లపై నిఘా కోసం తమ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించడాన్ని నిరసిస్తూ మైక్రోసాఫ్ట్ ఉద్యోగులు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. వాషింగ్టన్‌లోని రెడ్‌మండ్‌లోని కంపెనీ తూర్పు క్యాంపస్‌ను ఉద్యోగులు చుట్టుముట్టి నిరసన తెలిపారు. సంస్థ ఫిర్యాదుతో అక్కడికి చేరుకున్న రెడ్‌మండ్ పోలీసులు ఆగస్టు 20న మధ్యాహ్నం 12:15 గంటల సమయంలో ఆందోళన చేస్తున్న 18 మందిని అరెస్ట్ చేశారు. అరెస్టైన వారిలో మైక్రోసాఫ్ట్ ప్రస్తుత, మాజీ ఉద్యోగులు ఉన్నట్లు తెలిసింది.



# జీఎస్టీలో ఇకపై రెండు స్లాబులే..

### కేంద్రం ప్రతిపాదనకు మంత్రుల బృందం ఆమోదం




వస్తువులు, సేవల పన్ను విధానాన్ని సవరించాలన్న కేంద్రం ప్రతిపాదనలకు మంత్రుల బృందం అంగీకరించింది. 12, 28 శాతం శ్లాబులు తొలగించి 5, 18 శాతం శ్లాబులు మాత్రమే ఉంచేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గురువారం జరిగిన కీలక సమావేశంలో ఈ మేరకు మంత్రుల బృందం ఆమోదం తెలిపింది. జీఎస్టీలో ప్రస్తుతం 5, 12, 18, 28 శాతం పన్ను స్లాబులున్నాయి. మార్కెట్‌లోని దాదాపు అన్ని వస్తూత్పత్తులపై ఈ స్లాబుల ప్రకారమే పరోక్ష పన్నులు పడుతున్నాయి. అయితే, 5, 18శాతం స్లాబ్‌లను మాత్రమే కొనసాగించాలని, 12, 28 స్లాబ్‌లను తొలగించాలని కేంద్రం ప్రతిపాదించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ.. ఆయా రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన కమిటీకి ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనకు ఆయా రాష్ట్రాల మంత్రులతో కూడిన బృందం తాజాగా ఆమోదం తెలిపింది. ఆల్ట్రా లగ్జరీ, సిన్ గూడ్స్ (సిగరెట్లు వంటివి)పై 40 శాతం పన్ను విధించడం కూడా కేంద్ర ప్రతిపాదనలో ఉందని యూపీ ఆర్థికమంత్రి సురేష్ కుమార్ ఖన్నా తెలిపారు. 12 శాతం స్లాబులోని 99 శాతం వస్తూత్పత్తులు 5 శాతంలోకి, 28 శాతం స్లాబులోని 90 శాతం వస్తూత్పత్తులు 18 శాతంలోకి రానున్నట్లు తెలిసింది. ప్రస్తుతం జీఎస్టీలో కనీస పన్ను 5 శాతం స్లాబులో రోజువారీ నిత్యావసర వస్తూత్పత్తులున్నాయి. ఇక స్టాండర్డ్ గూడ్స్‌పై 12 శాతం, ఎలక్ట్రానిక్స్, ఆయా రకాల సేవలపై 18 శాతం, పొగాకు, ఇతర విలాసవంతమైన ఐటమ్స్‌పై గరిష్ఠంగా 28 శాతం పన్నులు పడుతున్నాయి. ఈ క్రమంలోనే అదనంగా పాన్ మసాలా, లగ్జరీ కార్లు తదితరాలపై జీఎస్టీ నష్టపరిహార సెస్సును కూడా విధిస్తున్నారు. జీఎస్టీ అమలుతో రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయానికి వాటిల్లుతున్న నష్టాలను భర్తీ చేయడానికే ఈ సెస్సు. అలాగే కొన్ని నిత్యావసరాలకు జీఎస్టీ మినహాయింపుండగా.. ప్రత్యేకంగా వజ్రాలు, సానబెట్టిన రత్నాలు, బంగారంపై 0.25 శాతం నుంచి 3 శాతం వరకు జీఎస్టీ విధిస్తున్నారు.

ప్రజలకు లాభమెంత? ఇప్పుడున్న జీఎస్టీ స్లాబుల్లో 18 శాతం చాలా కీలకం. జీఎస్టీ వసూళ్లలో ఈ ఒక్క స్లాబు నుంచి వచ్చే ఆదాయం వాటానే 65 శాతంగా ఉన్నది. జీఎస్టీ 2.0లో ఈ స్లాబును యథాతథంగానే ఉంచుతుండటం గమనార్హం. అంటే ప్రస్తుతం ఈ స్లాబులో ఉన్న వస్తూత్పత్తుల ద్వారా ప్రభుత్వ ఖజానాకు వస్తున్న ఆదాయానికి ఢోకా లేదన్నమాట. ఫలితంగా వాటి వినియోగదారులకు ఇకపైనా ఏమాత్రం ప్రయోజనం ఉండదు. ఇప్పుడు ఎంతకు కొంటున్నారో.. కొత్త జీఎస్టీ విధానంలోనూ వాటి కోసం అంతే చెల్లించాల్సి ఉంటుంది. దీంతో మోదీ సర్కారు గొప్పగా జనాలపై జీఎస్టీ భారాన్ని తగ్గించబోతున్నామని, దీపావళి కానుక అంటూ ఊదరగొడుతుండటం అంతా ఉత్తదే. మెజారిటీ వినియోగదారులకు జీఎస్టీ స్లాబుల తగ్గింపు వల్ల ఒనగూరుతున్నదేమీ లేదన్నది తేటతెల్లమైపోయింది. అలాగే ప్రస్తుతం పేద, మధ్య తరగతి వర్గాలు కొంటున్న 5 శాతం స్లాబులోని వస్తూత్పత్తులపై పన్ను భారం అలాగే ఉంటుంది. ఇక పొగాకు, ఆన్‌లైన్ గేమింగ్స్, లగ్జరీ బైకులు, కార్లు ఇతర వస్తూత్పత్తులపై గరిష్ఠంగా 40 శాతం జీఎస్టీ ఉండనే ఉంటున్నది. దీంతో కొత్త జీఎస్టీ విధానం వచ్చి పన్ను స్లాబులు తగ్గినా మొత్తం పన్ను భారం మాత్రం ఇప్పుడున్నట్టుగానే ఆయా కొనుగోలుదారులపై 88 శాతంగానే ఉంటుందన్న అంచనాలున్నాయి. దీంతో 12 శాతం, 28 శాతం స్లాబులను తీసేయడం వల్ల నష్టపోతున్న ఆదాయం అంతంత మాత్రమేనని పలువురు ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. నిజానికి జీఎస్టీ వసూళ్లలో ఇప్పుడు 12 శాతం స్లాబు ద్వారా 5 శాతం, 28 శాతం స్లాబు ద్వారా 11 శాతం ఆదాయమే వస్తున్నది. ఏదిఏమైనా కేంద్ర ప్రభుత్వ జీఎస్టీ స్లాబుల తగ్గింపు జిమ్మిక్కులకు ఈ లెక్కలన్నీ నిదర్శనం. అలాగే బంగారం, వజ్రాలు, ఇతర విలువైన రత్నాలపై జీఎస్టీ యథాతథంగానే ఉండనున్నది. దీంతో స్థూలంగా జీఎస్టీ స్లాబుల సవరణతో సగటు సాధారణ వినియోగదారునికి కేంద్రంలోని మోదీ సర్కారు చేకూర్చే లబ్ధి ఏమీ లేదని తేలిపోయింది.

# ఆంధ్రప్రదేశ్

## టూరిస్ట్ బస్సులపై పన్నులు తగ్గింపు

### కేబినేట్ నిర్ణయంపై మంత్రి మండిపల్లి హర్షం

అమరావతి,జూన్23 : రాష్ట్రంలో పర్యాటక, రవాణా రంగాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో టూరిస్ట్ బస్సుల నిర్వహణ భారాన్ని తగ్గించేలా.. పన్నుల తగ్గింపునకు రాష్ట్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక చొరవ, వాహన యజమానుల సుదీర్ఘ విజ్ఞప్తుల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. దీని ప్రకారం.. 'అఖిల భారత పర్యాటక పర్మిట్' కలిగిన టూరిస్ట్ బస్సులకు ప్రతి సీటుపై విధించే త్రైమాసిక పన్నును రికార్డు స్థాయిలో తగ్గించారు. ఇప్పటివరకు ఉన్న రూ. 4,000 పన్నును రూ. 2,500కు తగ్గిస్తూ మంత్రి మండలి ఆమోదం తెలిపింది. గతంలో భారీగా ఉన్న పన్నుల భారం కారణంగా ఏపీకి చెందిన పలువురు బస్సు ఆపరేటర్లు తమ వాహనాలను పొరుగు రాష్ట్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. తాజా పన్ను తగ్గింపుతో ఆయా రాష్ట్రాలకు వెళ్లిన బస్సుల రిజిస్ట్రేషన్లు తిరిగి ఏపీకి వచ్చేందుకు మార్గం సుగమమైంది. తద్వారా రాష్ట్ర రవాణా రంగానికి కొత్త ఊపు రావడమే కాకుండా, పర్యాటక రంగానికి మరింత ప్రోత్సాహం లభించనుంది. వాహన యజమానులపై పన్ను భారం గణనీయంగా తగ్గినప్పటికీ.. రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరగడం ద్వారా రాష్ట్ర ఖజానాకు ఆదాయం పెరగుతుంది. అలానే రవాణా శాఖకు వాహనాలపై మెరుగైన పర్యవేక్షణకు అవకాశం లభిస్తుంది. క్యాబినెట్ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రవాణా రంగ సంక్షేమానికి, ఆపరేటర్ల ప్రయోజనాలకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందనేందుకు ఈ నిర్ణయమే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. కేవలం పన్నుల తగ్గింపు మాత్రమే కాకుండా, టూరిస్ట్ బస్సుల భద్రత, ఫిట్‌నెస్ పర్యవేక్షణను మరింత కఠినతరం చేస్తూ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడతామని మంత్రి రాంప్రసాద్ స్పష్టం చేశారు.

## ప్రజా సమస్యలపై పిటిషన్స్ కమిటీ చర్చ

### నిర్దిష్ట సమయంలో పరిష్కారానికి చొరవ

### కమిటీ ఛైర్మన్ రఘురామకృష్ణంరాజు

విశాఖపట్నం,జూన్23 : శాసనసభ పిటిషన్స్ కమిటీ సమావేశంలో ప్రజా సమస్యల పరిష్కారంపై విస్తృతంగా చర్చించినట్లు కమిటీ ఛైర్మన్ రఘురామకృష్ణంరాజు తెలిపారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సమర్పించిన పిటిషన్లపై సుదీర్ఘంగా చర్చించామని చెప్పారు. ప్రతి సమస్య పరిష్కారానికి నిర్దిష్ట కాలపరిమితిని నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులను నేరుగా సమావేశానికి తీసుకువచ్చి వారి అభిప్రాయాలను తెలుసుకున్నామని పేర్కొన్నారు. మానవతా దృక్పథంతో సమస్యలను పరిష్కరించేందుకు కమిటీ కృషి చేస్తోందన్నారు. విశాఖ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కూడా పలు ప్రజా సమస్యలను కమిటీ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. వివిధ అంశాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించి, సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేసినట్లు చెప్పారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు లాగా ఎమ్మెల్యేలు మరింత చొరవ చూపి సమస్యలను కమిటీ దృష్టికి తీసుకురావాలని రఘురామకృష్ణంరాజు కోరారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సమావేశాలను నిర్వహిస్తూ ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో చర్చించిన సమస్యలను వచ్చే రెండు నుంచి మూడు నెలల్లో పరిష్కరించేలా చర్యలు చేపడతామని రఘురామ స్పష్టం చేశారు.

## 11వేల మంది ఉద్యోగులకు లబ్ది

### సీపీఎస్ అసోసియేషన్ హర్షం

అమరావతి,జూన్23 : రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఏపీ సచివాలయ సిపిఎస్ ఉద్యోగుల అసోసియేషన్ స్వాగతించింది. జ.వోనెం.57 అమలుపై సీపీఎస్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. కేబినెట్ నిర్ణయంతో రాష్ట్రంలోని 11 వేల మంది ఉద్యోగులకు లబ్ది చేకూరనుంది. వెటరన్, ఫ్యామిలీ అఖా కంట్రిబ్యూషన్‌పై స్పష్టతనిచ్చిన సర్కార్.. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం చూపించింది. ఉద్యోగుల గ్రాడ్యుటీ మేరకు ఫ్యామిలీ పెన్షన్ మంజూరుకు నిర్ణయం తీసుకుంది. దీంతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు అఖా అసోసియేషన్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అఖా అసోసియేషన్ పేర్కొంది. ఏపీ కేబినెట్ సమావేశంలో ఉద్యోగులకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారని ఏపీఎన్‌జీవో అధ్యక్షుడు విద్యాసాగర్ అన్నారు. సీపీఎస్ నుంచి ఓపీఎస్‌లోకి మెమో 57 ప్రకారం 11 వేలమంది ఉద్యోగులకు మేలు జరిగిందన్నారు. ప్రభుత్వరంగ ఉద్యోగుల పదవి విరమణ వయసును 60 నుంచి 62కు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. కేబినెట్ నిర్ణయంతో ఈరోజు ఉద్యోగుల కల నెరవేరిందన్నారు. అందుకే సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు ఉద్యోగులు ధన్యవాదాలు తెలియజేస్తున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ అంశాన్ని సీఎం చంద్రబాబు పరిశీలించాలని విద్యాసాగర్ కోరారు.

## చెంగల్పట్టు కోర్టులో భర్త కోసం వెతుకుతున్న భార్య కథ

### సిఎం విజయ్‌ను ఉద్దేశిస్తూ.. ఉదయనిధి కౌంటర్

చెన్నై,జూన్23 : తమిళనాడు అసెంబ్లీ సమావేశాలు వాడీవేడీగా జరిగాయి. హిందీ వివాదం, నీట్, కరూర్ తొక్కిసలాట ఘటన, రైతుల నిరసన అంశాలను మంగళవారం సీఎం విజయ్ ప్రస్తావించారు. ప్రతిపక్ష పార్టీలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, వారి ఉచ్చులో రైతులు పడదని తెలిపాడు. అలానే కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను అర్థం చేసుకొని, మద్దతు ఇవ్వాలని రైతులను సీఎం కోరారు. విజయం చేసిన ఈ వ్యాఖ్యలపై ప్రతిపక్ష నేతగా ఉదయనిధి స్టాలిన్ స్పందించాడు. తమిళనాడులో టీవీకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయాలు కొత్త మలుపు తీసుకున్నాయి. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి విజయ్ చేసిన ప్రసంగానికి ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ కౌంటర్ ఇస్తూ వ్యక్తిగత విమర్శలకు దిగారు. సీఎం విజయ్–సంగీత విడాకుల అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించారు. చెంగల్పట్టు కోర్టులో భర్త కోసం భార్య వెతుకుతున్న కథ రాష్ట్రానికి తెలుసని ఉదయనిధి స్థాలిన్ పేర్కొన్నారు. ప్రతిపక్షాలు రెచ్చగొట్టడం వల్లే రైతులు నిరసన తెలుపుతున్నారని విజయ్ పేర్కొనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపాడు. చిన్న స్టోరీ చెప్తానంటూ విజయ్ చేసిన వ్యాఖ్యలు రైతుల గౌరవానికి భంగం కలిగించేవిగా ఉన్నాయని ఉదయ్ నిధి స్టాలిన్ పేర్కొన్నాడు. చెంగల్పట్టు కోర్టులో భర్త కోసం భార్య వెతికే కథ మాత్రమే తమిళనాడు ప్రజలకు తెలుసంటూ సీఎం విజయ్ పై ఉదయనిధి వ్యక్తిగత విమర్శలు చేశారు. విజయ్ నుంచి విడాకులు కావాలని ఆయన భార్య సంగీత ఫిబ్రవరి 24న చెంగల్పట్టు ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో ఆగస్టు 7న తదుపరి విచారణ జరగనుంది.

# పరవాడ ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం

### దక్షిణ్ ఎనర్జీ' పరిశ్రమ అగ్నిప్రమాదంలో ఇద్దరు మృతి

### ఘటనపై ఆరా తీసిన సిఎం చంద్రబాబు

### తక్షణ సహాయ చర్యలకు ఆదేశం

### డిప్యూటి సిఎం పవన్, మంత్రి లోకేశ్ తదితరుల దిగ్భ్రాంతి





అనకాపల్లి,జూన్23 : పరవాడ ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం సంభవించింది. మంగళవారం తెల్లవారుజామున ప్లాస్టిక్ పైరోలిసిస్ ఆయిల్ తయారీ కంపెనీ దక్షిణ్ ఎనర్జీలో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో పలువురు కార్మికులు ఫ్యాక్టరీలోనే చిక్కుకుపోయారు. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతిచెందగా.. పలువురికి తీవ్రగాయాలు అయ్యాయి. ఘటన గురించి తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుంది. మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. మరోవైపు పోలీసులూ రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. అనకాపల్లి జిల్లా పరవాడలోని ఫార్మా సిటీలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫార్మా సిటీలోని 'దక్షిణ్ ఎనర్జీ' పరిశ్రమలో జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోవడంపై సంతాపం వ్యక్తం చేశారు. మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే, ఈ ప్రమాదంలో గాయపడిన బాధితులను తక్షణమే ఆదుకోవాలని, అత్యంత మెరుగైన వైద్య చికిత్స అందేలా చూడాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలని వేగవంతం చేశామని అధికారులు తెలిపారు. ప్రమాద తీవ్రతను గమనించి ఫార్మా సిటీ అగ్నిమాపక కేంద్రం నుంచి రెండు, పరవాడ కేంద్రం నుంచి మరొక ఫైర్ ఇంజన్‌ను తక్షణమే ఘటనా స్థలానికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పారిశ్రామిక ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరపాల్సిందిగా అధికారులను సీఎం ఆదేశించారు. ఇకపోతే అగ్నిప్రమాదంపై మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతిచెందడం విచారకరమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మరోవైపు క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. 'దక్షిణ ఎనర్జీ కెమికల్ ఫ్యాక్టరీ'లో జరిగిన అగ్ని ప్రమాదంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. ప్రమాదంపై ఆరా తీసిన ఉపముఖ్యమంత్రి... ఇద్దరు కార్మికులు మరణించడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు కార్మికులు మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని పవన్‌కు అధికారులు తెలియజేశారు. పరిశ్రమల్లో ప్రమాదాలను నివారించడానికి తీసుకుంటున్న చర్యలను సమీక్షించాలని డిప్యూటీ సీఎం సూచించారు. విశాఖపట్నం పరిసర పారిశ్రామిక ప్రాంతాల్లోని అన్ని సంస్థల్లో తక్షణమే భద్రతా తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. అగ్నిప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు సంతాపం తెలియజేస్తూ, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఫార్మాసిటీ ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కూడా స్పందించారు. ఈ ఘటన అత్యంత దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతిచెందడం విషాదకరమని పేర్కొన్నారు. గాయపడిన కార్మికులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ఉద్ధవ్ స్వయంకృతంతో పార్టీకి ముప్పు


### తండ్రి ఆశయాలు కాపాడడంలో పూర్తిగా విఫలం

ముంబై : మహారాష్ట్రలో బలంగా నిలిచిన శివసేన కథ ఇంక కంచికేనా అన్న చర్చ సాగుతోంది. బాణంలా దూసుకుని వచ్చిన బాల్ ఠాక్రే స్థాపించిన 'శివసేన' సరిగ్గా 60 వసంతాలు పూర్తి చేసుకుని వజ్రోత్సవ వేడుకలకు సిద్ధం అవుతున్న వేళ..అంతర్థానానికి దగ్గరవుతోంది. యాదృచ్ఛికమే అయినా 60 వసంతాల పార్టీ ఇలా కావడం స్వయంకృతమే. 1966 జూన్ 19న ముంబైలోని చారిత్రాత్మక శివాజీ పార్క్‌లో బాల్ ఠాక్రే కొబ్బరికాయ కొట్టి ఈ పార్టీని ప్రారంభించారు. నాడు కొద్దిమంది మద్దతుదారులు, వేలాది మంది 'మరాఠీ మానుస్' సాక్షిగా పురుడుపోసుకున్న ఈ ప్రాంతీయ మహావృక్షం.. రెక్కలు విరిగాయి. నేలకొరగడానికి సిద్దంగా ఉంది. విచిత్రమేమిటంటే.. బాల్ ఠాక్రే స్థాపించిన అసలైన 'శివసేన' పేరు, దాని సాంప్రదాయక 'విల్లు–బాణం' గుర్తు ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే వశమయ్యాయి. మరోవైపు ఉద్ధవ్ ఠాక్రే వద్ద తండ్రి పెట్టిన పార్టీ పేరు కానీ, గుర్తు కానీ మిగల్లేదు. వారి పార్టీ ఇప్పుడు 'శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే)'గా రూపాంతరం చెంది, 'మశాల్' (దివిటీ) గుర్తుతో మనుగడ సాగిస్తోంది. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆ దివిటీ సైతం దాదాపు ఆరిపోయే స్థితికి చేరుకుంది. శివసేనను స్థాపించినప్పుడు బాల్ ఠాక్రే రెండు ప్రధాన ఆశయాలను నిర్దేశిరచుకున్నారు. ఒకటి 'మరాఠీ అస్తిత్వం', రెండోది 'హిందుత్వ సిద్ధాంతం'. కానీ నేడు ఉద్ధవ్ ఠాక్రే తన తండ్రి నుంచి వచ్చిన ఈ రెండు రాజకీయ వారసత్వాలను కాపాడుకోవడానికి తీవ్రంగా పోరాడాల్సి వస్తోంది. బాల్ ఠాక్రే హయాంలో శివసేన సాధించిన శిఖరాగ్రాల నుంచి ఉద్ధవ్ హయాంలో ఎదుర్కొంటున్న జీవన్మరణ పరిస్థితి వరకు అనేక ఆటుపోట్లు ఎదుర్కొంది. 1992 జూలై 18న శివసేనలో జరిగిన ఘటన సంచనలంగా మారింది. బాల్ ఠాక్రే పార్టీని ఒక సొంత ఆస్తిలా చూస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో కలత చెందిన బాల్ ఠాక్రే, పార్టీ ముఖపత్రం 'సామ్నా'లో ఒక వ్యాసం రాస్తూ.. తాను శివసేన నుంచి తప్పుకుంటున్నట్లు సంచలన ప్రకటన చేశారు. ఈ వార్తతో మహారాష్ట్రవ్యాప్తంగా ఉన్న శివసైనికుల్లో తీవ్ర కలకలం రేగింది. ముంబైలోని శివసేన ప్రధాన కార్యాలయం వెలుపల లక్షలాది మంది సైనికులు తరలివచ్చి.. 'బాలాసాహెబ్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి' అని కన్నీటితో వేడుకున్నారు. శివసైనికులకు తనపై ఉన్న ఆ అచంచలమైన ప్రేమాభిమానాలను చూసి బాల్ ఠాక్రే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోక తప్పలేదు. బాల్ ఠాక్రే బతికున్నంత కాలం మహారాష్ట్ర రాజకీయాలకు కేంద్ర బిందువు వారి నివాసమైన 'మాతోశ్రీ' మాత్రమే. శివసేన అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా.. ముంబై నగర రిమోట్ కంట్రోల్ బాలాసాహెబ్ చేతుల్లోనే ఉండేది. 'మాతోశ్రీ' నుంచి చిన్న సంకేతం వస్తే చాలు.. ముంబై స్థంభించిపోయేది. శాంతిభద్రతల పరిరక్షణ కోసం స్వయంగా ముంబై పోలీసులు సైతం శివసేన ప్రముఖుడిని అభ్యర్థించాల్సిన పరిస్థితి ఉండేది. కోవిడ్ లాక్‌డౌన్ కంటే ముందే.. ముంబై లోకల్ రైళ్లకు బ్రేక్ వేయగల ఏకైక శక్తి బాల్ ఠాక్రేకే ఉండేదని ఇప్పటికీ ముంబై ప్రజలు చెప్పుకుంటారు. కానీ, నేడు బాల్ ఠాక్రే శతాబ్ది జయంతి ఉత్సవాల వేళ, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని పార్టీ రెండోసారి ఘోరమైన చీలికను ఎదుర్కొంటోంది. ఆయన కుడిభుజం లాంటి సంజయ్ రౌత్ కేవలం ప్రత్యర్థులపై వీధి రౌడీల తరహాలో విమర్శలు చేయడానికే పరిమితమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బాల్ ఠాక్రేకు, ఉద్ధవ్ ఠాక్రేకు రాజకీయ వ్యూహాల్లోనూ, వ్యక్తిత్వంలోనూ నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. బాల్ ఠాక్రే తన జీవితంలో ఎన్నడూ అధికార పీఠాన్ని ఆశించలేదు. ఆయన ఎప్పుడూ 'కింగ్' అవ్వాలని అనుకోలేదు, 'కింగ్‌మేకర్' గానే ఉండటానికి ఇష్టపడ్డారు. శివసైనికులు బాలాసాహెబ్ కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా సిద్ధపడ్డారంటే.. ఆయన దశాబ్దాల పాటు క్షేత్రస్థాయిలో చేసిన పోరాటమే దానికి కారణం. 2003 నుంచి పార్టీలో ఉద్ధవ్ జోక్యం పెరిగిన తర్వాత, శివసేన ఏకంగా నాలుగు సార్లు పెద్ద తిరుగుబాట్లను చవిచూసింది. ఉద్ధవ్‌పై తిరుగుబాటు చేసిన ప్రతి ఒక్కరి వాదన ఒక్కటే.. ఆయనలో బాల్ ఠాక్రే లక్షణాలు ఏమాత్రం లేవని, అయినా సరే అందరూ తనను బాలాసాహెబ్‌లాగే గౌరవించాలని ఉద్ధవ్ ఆశిస్తారని అసమ్మతి నేతలు ఆరోపిస్తుంటారు. బీజేపీతో కలిసి ఎన్నికల్లో గెలిచిన తర్వాత, ఉద్ధవ్ ఠాక్రే అనూహ్యంగా ప్లేట్ ఫిరాయించి కాంగ్రెస్, ఎన్సీపీలతో చేతులు కలిపి స్వయంగా ముఖ్యమంత్రి అయ్యారు. అంతేకాకుండా తన సొంత మంత్రివర్గంలో కొడుకు ఆదిత్య ఠాక్రేకు మంత్రి పదవి కట్టబెట్టారు. ఉద్ధవ్ నిర్ణయాలపై ఆయన భార్య రష్మి ఠాక్రే, కుమారుడు ఆదిత్య ఠాక్రే, సంజయ్ రౌత్‌లతో కూడిన ఒక ప్రత్యేక కోటరీ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ఇది బాలాసాహెబ్ ఇమేజ్ ముందు ఉద్ధవ్‌ను బలహీనంగా మార్చేసిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తారు. బాల్ ఠాక్రే బతికుండగానే జరిగిన మొదటి తిరుగుబాటు ఇది. భుజబల్ ఆ తర్వాత కాంగ్రెస్, ఎన్సీపీల ద్వారా రాజకీయాల్లో కొనసాగారు. విచిత్ర మేమిటంటే, ఆ తర్వాత కాలంలో అదే భుజబల్‌ను ఉద్ధవ్ తన మంత్రివర్గంలో చేర్చుకోవాల్సి వచ్చింది.ఇప్పుడు ఏక్‌నాథ్ షిండేతో మొత్తం శివసేన రూపం మారిపోయింది. అసపలు శివసేనకు షిండే నాయకుడయ్యారు. ఇటీవల ఆరుగురు ఎంపీలు కూడా వెళ్లిపోవడంతో ఉద్ధవ్ శివసేన మరింత బలహీనపడింది.

## ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలి

### - ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు, - ఎస్సై కొట్టే ప్రసాద్

### - సర్పంచ్ జంగిలి పోచాలు



రామగిరి,జూన్ 23(ది క్రైమ్ న్యూస్):– కమాన్ పూర్ మండలం ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు ప్రోత్సహించే బాధ్యత మనందరిపై ఉందని ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు, ఎస్సై కొట్టే ప్రసాద్, సర్పంచులు జంగిలి పోచాలు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రంగు సత్యనారాయణ గౌడ్ అన్నారు. మంగళవారం కమాన్ పూర్ మండలంలోని గుండారం లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల వివరాలపై సీనియర్ జర్నలిస్టు రూపొందించిన సిడిని మంగళవారం కళాశాల ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సిడిని ప్రముఖ మెజీషియన్ యాంకర్ మేజిక్ రాజా వ్యాఖ్యాతగా వ్యవహరించగా చంద్రపాల్ ఎడిటింగ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుండారం కళాశాలలో విద్యార్థుల సంఖ్య దినదినం పెరిగిపోతుందని దీనికిగాను ఉపాధ్యాయుల విద్యాబోధన మరియు ప్రిన్సిపాల్ కాశీమల్ల సుధాకర్ ప్రోత్సాహమే అని అన్నారు. ఈ కళాశాలలో ఇప్పటికే 160 మంది నూతన విద్యార్థులు చేరినట్లు ప్రిన్సిపాల్ కాశీమల సుధాకర్ తెలిపారు. అలాగే తమ తమ గ్రామాల్లోని పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను గుండారం కళాశాలలో చేరేలా ప్రోత్సహించే బాధ్యత ప్రతి ప్రజా నిధి పై నాయకులపై ఉందని పేర్కొన్నారు. ఈ సిడిని తాను సొంతంగా తీసి కళాశాల యొక్క విశిష్టతను ప్రజలకు వివరించేలా తీసిన జబ్బార్ ఖాన్ కు ప్రత్యేక కృతజ్ఞతలు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమాన్ పూర్ సర్పంచ్ సోహెల్, గుండారం హెచ్ఎం రమణారెడ్డి, వార్డు సభ్యులు దామెర దేవయ్య, మెరుగు కుమార్, పచ్చునూరి రాజ్ కుమార్,లెక్చరర్లు జాలిగాం రమేష్, సంజీవ్, హేమచందర్, వంశీ, రూప, వసీం, వినోద, మధుసూదన్ ,చిరంజీవి, సంజీవ్,లైబ్రరీ రియల్ నగేష్, తోపాటు మల్యాల మహేష్, కమ్మ గోని అనిల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సిడి రూపకర్త జబ్బార్ ఖాన్ ను ఘనంగా సన్మానించారు.

## శ్రీవాణి ట్రస్ట్ నుంచి ఆరు ఆలయాలకు నిధులు

### అభివృద్ధికి అనుమతించిన ప్రభుత్వం

అమరావతి,జూన్23 : తితిదే బోర్డు, శ్రీవాణి ట్రస్ట్ తీర్మానాల మేరకు ఆరు దేవాలయాల పునర్నిర్మాణం, అభివృద్ధి పనులకు శ్రీవాణి ట్రస్ట్ నిధులు వెచ్చించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సికింద్రాబాద్ (శ్రీగిరి)లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.50లక్షలు, ధర్మవరం (సిద్ధయ్యగుట్ట)లోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి రూ.50.85లక్షలు, సిద్దిపేట జిల్లా దొమ్మాటలోని శ్రీమహాకాళేశ్వర ఆలయానికి రూ.4.60 కోట్లు కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది.అనకాపల్లి జిల్లా మునగపాకలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయానికి రూ.1.75కోట్లు, సంగారెడ్డి జిల్లాలోని కించన్‌పల్లిలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.1.09కోట్లు, కర్నూలు జిల్లా హుస్సేనాపురం లోని శ్రీసుంకులమ్మ, మారెమ్మ దేవాలయానికి రూ.1.10కోట్ల నిధులు కేటాయించేందుకు అనుమతించింది.

## ఫోన్ అతిగా వాడొద్దంటూ తల్లి మందలింపు

### అలిగి చెరువుల పడి ఆత్మహత్య చేసుకున్న బాలుడు

చిత్తూరు,జూన్23 : చిత్తూరు జిల్లా బంగారుపాల్యం మండలంలో తీవ్ర విషాదాన్ని నింపిన ఒక ఘోర ఘటన వెలుగుచూసింది. కేవలం మొబైల్ ఫోన్ వాడకం విషయంలో తల్లి మందలించిందనే చిన్న కారణంతో.. 17 ఏళ్ల సుశాంత్ అనే బాలుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సుశాంత్ ప్రతిరోజూ ఫోన్‌ను ఎక్కువగా చూస్తూ కాలక్షేపం చేస్తుండేవాడు. దీనిపై గమనించిన తల్లి, ఫోన్ అంతగా చూడొద్దని.. చదువుపై దృష్టి పెట్టాలని కాస్త గట్టిగా మందలించింది. తల్లి మాటలకు తీవ్రంగా అలిగిన సుశాంత్, క్షణికావేశంలో ఎవరికీ చెప్పకుండా ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. ఎంతసేపటికీ బాలుడు తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు అతని మొబైల్ నంబర్‌కు ప్రయత్నించగా.. ఫోన్ స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో కంగారుపడిన తల్లిదండ్రులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో గాలింపు చేపట్టినప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోవడంతో, చివరకు తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలోనే స్థానిక గుంతూరు చెరువులో ఒక మృతదేహం తేలియాడుతోందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీయగా.. అది కనిపించకుండా పోయిన సుశాంత్‌దేనని అధికారులు నిర్ధారించారు. తల్లి మందలించిందనే మనోవేదనతోనే బాలుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ ఘటనతో ఆ కుటుంబంలోనే కాక గ్రామంలోనూ విషాద ఛాయలు అలముకున్నాయి.

## అదనపు కట్నం వేధింపులు

### అత్తగారింటి ముందు కోడలు టెంట్ వేసి ధర్నా

మేడ్చల్,జూన్23 : జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని కైలాష్ హిల్స్‌లో ఓ మహిళ తన అత్తగారింటి ముందు టెంట్ వేసుకుని ధర్నాకు దిగిన ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. జయశ్రీ (25) అనే మహిళ తన భర్త, అత్తమామల వేధింపులు భరించలేక ఈ నిరసనకు దిగినట్లు తెలిపింది. బాధితురాలి కథనం ప్రకారం, వివాహ సమయంలో రూ.10 లక్షల కట్నంతో పాటు ఐదు కిలోల వెండి, బంగారు ఆభరణాలు ఇచ్చినప్పటికీ, అదనపు కట్నం కోసం భర్త కుటుంబ సభ్యులు నిరంతరం వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించింది. అదనపు డబ్బు తీసుకురావాలని ఒత్తిడి చేయడమే కాకుండా, ఎదురు తిరిగి మాట్లాడితే మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. అంతేకాకుండా, తనపై అసత్య ఆరోపణలు చేస్తూ వ్యభిచారం చేస్తోందంటూ ముద్రవేసి మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని పేర్కొంది.



# విడాకుల ర్యూమర్స్‌ను తోసిపుచ్చిన సంగీత

సీనియర్ నటి సంగీత, ఆమె భర్త, సింగర్ క్రిష్ విడాకులు తీసుకోబోతున్నారంటూ సోషల్ మీడియాలో ఇటీవల వార్తలు వస్తున్న నేపథ్యంలో తాజాగా ఈ వార్తలపై నటి సంగీత స్పందించింది. సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని తెలిపింది. ఈ సందర్భంగా తన భర్త క్రిష్‌తో కలిసి దిగిన ఒక ఫొటోను సోషల్ మీడియా వేదిక పంచుకుంది. గతంలో సంగీత తన ఇన్‌స్టాగ్రామ్ బయోలో సంగీత క్రిష్ అని ఉన్న పేరును సంగీతగా మార్చడంతో వీరిద్దరూ విడిపోతున్నట్లు- పుకార్లు మొదలయ్యాయి. అయితే ఈ పుకార్లకు చెక్ పెడుతూ మేము బాగానే ఉన్నట్లు- సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. సినిమాల విషయానికి వస్తే.. ఆచర్య, మసూద, వారసుడు తదితర చిత్రాలతో ఇటీ-వల ప్రేక్షకులను అలరించింది ఈ భామ.



## వరుస సినిమాలతో ప్రభాస్ బిజీ

ఇండియన్ సినిమా బిగ్గెస్ట్ సూపర్ స్టార్‌గా గుర్తింపు పొందిన ప్రభాస్ ప్రస్తుతం వరుస పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాడు. 'బాహుబలి' తర్వాత ఆయన క్రేజ్ ప్రపంచవ్యాప్తంగా విస్తరించగా, ప్రతి సినిమా మీద అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. అయితే ఈ ఏడాది విడుదలైన 'రాజా సాబ్' సినిమా మాత్రం అభిమానులు ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. ఇదిలా ఉంటే, దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. మొదట ఈ చిత్రాన్ని 2026 చివర్లో విడుదల చేయాలని భావించినప్పటికీ, ప్రస్తుతం ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం 'ఫౌజీ' 2027లో విడుదలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. అయితే ఇదే ఇప్పుడు ప్రభాస్ అభిమానులకు మరింత ఆనందాన్ని కలిగిస్తోంది. ఎందుకంటే 2027లో ప్రభాస్ నుంచి ఏకంగా మూడు భారీ ప్రాజెక్టులు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందులో మొదటిగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న 'స్పిరిట్' ఉంది. ఈ చిత్రంలో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నాడనే ప్రచారం ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. మరోవైపు 'బాహుబలి' ప్రపంచాన్ని మరోసారి తెరపైకి తీసుకొచ్చే యానిమేషన్ చిత్రం 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' కూడా 2027లో విడుదల కానున్నట్లు తెలుస్తోంది. 'బాహుబలి' ఫ్రాంచైజీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ ప్రాజెక్ట్‌పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. అదే సమయంలో 'ఫౌజీ' కూడా అదే ఏడాదిలో విడుదలైతే, ప్రభాస్ అభిమానులకు ఒకే ఏడాదిలో మూడు భారీ ట్రీట్స్ లభించినట్లవుతుంది.




# శ్రీలీలతో నిర్మాతలకు భరోసా

హీరోయిన్‌గా, డ్యాన్సర్‌గా డ్యూయల్ రోల్ శ్రీలీల ఉంటే ఇక ఆ సినిమాలో స్పెషల్ సాంగ్స్ కోసం మరో భామను వెతకాల్సిన పని లేదు. ఎందుకంటే హీరోయిన్ రోల్‌కే కాదు ఐటమ్ నెంబర్‌కు ఫర్ ఫెక్ట్ ఛాయిస్‌గా మారిపోయింది. డ్యూయెట్ సాంగైనా, ఊర మాస్ పాటైనా మేడమ్ రచ్చ రంబోలా చేయాల్సిందే. స్పెషల్ సాంగ్ కోసం స్టార్ హీరోయిన్లకు నిర్మాతలు కోట్లు వెచ్చించి తెచ్చుకునే ఛాన్స్ లేకుండా కిసిక్ బ్యూటీ డ్యూయల్ రోల్ పోషించేస్తోంది. ధమాకాలో పల్సర్ బైక్, జింతాకా అంటూ మాసీ స్టెప్పులు మొదలెట్టిన దగ్గర నుండి డ్యాన్సింగ్ క్వీన్‌గా ముద్రపడిపోయింది శ్రీలీల. ఫీమేల్ లీడ్‌గా నటిస్తే మాస్ సాంగ్ కంపల్సరీ. ఇక ఐటమ్ నంబర్ కోసం మరో భామకు తెచ్చుకోనక్కర్లేదు. ఏ టు- జెడ్ ఫెర్మామెన్స్ ఇచ్చేస్తుంది కిస్సిక్ బ్యూటీ-. యూట్యూబ్‌ను షేక్ చేయాలంటే మిస్ లీల ఉంటే చాలనేంతలా ప్రొడ్యూసర్ల మైండ్లలో ఫిక్స్ అయ్యేలా చేసింది. సినిమాపై హైప్ రావాలా, అ-టె-న్షన్ కావాలా వైరల్ వయ్యారీతో డ్యాన్స్ చేస్తే పోలా అని భావిస్తున్నారు. గుంటూరు కారంలో కుర్చీ మడత పెట్టినా, జూనియర్‌లో వైరల్ వయ్యారీగా మారినా తాను హీరోయిన్ కాని పుష్ప2లో కూడా కిస్సిక్ బ్యూటీ-గా ర్యాంపేజ్ గ్లామర్ షోతో మాస్ మహారాణిగా మారిపోయింది. ఇటు- హీరోయిన్‌గా, ఇటు- ఐటమ్ గర్ల్ గా మూవీకి వన్ ఉమెన్ షోగా మేకోవరైంది శ్రీలీల. అంటే నిర్మాతలకు డబుల్ బోనాంజాలా మారిన మేడమ్.. నెక్ట్స్ రవితేజ మూవీ మాస్ జాతరలోనూ అటు- క్లాసీ లుక్, ఇటు- మాసీ సాంగ్స్‌లో గత్తర లేపడానికి రెడీ అయ్యింది. మరోసారి ఈ జోడీ బాక్సాఫీస్ దగ్గర ధమాకా హిట్ నమోదు చేస్తుందా ఎ÷-లాపుల్లో ఉన్న రవితేజ, శ్రీలీలకు కంబ్యాక్ మూవీగా మారుతుందో లేదో చూడాలి.



## మా ఇంటి బంగారాన్ని అభినందించిన మెగాస్టార్

స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం విడుదలైన తర్వాత మంచి స్పందనను అందుకుంటోంది. దర్శకుడు రాజ్ నిడిమోరుతో వివాహం అనంతరం సమంత నటించిన తొలి సినిమా కావడంతో ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. జూన్ 19న థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం పాజిటివ్ టాక్‌తో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా మంచి వసూళ్లను నమోదు చేస్తోంది. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. సమంత, రాజ్ నిడిమోరు దంపతులతో పాటు దర్శకురాలు నందిని రెడ్డి, చిత్ర యూనిట్ సభ్యులను తన నివాసానికి ఆహ్వానించిన ఆయన, సినిమా విజయంపై శుభాకాంక్షలు తెలిపారు. సినిమా చూసిన అనంతరం చిరంజీవి తన అభిప్రాయాన్ని పంచుకుంటూ, మా ఇంటి బంగారం చాలా ఆసక్తికరంగా అనిపించింది. ఉమ్మడి కుటుంబం నేపథ్యంలో యాక్షన్, భావోద్వేగాలను అందంగా మేళవిస్తూ దర్శకురాలు నందిని రెడ్డి తనదైన శైలిలో వినోదాత్మకంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు అని పేర్కొన్నారు. అలాగే సమంత నటనను ప్రత్యేకంగా ప్రశంసించిన ఆయన, సమంత నటన అద్భుతంగా ఉంది. ముఖ్యంగా చీరకట్టులో ఆమె చేసిన యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇటువంటి మహిళా ప్రాధాన్య చిత్రాలు తెలుగు సినీ పరిశ్రమకు అవసరం. ఈ విజయానికి సమంత, నందిని రెడ్డి, రాజ్ మరియు మొత్తం చిత్ర బృందానికి హృదయపూర్వక అభినందనలు అని తెలిపారు. మరోవైపు జీవితంలో కొత్త అధ్యాయాన్ని ఆహ్వానిస్తున్న సమంత, రాజ్ దంపతులకు ప్రత్యేక అభినందనలు అని ఆయన పేర్కొన్నారు. చిరంజీవి సతీమణి సురేఖ సమంత దంపతులకు కొత్త బట్టలు పెట్టి ఆశీర్వదించారు. ఈ కామెంట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీసింది. ముఖ్యంగా 'కొత్త అధ్యాయం' అనే పదం అభిమానుల దృష్టిని ఆకర్షించింది. దీనిపై సోషల్ మీడియాలో పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. సమంత ప్రగ్నెన్సీ విషయంలో చిరు ఈ కామెంట్ చేశారా అని పలువురు ముచ్చటించుకుంటున్నారు.



## వారసత్వం ఉన్నా...
# కష్టపడితేనే ఫలితం
### ప్రేక్షకులు ఊరికే ఆదరిస్తానుకోరాదు
### నటుడు రామ్ చరణ్

సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ.. ప్రేక్షకులు ఎప్పుడూ నటుడి నటను చూసే ఆదరిస్తారని రామ్ చరణ్ అన్నారు. తాజాగా ఆయన 'రిపబ్లిక్ సమ్మిట్'లో పాల్గొని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. బిజినెస్ భాషలో చెప్పాలంటే.. 'పెద్ది' సినిమా తన కెరీర్‌కు బెస్ట్ 'స్టార్టప్' లాంటిదని వెల్లడించారు. నా చిన్నప్పుడు దర్శకులు, నిర్మాతలు 'మీ నాన్న కంటే బాగా చేయాలి' అని చెప్పినప్పుడు బాధ్యతగా అనిపించేది. నేను ఆ ఒత్తిడిని పెద్దగా పట్టించుకోలేదు. మా నాన్న ఇంట్లో సరదాగా ఉంటారు. మా డైనింగ్ టేబుల్ మీద సినిమా చర్చలు, స్టార్డమ్ ముచ్చట్లు ఎప్పుడూ రానిచ్చేవారు కాదు. సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి రావడం వల్ల త్వరగా ఒక మంచి వేదిక దొరుకుతుందనేది నిజమే.. కానీ, ప్రేక్షకులు మనల్ని ఎవరి వారసుడు అని చూడరు.. మొదటి సినిమా తర్వాత కేవలం మన కష్టం, నిజాయతీ మాత్రమే చూస్తారు. నా 15 ఏళ్ల కెరీర్‌లో ఆయన నాకు ఎప్పుడూ నటన పరంగా ఫీడ్‌బ్యాక్ ఇవ్వలేదు. నన్ను వేలు పట్టి నడిపించలేదు. కానీ క్రమశిక్షణ విషయంలో ఆయనే నాకు స్ఫూర్తి అని చెప్పారు. ఓటీటీల ట్రెండ్ గురించి మాట్లాడుతూ.. థియేటర్లు, ఓటీటీలు రెండూ ఒకదానికొకటి సాయం చేసుకుంటూ ముందుకు సాగాలి. 'ఆర్ఆర్ఆర్' థియేటర్లలో విడుదలైన తర్వాత నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి వచ్చింది. దానివల్ల పాశ్చాత్య దేశాల ప్రజలకు కూడా సినిమా చేరి, ఆస్కార్ నామినేషన్ వరకు వెళ్లేలా క్రేజ్ పెరిగింది. భారతదేశంలో ఇప్పటికీ ఒక కుటుంబానికి అత్యంత తక్కువ ఖర్చుతో దొరికే వినోదం సినిమానే. థియేటర్లలో పాప్‌కార్న్ ధరలు కాస్త తగ్గితే ఇంకా బాగుంటుంది. సినిమా అనేది ఓ భావోద్వేగం.. అది ఎప్పటికీ అలానే ఉంటుంది. దేశభక్తి కథలకు ఎప్పుడూ ప్రాధాన్యతనివ్వాలి. ఒక సినిమా రూ.500 కోట్లు లేదా రూ.800 కోట్లు వసూలు చేస్తోందంటే, దానర్థం దేశంలోని ప్రజలు ఆ కథను తమ సొంత కథగా భావించి ఆదరిస్తున్నారనే. దేశాన్ని ఏకం చేసే ఇలాంటి సినిమాలు రావడం గొప్ప విషయం' అని రామ్ చరణ్ తెలిపారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com